ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 14.03.2025 | సంపుటి : 11 సంచిక : 242 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# డీలిమిటేషన్‌పై ఢిల్లీని కదిలిద్దాం రండి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేటీఆర్‌లకు స్టాలిన్ లేఖ

- 22న జేఏసీ సమావేశానికి రావాలంటూ ముఖ్యమంత్రికి డీఎంకె నేతల వినతి
- పార్టీ అధిష్టానం ఆదేశాలు తీసుకుని వస్తానన్న సీఎం
- తెలంగాణలో అంతకుముందే అఖిలపక్ష భేటీ
- కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికీ ఆహ్వానం


జేఏసీ సమావేశానికి రావాలంటూ ఢిల్లీలో సీఎం రేవంత్‌ని కలిసి ఆహ్వానం అందిస్తున్న డీఎంకె నేతలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఢిల్లీ పర్యటనలో ఉన్న రేంవత్‌ని 22న జరగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరు కావాలని తమిళ నాడు డీఎంకే నేతలు ఆహ్వానించారు. ఈ క్రమం లో జేఏసీ సమావేశానికి రేవంత్ రెడ్డి రావాలని డీఎంకే ఎంపీలు కనిమొళి, రాజా, ఎన్. ఇలాం గో, కళానిధి వీరస్వామి సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. స్టాలిన్ డీలిమిటేషన్ విషయంలో చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. తమిళనాడులో సమావేశానికి హాజరయ్యేందుకు ఏఐసీసీ అనుమతి తీసుకుని వస్తామన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుం దని, ఉత్తరాది రాష్ట్రాల కంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నాయని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు తీసుకుని డిఎంకె నిర్వహించే జెఏసి సమావేశానికి హాజ రవుతానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రా ష్ట్రాలకు తీవ్రఅన్యాయం జరుగబోతోందని అన్నా రు. దీనిపై తెలంగాణ కాంగ్రెస్ కూడా అఖిలపక్ష భేటీని ఏర్పాట చేసిందన్నారు.

మిగతా 2లో..

### ఆహ్వానం అందింది.. హాజరవుతాం

దక్షిణాది రాష్ట్రాల జేఏసీ సమావేశంలో పాల్గొంటామన్న కేటీఆర్


వార్త 2లో

# తెలంగాణ రైజింగ్‌కు సహకరించండి

## విదేశీ పర్యటనల్లో ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయండి

ఈ ఏడాది హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలకు మద్దతివ్వండి

విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ(జనంసాక్షి):రాబోయే 25 సంవత్సరాల్లో తెలంగాణను సమున్నతంగా నిలిపేందుకు తమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్ర మాలకు మద్దతుగా నిలవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి గురువారం కలిశా రు. ఈసందర్భంగా 2025 సంవత్సరంలో హైదరాబాద్‌లో ప్రతి ష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ కార్యక్రమాలైన మిస్ వరల్డ్, గ్లోబల్ డీప్ టెక్ సదస్సు, భారత్ సమ్మిట్, యానిమేషన్ గేమింగ్, వీఎఫ్ఎక్స్‌తో పాటు వినోద పరిశ్రమలో తెలంగాణ బలాన్ని చాటే ఇండియా జాయ్ వివరాలను కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఈ కార్యక్రమాల నిర్వహణ ద్వారా తెలంగాణ

మిగతా 2లో..

ఢిల్లీలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి →



### గాంధీ కుటుంబంతో నాకు మంచి అనుబంధం

- దాని కోసం ఎవరితోనూ ఫోటోలు దిగి నిరూపించుకోవాల్సిన అవసరంలేదు
- తెలంగాణలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం
- అందుకే ముగ్గురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చాం
- కేసీఆర్ గవర్నర్ ప్రసంగానికి కాదు.. చర్చకు రావాలి
- ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారు
- ఢిల్లీ మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):మేము ఎన్నికల్లో ఇచ్చి న వాగ్దానాలతోపాటు పార్టీలో కీలకంగా పనిచే సిన వారికి ఇచ్చిన మాటను నిబెట్టుకుం టున్నా మని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు రానివారికి అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తా నని హామీ ఇచ్చానని.. అవన్నీ ఇప్పుడు అమలు

మిగతా 2లో..

### ఎస్ఎల్‌బీసీ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు




మహబూబ్‌నగర్(జనంసాక్షి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్‌లో సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయక చర్యల పురోగతిని సమీక్షించి.. తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహాయక బృందాలతో ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తూ.. ఏ రోజుకు ఆ రోజు చేయాల్సిన పనులను అధికారులు సహాయక బృందాలకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. సహాయక బృందాలు ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్లను 24 గంటలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించే పనిలో

మిగతా 2లో..

### ఇస్రో మరో అరుదైన ఘనత

స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతం



న్యూఢిల్లీ (జనంసాక్షి): అంతరిక్ష ప్రయోగాల్లో భాగంగా ఉపగ్ర హాలను నింగిలోనే అనుసంధానం చేసే మిషన్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన విషయం తెలిసిందే. భవిష్యత్‌లో చేపట్టబోయే భారీ అంతరిక్ష

మిగతా 2లో..

# సభ మీ సొంతం కాదు



## జగదీష్ రెడ్డి X స్పీకర్

స్పీకర్ చైర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెన్షన్

సమావేశాలు ముగిసేవరకు వేటు



పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నిండుసభలో దళిత స్పీకర్‌ను అవమానించడం దారుణం : మంత్రి సీతక్క

ఎథిక్స్ కమిటీకి అప్పగించాలని డిమాండ్

హైదరాబాద్(జనంసాక్షి):మాజీ మంత్రి, బీఆ ర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి శాసనసభ నుంచి సస్పెండ్ అయ్యారు. బడ్జెట్ సమావే శాలు ముగిసే వరకు జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సస్పెండ్ అయిన సభ్యుడిని సభ నుంచి బయటకు పంపాలని స్పీకర్ ఆదేశించారు. కాగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సభలో గందరగోళం సృష్టించాయి. 'మీరు మేము ఎన్నుకుంటేనే స్పీకర్ అయ్యారు. సభ మీ ఒక్కరిదీ కాదు – సభ అందరిదీ' అని స్పీకర్‌ను ఉద్దేశించి జగదీష్ రెడ్డి అన్నారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు జగదీష్ వ్యాఖ్యలపై శాసనసభలో వాడీవేడీ చర్చ జరిగింది. సభ లోపల, బయట స్పీకర్ నిర్ణయాన్ని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఏకవచనంతో స్పీకర్‌పై మాట్లాడటం బాధాకరమన్నారు. స్పీకర్‌ను అవమానించకుండా ఆదర్శంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి అప్పగించాలని..

మిగతా 2లో..

### నేడు బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త నిరసనలు

సస్పెన్షన్‌కు భయపడేదిలేదు : జగదీష్ రెడ్డి

ఉద్దేశపూర్వకంగానే సస్పెండ్ చేశారు: కేటీఆర్

ఏకపక్ష నిర్ణయం: హరీశ్‌రావు


2లో




## ఐదు ఎమ్మెల్సీలు ఏకగ్రీవం

నిబంధనల మేరకు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐదు స్థానాలకు 5 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్‌నాయక్, భారాస నుంచి దాసోజు శ్రవణ్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం ఎన్నికయ్యారు. వీరు కాకుండా ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు నిబంధనల మేరకు లేకపోవడంతో రిటర్నింగ్ అధికారి వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురు వారం సాయంత్రం 5గంటలకు ముగిసింది. దీంతో ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. దాసోజు శ్రవణ్ ఎట్టకేలకు చట్టసభలో ప్రవేశించే అవకాశం దక్కించుకున్నారు. గతంలో గవర్నర్ కోటాలో దాఓజును నామినేట్ చేసినా ఆనాటి గవర్నర్ తమిళసై తిరస్కరించడంతో ఆయన అవకాశం కోల్పోయారు.

### 15 నుంచి ఒంటిపూట బడులు



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటల నుంచే భానుడి తన ప్రతా పాన్ని చూపిస్తున్నాడు. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావటానికి జనం

మిగతా 2లో..

# చర్చించుకుందాం రండి..



## అమెరికాతో ట్రేడ్ వార్‌పై చైనా వ్యాఖ్య

బీజింగ్(జనంసాక్షి): అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే చైనాపై సుంకాలతో విరుచుకుపడ్డారు డొనాల్డ్ ట్రంప్. అం దుకు ప్రతిగా బీజింగ్ కూడా దూకుడు నిర్ణయాలు తీసు కుంది.దీంతో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిణామాలపై తాజాగా చైనా స్పందిస్తూ.. అగ్రరాజ్యంతో చర్చలకు పిలుపునివ్వడం గమనార్హం."ఆర్థిక, వాణిజ్య రంగాల్లో విభేదాలు, వివాదాల పరిష్కారం విషయంలో చైనా – అమెరికా దేశాలు సానుకూల, సహకార వైఖరిని అవలంబించాలని మేం ఎల్లప్పుడూ కోరుకుంటాం. అయితే, ఇరు దేశాల మధ్య ఆ సంప్రదింపులు, చర్చలు పరస్పర ప్రయోజనాలు, సమానత్వం, గౌరవంపై ఆధారపడి జరగాలని ఆశిస్తున్నాం. బెదిరింపులు, కవ్వింపులతో ప్రతికూల ఫలితాలే వస్తాయి. అమెరికా, చైనా కలిసి పనిచేస్తాయని ఆశిస్తున్నాం. చర్చలతో సమస్యను పరిష్క రించుకోవడమే సరైన మార్గం" అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి హీ యాంగ్‌కియాన్ మీడియా సమా వేశంలో వెల్లడించారు.అమెరికా అధ్యక్షుడిగా జనవరిలో ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ ఆ వెంటనే మెక్సికో, కెనడాతో పాటు చైనాపై సుంకాలు విధించారు. ప్రమాదకర ఫెంటనిల్ సరఫరాను అడ్డుకోవడంలో విఫలమైనందుకు గానూ బీజింగ్‌పై 10శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవలే సుంకాలను 20శాతానికి పెంచుతున్నట్లు మరో షాకిచ్చారు. దీనికి చైనా సర్కారు కూడా దీటుగా స్పందించింది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు, పోర్క్, చికెన్ వంటి

మిగతా 2లో..

### ట్రంప్ టారీఫ్ వార్

ఈయూ సుంకాలు పెంచితే.. తానూ ఇంకా ముందుకెళ్తానన్న అమెరికా అధ్యక్షుడు

వార్త 2లో



## హైజాక్‌పై పాక్ అబద్ధాలు

మేము ఇంకా సైన్యంతో పోరాడుతున్నాం


బలోచ్ రెబల్స్ ప్రకటన

ఇస్లామాబాద్(జనంసాక్షి):పాకిస్థాన్‌లో రైలు హైజాక్ ఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మిలిటెంట్ల నుంచి బందీలను విడిపించేందుకు తాము నిర్వహించిన ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని పాక్ ఆర్మీ చేసిన ప్రకటనను బలోచ్ వేర్పాటువాదులు ఖండించారు. తాము ఇంకా సైన్యంతో పోరాడుతున్నామని బలోచ్ లిబరేషన్ ఆర్మీ గురువారం తన ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి "బలోచిస్థాన్‌లోని బోలన్ జిల్లాలో ఆపరేషన్‌ను ముగించినట్లు పాక్ ఆర్మీ చేసిన ప్రకటన అబద్ధం.

మిగతా 2లో..

## తొలిసారిగా యుద్ధభూమిలోకి పుతిన్

మిలటరీ దుస్తుల్లో కర్స్క్‌లో పర్యటించిన రష్యా అధ్యక్షుడు



మాస్కో(జనంసాక్షి):రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తొలిసారిగా యుద్ధ భూమిలోకి అడుగుపెట్టారు. పశ్చిమ రష్యా లోని కర్స్క్‌లో బుధవారం ఆయన పర్యటించారు.ఈ ప్రాంతంలోని కొంత భూభాగాన్ని ఉక్రెయిన్ దళాలు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పుతిన్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. కర్స్క్‌లోని రష్యా దళాల కంట్రోల్ సెంటర్‌కు అధ్యక్షుడు వెళ్లారు. ఆయన మిలిటరీ దుస్తుల్లో ఉన్న దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. ఈ సందర్భంగా యుద్ధ భూమిలోని పరిస్థితులను రష్యన్ జనరల్ స్టాఫ్ హెడ్ వలెరీ జెరసిమోవ్.. పుతిన్‌కు వివరించారు. కొంతమంది ఉక్రెయిన్ సేనలు తమకు లొంగిపోయినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఈ ప్రాంతం నుంచి కీవ్

మిగతా 2లో..

### కర్స్క్‌లో రష్యా బలగాల పైచేయి..

అతిపెద్ద పట్టణమైన సుడ్జా తిరిగి స్వాధీనం

వార్త 2లో

### సీఎం 'భంగ్' తాగి సభకు వస్తున్నారు

మత్తులో ఆయన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు

మండలిలో నీతీశ్‌తో రబ్రీదేవి తీవ్ర వాగ్వాదం


వార్త 9లో

## ఢిలిమిటేషన్‌పై ఢిల్లీని కదలిద్దాం రండి

దీనికి కేంద్ర మం త్రి కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించామని అన్నా రు. కేంద్ర కేబినేట్‌లో ఉన్న కిషన్ రెడ్డి దక్షిణాది రాష్ట్రాల ఇబ్బందులను కేంద్రానికి తెలియచే యాల్సి ఉందన్నారు. తెలంగాణలో కూడా డీలి మిటేషన్ పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తు న్నామన్నారు. దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా రావాలని కోరుతున్నట్లు చెప్పా రు. ఈ క్రమంలో కిషన్ రెడ్డి తన అభిప్రా యాలను కేంద్ర క్యాబినెట్‌లో వినిపించాల్సిన అవసరం ఉందని రేవంత్ ప్రస్తావించారు. తెలంగాణలోని అన్ని పార్టీలు కూడా ఆ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ క్రమంలో డీలిమిటేషన్ పై మార్చి 22న జరుగనున్న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్యమంత్రికి ఆహ్వానం అందింది. తమిళనాడులో జరగనున్న ఈ సమావేశానికి పలు ప్రాంతీయ పార్టీలు హాజరై డీలిమిటేషన్ పై వారి అభిప్రాయాలను తెలియజేయనున్నాయి. ఇప్పటికే డీలిమిటేషన్ పై తమిళనాడు డీఎంకే నేతలు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ పక్రియ తమ రాష్ట్రంలో ప్రజల హక్కులను హరించే దిశగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ కూడా ఈ అంశంపై చర్చిస్తామన్నారు. దీంతో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం ముఖ్యమైన చర్చలకు ఒక వేదికగా నిలిచే అవకాశం ఉంది. ఈ సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతాల ప్రగతికి సంబంధించిన నిర్ణయాలను తీసుకునేందుకు కీలక అంశంగా మారనుంది. డీలిమిటేషన్ వల్ల వచ్చే రాజకీయ పరిణామాలు, రాష్ట్రాల మధ్య సంబంధాలు, వాస్తవాలపై ప్రాధాన్యం కలిగిన అనేక అంశాలపై చర్చలు జరగనున్నాయి. అయితే ఈ భేటీకి మరికొన్ని రోజుల సమయం ఉన్న నేపథ్యంలో మరిన్ని రాష్ట్రాలు కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## 17మంది మావోయిస్టుల లొంగుబాటు..

బీజాపూర్(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 17మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మంది తలలపై రూ.24లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సీఆర్‌పీఎఫ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు దినేష్ మొడియం (36), అతడి భార్య జ్యోతి తాటి అలియాస్ కళా మొడియం (32) ఉన్నట్లు తెలిపారు. దినేష్ తలపై రూ.8లక్షలు, జ్యోతిపై రూ.5లక్షల చొప్పున రివార్డు ఉన్నట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. అలాగే, ఏరియా కమిటీ సభ్యులు దుడ్ల కరంపై రూ.5లక్షలు, మరో ఆరుగురి తలలపై రూ.లక్ష చొప్పున రివార్డు ఉందన్నారు. వీరందరూ గంగలూరు ఏరియా కమిటీలో వివిధ హోదాల్లో చురుగ్గా ఉన్నవారేనన్నారు. వీరి లొంగుబాటు వెనుక డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డు, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు కీలక పాత్ర పోషించినట్లు ఎస్పీ వివరించారు.సైద్ధాంతిక లోపాలు, అమాయక గిరిజనుల పట్ల కొందరు సీనియర్లు దోపిడీకి పాల్పడటం వంటి చర్యలతో కలత చెందడం, భద్రతా బలగాల ప్రభావం పెరిగిన నేపథ్యంలో వీరంతా లొంగిపోయినట్లు బీజాపూర్ సీనియర్ ఎస్పీ తెలిపారు. అలాగే, గ్రామాల్లో అభివృద్ధి కోసం తాము చేపట్టిన నియా నెల్లనార్' (యువర్ గుడ్ విలేజ్) అనే పథకం పట్ల ఆకర్షితులయ్యారన్నారు. లొంగిపోయిన వారికి రూ. 25వేలు చొప్పున సహాయం అందించామని.. ప్రధాన స్రవంతిలోకి చేర్చేందుకు ప్రభుత్వ విధానం ప్రకారం వారికి పునరావాసం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గతేడాది బస్తర్‌లో 792మంది మావోయిస్టులు లొంగిపోగా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బీజాపూర్ జిల్లాలో 65మంది లొంగిపోయారు.

## కర్స్క్‌లో రష్యా బలగాల పైచేయి..

మాస్కో(జనంసాక్షి):ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ప్రయత్నాలు జరుగుతోన్న తరుణంలో యుద్ధభూమిలో పుతిన్ సేనలు పైచేయి సాధించాయి. కర్స్క్ రీజియన్ లోని అతిపెద్ద పట్టణమైన సుడ్జాను తిరిగి తమ అధీనంలోకి తెచ్చుకున్నట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది.ఈ రీజియన్‌లోని కొంతభాగాన్ని గతేడాది ఉక్రెయిన్ బలగాలు అనూహ్యంగా ఆక్రమించిన విషయం తెలిసిందే.కొన్నిరోజులుగా కర్స్క్ ప్రాంతంలో రష్యా బలగాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. దానిని పూర్తిగా స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టాయి. అమెరికా నుంచి సాయం నిలిచిపోవడంతో మాస్కో సేనలు రెట్టించిన ఉత్సాహంతో దాడులు చేస్తున్నాయి. వీటికితోడు ఉత్తరకొరియా దళాలు కూడా గత కొన్ని రోజులుగా ఇక్కడ పలు ఉక్రెయిన్ స్థావరాలను స్వాధీనం చేసుకొన్నాయి. తాజాగా అతిపెద్ద పట్టణమైన సుడ్జాను పుతిన్ సేనలు అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఇదిలాఉంటే.. పశ్చిమ రష్యా లోని కర్స్క్‌లో బుధవారం పుతిన్ పర్యటించిన సంగతి తెలిసిందే. రష్యా దళాల కంట్రోల్ సెంటర్‌కు అధ్యక్షుడు వెళ్లారు. ఆయన మిలిటరీ దుస్తుల్లో ఉన్న దృశ్యాలను మీడియా ప్రసారం చేసింది. ఈ సందర్భంగా యుద్ధ భూమిలోని పరిస్థితులను రష్యన్ జనరల్ స్టాఫ్ హెడ్ వలేరీ జెరసిమోవ్.. పుతిన్‌కు వివరించారు. కొంతమంది ఉక్రెయిన్ సైనికులు తమకు లొంగిపోయినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఈ ప్రాంతం నుంచి కీవ్ దళాలను తరిమికొట్టాలని అధ్యక్షుడు ఆదేశించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే తాజా ప్రకటన వచ్చింది.

డిమాండ్లు పాతవే.. అయినా వెల్లడించిన రష్యా..!

ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్నా.. అమెరికాతో సంబంధాలు పునరుద్ధరించాలన్నా తీర్చాల్సిన డిమాండ్ల లిస్టును రష్యా బయటపెట్టింది. నేడు వాటిని వాషింగ్టన్‌కు అందజేసింది. కాకపోతే ఆ డిమాండ్లు ఏమిటనేది మాత్రం బయటకు వెల్లడించలేదు. గత మూడు వారాల నుంచి అమెరికా-రష్యా అధికారులు వర్చువల్ విధానంలో చర్చలు జరుపుతున్నారు. కాకపోతే మాస్కో పంపిన డిమాండ్లలో చాలావరకు గతంలో ఉక్రెయిన్‌కు అందించినవే ఉన్నట్లు తెలుస్తోంది. వీటిల్లో కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, విదేశీ దళాలను ఉక్రెయిన్‌లోకి అనుమతించకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు రష్యాకు చెందుతాయని అంగీకరించడం వంటివి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతోపాటు అసలు యుద్ధానికి మూలకారణమైన నాటో తూర్పువైపు విస్తరణ అంశం కూడా పరిశీలించాలని కోరే అవకాశం ఉంది.మరోవైపు 30 రోజుల కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా ప్రతిస్పందన కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికే యుద్ధం ఆపడంలో తొలి అడుగుగా.. జెలెన్‌స్కీ ఈ డిమాండ్‌ను ఆమోదించిన విషయం తెలిసిందే. కాకపోతే పుతిన్ నుంచి మాత్రం ఎటువంటి సంకేతాలు వెలువడలేదు. ఈ చర్చలను అడ్డంపెట్టుకొని అమెరికా-ఉక్రెయిన్-ఐరోపాను వేరు చేయడానికి రష్యా అధ్యక్షుడు ప్రయత్నిస్తారనే భయాలు వాషింగ్టన్ బృందంలో ఉన్నాయి. మరోవైపు తమ డిమాండ్ల విషయంలో వాషింగ్టన్‌లోని రష్యా దౌత్య కార్యాలయం స్పందించేందుకు నిరాకరించింది.తాజాగా ఈ అంశంపై బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఏంజెలా స్టెంట్ మాట్లాడుతూ డిమాండ్లలో ఎటువంటి మినహాయింపులు ఇచ్చేందుకు రష్యన్లు సిద్ధంగా లేనట్లు కనిపిస్తోందన్నారు. గతంలో పలుమార్లు అమెరికా తిరస్కరించిన డిమాండ్లనే మళ్లీ చేస్తోంది. దీంతో మాస్కో శాంతి, అర్థవంతమైన చర్చలకు ఆసక్తిగా లేదని తెలుస్తోందన్నారు.

## ట్రంప్ టారీఫ్ వార్

**న్యూయార్క్(జనంసాక్షి):** ఉక్కు, అల్యూమినియంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.ఈ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఐరోపా కూటమి (ఈయూ) సైతం అగ్రరాజ్యంపై 28 బిలియన్ డాలర్ల (26 బిలియన్ యూరోలు) సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రతీకార సుంకాలపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈయూ మా దగ్గర వసూలు చేసినంతే తాము వసూలు చేస్తామని విలేకరులతో పేర్కొన్నారు.'వాళ్లు మా దగ్గరం ఎంత వసూలు చేస్తే.. మేము కూడా వాళ్ల దగ్గరనుంచి అంతే వసూలు చేస్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్ వస్తువులపై మరిన్ని సుంకాలు విధించి ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని తెస్తామని ట్రంప్ హెచ్చరించారు.

# గాంధీ కుటుంబంతో నాకు మంచి అనుబంధం ఉంది

చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన వారికి ఒకేసారి 37 కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చానన్నారు. అలాగే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలు ఇచ్చామన్నారు. డీసీసీ అధ్యక్షులందరికీ పదవులు ఇచ్చామని తెలిపారు. గాంధీ కుటుంబంతో తనకు అనుబంధం అంతకు మించి ఉందని.. ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న నిర్మలా సీతారామన్ గతంలో తమిళనాడుకు మెట్రో ప్రకటనలో కీలక పాత్ర పోషించారన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణ రాష్ట్రం అంశాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు 253 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తామన్నారు. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిస్తే సరిపోతుందని.. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో ఏప్రిల్ నెలలో మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 60 దేశాల నుంచి అతిథులను ఆహ్వానిస్తున్నామన్నారు. దానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి అనుమతి కావాలని.. అందుకే విదేశాంగ శాఖ మంత్రిని కలుస్తున్నట్లు తెలిపారు. డీలిమిటేషన్ విధానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీ వేశానన్నారు. దానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో అందరి అభిప్రాయాన్ని సేకరించి ఆ తర్వాత డీఎంకే మీటింగ్‌లో తమ వైఖరి చెప్తామన్నారు. పన్నులు వసూలులో దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. పంటలు ఎండిపోయినా, ప్రజలు ప్రాణాలు పోతున్నా బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే ఏం లాభమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒకవేళ చర్చకు వస్తే వారే చేసిన తప్పులేంటే వివరించే అవకాశం ఉంటుందని.. తద్వారా ప్రజలకు తెలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. చర్చకు రాకుండా గవర్నర్ ప్రసంగానికి వస్తే అర్థం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవహార శైలిని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ ఒక్క పాలసీ తేలేదన్నారు. తెలంగాణలో తాను చేసినన్ని పాలసీలు ఎవ్వరూ చేయలేదని పేర్కొన్నారు. నిరుద్యోగాన్ని 8.8 నుంచి 6.1 శాతానికి తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి నాటి నుంచి రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకి తెచ్చినట్లు వెల్లడించారు. పన్ను వసూళ్లలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందంటూ రేవంత్ తెలిపారు. రైతుల పొలాలు ఎండిపోతుంటే, టన్నెల్‌లో ప్రాణాలు పోతుంటే, ప్రజలు కష్టాల్లో ఉంటే బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందని, ఫొటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ అన్నారు. తానెవరూ తెలికుండానే పీసీసీ, ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారా? అంటూ ప్రతిపక్షాలను ప్రశ్నించారు. గాంధీ కుటుంబంతో తనకు విబేధాలు వచ్చే అవకాశమే లేదని తేల్చి చెప్పారు రేవంత్. తెలంగాణ సీఎంగా ఉన్నా కాబట్టే రాష్ట్రంలో తనను ప్రశ్నిస్తున్నారని, అలాగే కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి ఉన్నారు కాబట్టే ఆయన్నీ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన అంశాలపై ప్రశ్నిస్తున్నారని అన్నారు. మిగతా రాష్ట్రాల కేంద్రమంత్రులు వారివారి రాష్ట్రాలకు కావాల్సినవన్నీ సాధించుకుంటున్నారని, కానీ కిషన్ రెడ్డి మాత్రం తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు, నిధుల గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తాను ఆరు గ్యారెంటీలు అడగడం లేదని, తెలంగాణకు ప్రధాని ప్రకటించిన రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో, మూసీ, కేంద్ర ప్రాజెక్టులు మాత్రమే అడుగుతున్నట్లు చెప్పుకొచ్చారు. మెట్రోకి క్యాబినెట్ అనుమతి వస్తే పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు.

## తెలంగాణ రైజింగ్‌కు సహకరించండి



రైజింగ్‌ను ప్రోత్సహించేందుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రి జైశంకర్‌ను సీఎం కోరారు. తెలంగాణ రైజింగ్‌ను విదేశాల్లో భారత్ కార్యక్రమాల్లోనూ ప్రచారం చేయాలని, దౌత్య, లాజిస్టిక్ సహాయంతో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కేంద్ర మంత్రి జైశంకర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమైన హైదరాబాద్‌లో చేపట్టే కార్యక్రమాలకు తమ మంత్రిత్వ శాఖ మద్దతుగా నిలుస్తుందని కేంద్ర మంత్రి జైశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, నాగర్ కర్నూలు, భువనగిరి లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## హైజాక్‌పై పాక్ అబద్ధాలు

ఇరువర్గాల మధ్య పోరాటం జరుగుతోంది. పాక్ సైన్యం మరణించిన సైనికులు, రెబెల్స్ ఫొటోలు ఇంకా విడుదల చేయలేదు. సైన్యం వైపు భారీగా నష్టం జరుగుతోంది. బందీలుగా ఉన్న తమ సిబ్బందిని రక్షించుకోలేకపోయింది. సైనికుల స్థైర్యం దెబ్బతినకుండా చూసుకునేందుకు వాస్తవ సంఖ్యను దాచి, తప్పుడు ప్రచారం చేస్తోంది" అని తన ప్రకటనలో పేర్కొంది. ఆర్మీ రక్షించిందని చెప్తున్న సిబ్బందిని యుద్ధనీతిని అనుసరించి, తామే విడుదల చేశామని పేర్కొంది. యుద్ధంలో తమను ఓడించలేక.. నిరాయుధులైన బలోచ్ ప్రజలపై పాక్ ఆర్మీ దాడులు చేస్తోందని మండిపడింది.ఇదిలాఉంటే.. రైలును హైజాక్ చేసిన వేర్పాటువాద బలోచ్ మిలిటెంట్లు 33 మందిని హతమార్చినట్లు పాకిస్థాన్ సైన్యం బుధవారం ప్రకటించింది. "21 మంది ప్రయాణికులను వేర్పాటువాదులు హత్య చేశారు. ఈ ఆపరేషన్‌లో నలుగురు సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయారు. మిలిటెంట్ల చెరలోని బందీలను రక్షించాం" అని సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. సుమారు 425 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) వేర్పాటువాదులు బోలన్ ప్రాంతంలో మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే.

## ఆహ్వానం అందింది.. హాజరవుతాం

**హైదరాబాద్(జనంసాక్షి):** మార్చి 22న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తల పెట్టిన దక్షిణాది జేఏసీ సమావేశానికి భారాస పార్టీని తమిళనాడు ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు అక్కడి పులపాలక శాఖ మంత్రి నెహ్రూ, డీఎంకే ఎంపీ ఇలంగో గురువారం హైదరాబాద్ వచ్చి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి ఆహ్వానించారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై అందరం కలిసి పోరాడుదామని ఈ సందర్భంగా కేటీఆర్ పిలుపునిచ్చారు. "గత కొన్నేళ్లుగా దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటిస్తూ జనాభాను అదుపులో ఉంచాయి. ఇప్పటికిప్పుడు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు అన్యాయానికి గురవుతాయి. 22న జరిగే సమావేశానికి హాజరవుతాం. సమష్టిగా పోరాడితే దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం జరుగుతుంది. తమిళనాడు ప్రభుత్వానికి సంస్కారం ఉంది కాబట్టి తెలంగాణకు వచ్చి ఆహ్వానించారు. మరి ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలి" అని కేటీఆర్ అన్నారు. సమావేశానికి హాజరవుతామని భారాస తరఫున కేటీఆర్ స్పష్టం చేయడంతో తమిళనాడు నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్ఎల్‌బీసీ వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

నిమగ్నమై ఉన్నట్లు వివరించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్ కటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తవ్వకాలు జరుగుతున్న డీ-1, డీ-2 ప్రాంతాల్లో సింగరేణి ర్యాట్ మైనర్స్ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యల్లో టన్నెల్ బోరింగ్ మిషన్ భాగాలను తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు చెప్పారు. సహాయక చర్యల్లో రోబో వినియోగం తదితర పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. డీ-1, డీ-2 ప్రదేశాలకు మరోసారి కేరళకు చెందిన కడవర్ డాగ్స్ స్క్వాడ్‌లను పంపినట్లు తెలిపారు. నిరంతరాయంగా డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. సహాయక చర్యల్లో ఆర్మీ, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ర్యాట్ మైనర్స్, కడవర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని.. టన్నెల్ లోపల సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

## చర్చించుకుందాం రండి..

వాటిపై 15శాతం వరకు టారిఫ్‌లు వసూలు చేస్తామని వెల్లడించింది. రానున్న రోజుల్లో అగ్రరాజ్యం తీసుకునే నిర్ణయాలకు ప్రతిస్పందన కూడా అదే స్థాయిలో ఉంటుందని ఇదివరకే హెచ్చరించింది. ఈ పరిణామాల వేళ యూఎస్‌తో చర్చలకు పిలుపునిస్తూ చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఇస్రో మరో అరుదైన ఘనత

యాత్రలకు అవసరమైన ఈ కీలక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టిన ఇస్రో ఆ దిశగా మరో అడుగు వేసింది. తాజాగా స్పేడెక్స్ డీ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించింది. దీనిపై అంతరిక్ష సంస్థకు కేంద్రమంత్రి జితేంద్రసింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు."ఈ విజయం ప్రతి భారతీయుడిలో ఉత్సాహాన్ని నింపుతుంది. నమ్మశక్యం కాని డీ డాకింగ్ ప్రక్రియను స్పేడెక్స్ శాటిలైట్లు పూర్తి చేశాయి. భారతీయ అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్-4, గగన్‌యాన్ సహా భవిష్యత్ ప్రయోగాలకు మార్గాన్ని సుగమం చేసింది" అని మంత్రి ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఉపగ్రహాలను నింగిలోనే అనుసంధానించే మిషన్‌లో భాగంగా ఇస్రో.. గతేడాది డిసెంబర్ 30న ఛేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపించింది. పలు ప్రయత్నాల అనంతరం చివరకు జనవరి 16న డాకింగ్ ప్రక్రియ (రాజూజీఆవచీ) విజయవంతంగా చేపట్టింది. దీంతో ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడంతో ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ వి.నారాయణన్ ఇటీవల వెల్లడించారు.

### 15 నుంచి ఒంటిపూట బడులు

జంకుతున్నారు. రాబోయే రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వం పాఠశాలల సమయంపై కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో హాఫ్‌డే స్కూల్స్‌పై అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశించింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మాత్రమే పాఠశాలలు కొనసాగుతాయని పేర్కొంది. ఆ తర్వాత పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందిస్తారని చెప్పింది. ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలకు హాఫ్ డే ఉంటుందని.. ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక పదో తరగతి వార్షిక పరీక్షలు జరిగే పాఠశాల్లో మాత్రం తరగతులు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని పేర్కొంది. ఈ మేరకు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను తెలియజేయడంతో పాటు అమలును స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్ట్ ఆదేశించారు.

### తొలిసారిగా యుద్ధభూమిలోకి పుతిన్..

దళాలను తరిమికొట్టాలని అధ్యక్షుడు ఆదేశించినట్లు మీడియా కథనాలు పే ర్కొన్నాయి.ఇదిలాఉండగా.. యుద్ధంలో 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపా దనకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిపాదనపై చర్చించేందుకు అమెరికా ప్రతినిధులు రష్యా బయల్దేరారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్ వద్ద మీడియా సమావేశంలో వెల్లడించారు. "మా ప్రతినిధులు రష్యాకు బయల్దేరారు. కాల్పుల విరమణకు పుతిన్ అంగీకరిస్తారనే ఆశిస్తున్నాం. లేదంటే యుద్ధం కొనసాగుతూనే ఉంటుంది. అదే జరిగితే మాస్కో ఆర్థికంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అది రష్యాకే వినాశకరంగా మారుతుంది. అలాంటి ఫలితాన్ని నేను కోరుకోవట్లేదు. శాంతిని సాధించడమే నా లక్ష్యం" అని ట్రంప్ వివరించారు.

# సభ మీ సొంతం కాదు

అప్పటి వరకు ఈ సేషన్ మొత్తం ఆ సభ్యున్ని సస్పెండ్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈరోజు సభ్యుడు మాట్లాడిన భాష అత్యంత అవమానకరమన్నారు. ఒక దళితజాతి బిడ్డ స్పీకర్‌గా మాట్లాడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని.. స్పీకర్‌ను టార్గెట్ చేయడం బాధాకరమన్నారు. ఆ సభ్యుని సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. జగదీష్ రెడ్డి మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. బలహీన వర్గాలు ఇప్పుడిప్పుడే ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం వచ్చాక... బీఆర్ఎస్ అడిగినన్ని సార్లు అవకాశం ఇచ్చారన్నారు. జగదీష్ రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని మండిపడ్డారు. మీకు మీకు అని మాట్లాడడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. గవర్నర్‌ను పట్టుకుని కాంగ్రెస్ కార్యకర్త అని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గవర్నర్ మాట్లాడింది.. తమ ప్రభుత్వ విధానం అని కేసీఆర్ సభలో చెప్పలేదా అని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌ను దారుణంగా అవమానించారన్నారు. జగదీష్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని స్పీకర్‌ను కోరుతున్నాని మంత్రి సీతక్క తెలిపారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ ప్రసంగం సందర్భంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లను సస్పెండ్ చేశారన్నారు. పార్లమెంట్‌లో టీఎంసీ సభ్యుడు ప్రవర్తన సరిగా లేనందున సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. జగదీష్ రెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. సభ్యులు చర్చ అనంతరం జగదీష్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు.అయితే సభలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరగా.. అందుకు స్పీకర్ అనుమతి ఇవ్వక పోవడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలను సభ నుంచి బయటకు వచ్చేశారు. సస్పెండ్ అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో కూర్చున్న జగదీష్ రెడ్డిని అసెంబ్లీ ప్రాంగణం నుంచి బయటకు వెళ్లాలని చీఫ్ మార్షల్ కోరారు. అయితే సభా వ్యవహారాల నుంచి మాత్రమే సస్పెండ్ చేశారని చీఫ్ మార్షల్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు వాదించారు. ఏ రూల్ ప్రకారం బయటికి పంపాలని చూస్తున్నారని అడిగి రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పారు. దీంతో చీఫ్ మార్షల్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

**పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

శాసనసభ స్పీకర్ నుద్దేశించి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.రాష్ట్ర శాసనసభలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ భారత పార్లమెంట్ ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకరే సుప్రీం అని ఆయన తేల్చిచెప్పారుజగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ పార్లమెంటరీ వ్యవస్థను అవమానించడమే నని ఆయన పేర్కొన్నారుస్పీకర్ ను ప్రశ్నించే అధికారం ఏ ఒక్కరికీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.దళిత జాతికి చెందిన సీనియర్ నేత స్పీకర్ హోదాలో ఉన్న అటువంటి వ్యక్తి పై చేసిన వాక్యాలు ఆయన అహంకార ధోరణిని బయట పెట్టినట్లయిందని ఆయన అన్నారు.ఈ తరహాలో ఏ సభ్యుడు మాట్లాడినా ఊపేక్షింది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారుగతంలో వారు అధికారంలో ఉండగా ఇదే సభలో గవర్నర్ ప్రసంగం సమయంలో అప్పటి సభ్యులు కోమటిరెడ్డి వెంకట రెడ్డి,సంపత్ కుమార్ ల సభ్యత్వ రద్దు అంశాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.స్పీకర్ కు ఏమి అధికారం ఉందంటూ స్పీకర్ వ్యవస్థను, శాసనసభ వ్యవస్థతో పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను అవమాన పరిచే విదంగా మాట్లాడిన సదరు సభ్యుడి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ...ఈ అంశాన్ని శాసనసభ ఎథిక్స్ కమిటీకి పంపాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

## నేడు బీఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త నిరసనలు

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా రేపు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఈ రాష్ట్రంలో జరుగుతున్న రాజ్యాంగ హక్కుల హననం గురించి.. అప్రజాస్వామికమైన పోకడల గురించి నిరసన తెలిపేందుకు రచించిన అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చాం. ఇక్కడికి వచ్చి చూస్తే.. ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారు. ఆ విగ్రహం వద్దకు వెళ్లి కూర్చునేందుకు అవకాశం లేకుండా గేట్లు మూసేశారు. ఆ మహానుభావుడిని సంకెళ్లతో బంధించిన నీచమైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం. పేరుగొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా.. పేరుకేమో ప్రజాపాలన.. చేసేవన్నీ అప్రజాస్వామిక పనులు అన్నట్లుగా ఉంది' అని విమర్శించారు.

సస్పెనషన్‌కు భయపడేదిలేదు:జగదీశ్ రెడ్డి

ఉమ్మడి రాష్ట్రం నుంచి ఎన్నో దుర్మార్గాలను ఎదుర్కొని వచ్చామని.. ఈ సస్పెన్షన్ తనను ఏమాత్రం భయపెట్టలేదని సూర్యాపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యులతో కలిసి అంబేద్కర్ భారీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ రోజు రాష్ట్రంలో ఏం జరుగుతుందో.. శాసనసభలో ఏం జరుగుతుందో ప్రజలంతా చూశారు. మేం మాట్లాడుతున్న సందర్భంలో దురదృష్టవశాత్తు.. శాసనసభలో ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన సభ్యులు మాట్లాడుతున్న దాన్ని లైవ్ కూడా ఇవ్వడం లేదని ప్రజలు మాకు చెబుతున్నరు. అయినప్పటికీ ఈ ప్రభుత్వం నిజాలు దాచిపెడుతామనుకుంటే సాధ్యం కాదని అన్నారు. శాసనసభలో ఒక్కరోజు కూడా అన్‌పార్లమెంటరీ వర్డ్ కానీ, ఇతరులను కించపరిచేవిధంగా, శాసనసభ హుందా తనాన్ని తగ్గించే విధంగా కానీ నేను ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రత్యేకించి చైర్‌కు సంబంధించి.. స్పీకర్ అధికారాలు ఏందో.. స్పీకర్ విధులు ఏంటో అన్నీ నాకు తెలుసు. ఎక్కడా కూడా స్పీకర్ గౌరవానికి భంగం కలిగించే పద్ధతుల్లో మాట్లాడలేదు. ఇది కేవలం ప్రభుత్వ కుట్ర. ఈ చర్యకు స్పీకర్ సమ్మతిస్తరని నేను అనుకోవడం లేదు. ఎంత దురదృష్టకరమంటే.. జరిగింది చర్చ నాకు, కాంగ్రెస్ పార్టీకి మధ్యన. స్పీకర్ పెద్దమనిషిగా.. రెఫరీగా ఉంటారు కాబట్టి.. ఆయనను పదేపదే రిక్వెస్ట్ చేశాను. కాంగ్రెస్ సభ్యులు ఇద్దరు 1.20గంటలు మాట్లాడారు. అప్పుడు మా సభ్యులు అభ్యంతరం తెలుపలేదు.. వారు సాఫీగా మాట్లాడుకున్నరు' అని తెలిపారు.స్పీకర్ నాకు అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ తరఫున మాట్లాడేందుకు కేసీఆర్ నాకు అవకాశం ఇచ్చారు. నేను దానికి సంబంధించి రాత్రి జిల్లాలోని రైతులు, అన్నివర్గాల ప్రజలతోని మాట్లాడాను. వాళ్ల సమస్యలను ఎలా ప్రతిబింబించాలి..

**ఉద్దేశ్యపూర్వకంగా సస్పెండ్ చేశారు: కేటీఆర్**

జగదీశ్‌రెడ్డిని ఉద్దేశపూర్వకంగా సభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ తర్వాత భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ...స్పీకర్ పట్ల జగదీశ్‌రెడ్డి అగౌరవంగా మాట్లాడలేదు. అనని మాటను అన్నట్టుగా చిత్రీకరించారు. నిబంధనలకు విరుద్ధంగా సభలో ఏమీ మాట్లాడకపోయినా.. ఈ సమావేశాలు పూర్తయ్యే వరకు ఆయన్ను సస్పెండ్ చేయడం దారుణం అన్నారు. స్పీకర్ పట్ల ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని, తాను చేసిన తప్పేంటని వివరణ అడిగే అవకాశం కూడా జగదీశ్‌రెడ్డికి ఇవ్వలేదు. స్పీకర్ బాధపడి ఉంటే విచారం వ్యక్తం చేయాలని, సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని ఆదేశించాలన్నారు. ఇదే విషయాన్ని స్పీకర్, మంత్రి శ్రీధర్‌బాబుకు స్పష్టంగా చెప్పాం. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలని కోరాం. అయినా, పట్టించుకోకుండా నియంతృత్వ పోకడలతో సభను 5 గంటలపాటు వాయిదా వేశారు. ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులతో మాట్లాడించి.. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకుంటారని కేటీఆర్ అన్నారు.

ఏకపక్ష నిర్ణయం: హరీష్ రావు

సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. జగదీశ్ రెడ్డిని ఈ సెషన్ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించగానే.. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఉరిశిక్ష వేసేటప్పుడు కూడా చివరిసారిగా మాట్లాడేందుకు అవకాశం ఇస్తారు సర్.. మీరు ప్రధాన ప్రతిపక్షానికి మీరు మైక్ ఇవ్వరా సర్ అని హరీశ్‌రావు ప్రశ్నించారు. సభలో మాట్లాడేందుకు మాకు ఎందుకు అవకాశం ఇవ్వరని హరీశ్‌రావు సభాపతిని ప్రశ్నించారు.

# సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయు)కి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, యూనివర్సిటీ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ రాశారు. సెంట్రల్ వర్సిటీ ఆవిర్భావ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నంబర్ 25 కింద 2300 ఎకరాల స్థలాన్ని పరిశోధన, విద్యారంగ అభివృద్ధికి కేటాయించిందని, ప్రస్తుతం ఈ భూమిని వేలం వేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. గచ్చిబౌలి ప్రాంతంలో ఉన్న ఈ 400 ఎకరాలను స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి మార్కెట్ విలువ కంటే చాలా తక్కువకు కేటాయించిందని, తగిన అభివృద్ధి చేయడంలో ఆ కంపెనీ విఫలమవ్వడంతో ఆ భూములను ప్రభుత్వం హైకోర్టు ఆదేశాల ద్వారా తిరిగి పొందిందని, ప్రస్తుతం ఈ భూమిని రూ.18వేల కోట్ల (అంచనా విలువ)కు 2025 మార్చి 8 నుండి 15 తేదీల మధ్యన వేలం వేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. వర్సిటీలోని పర్యావరణ, అకడమిక్, సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగిన ఇటువంటి స్థలాన్ని ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు స్వార్ధ ప్రయోజనాలకు ధారాదత్తం చేయడమే అవుతుందని దుయ్యబట్టారు. విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని ప్రస్ఫుటం చేస్తున్నదని తెలిపారు. ఒక వైపు కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రైవేటీకరణను, సంపదను మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడాన్ని విమర్శిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం యూనివర్సిటీ భూములను ఎవరి ప్రయోజనాల కోసం వేలాన్ని నిర్వహిస్తున్నదో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఈ భూములను వర్సిటీకి కేటాయించి విద్య పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

# సంఘటన జరిగిన తక్షణమే స్పందించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)



సంఘటన జరిగిన మరుక్షణమే స్పందించాలని పోలీసులు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి మంచిర్యాల జోన్ పరిధిలో పని చేస్తున్న ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.... ప్రతి ఒక్క అధికారి వ్యక్తిగత జీవితానికి, సిబ్బంది జీవితాలకు విలువనివ్వాలన్నారు. సిబ్బందితో మాట్లాడి దర్బార్ లాంటివి నిర్వహిస్తూ ఏదైనా సమస్యలు ఉంటే వారికి పెద్ద లాగా ఉండి పరిష్కరించాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత తో కష్టపడి సరైన మార్గంలో విధులు నిర్వహించిన్నప్పుడు గుర్తింపు వస్తుందని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు త్వరితగదిగిన స్పందించి వ్యక్తిగతంగా సంఘటన ప్రాంతానికి వెళ్లాలని, ఏదైనా సంఘటన జరిగినప్పుడు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకున్నట్లయితే విలువైన సమాచారం అనేది దొరుకుతుందని సూచించారు. మంచి పని అనేది ఒకేసారి చేయడం కాకుండా నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు. మనం చేసే మంచి పని భవిష్యత్తు తరాలు గుర్తించేలా చేయాలన్నారు. ఏదైనా మంచి పని చేసినప్పుడు రివార్డుతో అభినందిస్తామన్నారు. మొట్టమొదటిగా స్వీయ రక్షణ పాటించాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఒంటరిగా వెళ్లకూడదని, ఎవరైనా ఒకరు తోడుగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పరిస్థితులకు అనుగుణంగా వెంటనే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండా సమయం వృధా చేయడం పెద్ద తప్పు అవుతుందన్నారు. సంకల్పం, నిబద్ధత పోలీసులకు గౌరవాన్ని ఇస్తుందన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ పోస్టులు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ప్రమోద్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, హెూలీ సందర్భంగా జిల్లా అంతటా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్ పోస్టులు పెట్టీ పోలీసు పహారా చేపడుతున్నామని జిల్లా ఎస్పీ ప్రమోద్ మహాజన్ అన్నారు. గురువారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో పలు విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మద్యం సేవించి వాహనాలను నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని తెలిపారు. నదులు, వాగులు, చెరువులలో ఈత రాని వారు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. వాహనాలు నడిపే వారిపై రంగులు చల్లుతూ ఇబ్బందులు కలిగించకూడదని అన్నారు. ఇతరుల అనుమతి లేకుండా రంగులను పూయరాదని సూచించారు. ఎవరైన తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. యువత రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ లాంటివి చేయకుండా తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. సహజసిద్ధమైన రంగులను ఉపయోగించడం శ్రేయస్కరమని జిల్లా ప్రజలకు తెలిపారు.

# పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాల్సిందే..

- మెరుగైన నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలి
- గిరిజన రైతుల షరతు
- భూసేకరణ చట్టం- 2013 లో పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని ఎక్కడ లేదని చెప్తున్న ప్రభుత్వ అధికారులు
- మేం భూములివ్వబోమని తేల్చి చెప్పిన తిర్లాపురం గ్రామ రైతులు

(ఎండి మునీర్, ప్రత్యేక ప్రతినిధి/ జనంసాక్షి)





గనుల కోసం భూములు కోల్పోయిన వారికి గతంలో సింగరేణి యాజమాన్యం ఉద్యోగాలిచ్చేది. తవ్వకం పనుల్లో అంటే బొదుగ తవ్వే కాడి నుంచి ఉపాధి అవకాశాలు ఇచ్చేవారు. ఇప్పుడివ్వడం లేదు. జీవనోపాధి అయిన భూములను తీసుకుని పరిహారం మాత్రమే కాదు. ప్రత్యామ్నాయ భూమి, బాయిలో ఉద్యోగం ఇవ్వాల్సిందే అంటున్నారిప్పుడు! సింగరేణి లోని మణుగూరు ఓసి విస్తరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం 813 ఎకరాల భూమిని సేకరించే ప్రక్రియలో భాగంగా తిర్లాపురం గ్రామపంచాయతీ రైతు వేదిక వద్ద పెసా గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి భూసేకరణ అధికారి/స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఎకరానికి 13.06 లక్షల రూపాయలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి 5 లక్షల రూపాయలు ఇస్తామని తెలిపారు. అందుకు తిర్లాపురం రైతులు భూములు మొత్తం కోల్పోవుతున్నామని, కుటుంబంలో ఒకరికి సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని, నష్ట పరిహారం చెల్లించే విషయంలో ఇదే ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోవుతున్న మణుగూరు రెవిన్యూ గ్రామంలో ఇస్తున్నట్టు తిర్లాపురం వారికి అదే విధంగా నష్ట పరిహారం చెల్లించాలని, భూనిర్వాసితుల డిమాండ్ చేసారు. అందుకు భూసేకరణ అధికారి 2013 భూసేకరణ చట్టంలో ఎక్కడ పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని లేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. అందుకు రైతులు బిటిపిఎస్‌లో 2013 చట్ట ప్రకారం పర్మినేంట్ ఉద్యోగాలు ఇచ్చినప్పుడు అదే చట్టం సింగరేణికి ఎందుకు వర్తించదని గిరిజన రైతులు నిలదీశారు. దీనికి సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వ అధికారులు గ్రామసభలో ప్రశ్నించేవారిని, మాట్లాడొద్దు అంటూ వారిని భయపెట్టి, పెసా గ్రామసభ నిబంధనలకు విరుద్ధంగా గ్రామసభ అనుమతి పొందాలని ప్రయత్నించారు. కాని వారి ఆలోచనలు భూ నిర్వాసితులు పసిగట్టి, పర్మినెంట్ ఉద్యోగాలు కావాల్సిందేనని పెసా గ్రామసభ ఆమోదం తెలపకుండా భూసేకరణను తిరస్కరించారు. ఇప్పటికైనా భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పించేలా చర్యలను తీసుకోవాలని, లేకుంటే ఇక పైన కుడా భూములు ఇవ్వబోమని ఆదివాసీ నాయకులు కోడి నాగరాజు, సోడే రవికుమార్, కుంజా ఆనంద్, మడి నరసింహ రావు, కుంజ వెంకటేశ్వర్లు, గనిబోయిన స్వప్న మరియు తిర్లాపురం ఆదివాసి రైతులు పేర్కొన్నారు! తమ డిమాండ్ ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని నిర్వాసితులు పేర్కొంటున్నారు. తమ డిమాండ్ చట్ట ప్రకారమే ఉంది అని, తాము గనిలో షేర్ అడగడం లేదని, ఉద్యోగం జీవనోపాధి కోసం అడుగుతున్నమని వారంటున్నారు.

# కావాలనే కాంగ్రెస్ నాయకుల రాద్ధాంతం

- జగదీశ్‌రెడ్డి మాటలను వక్రీకరించే యత్నం : తలసాని



**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** అసెంబ్లీలో అందరికి సమాన హక్కులు ఉంటాయన్న జగదీశ్‌రెడ్డి మాటలను కాంగ్రెస్ నాయకులు వక్రీకరిస్తూ, అనవసర రాద్ధాంతానికి తెర తీస్తున్నారని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ సభ్యులే స్పీకర్‌ను అవమానించినట్లుగా మాట్లాడుతున్నారని, ఆ పార్టీ నేతల మాటలు విచిత్రంగా ఉన్నాయని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభలో అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. స్పీకర్ అంటే తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. కేసీఆర్‌కు ఛాంబర్ లేకుండా చేసినా తాము భరించామని.. పీఏసీ చైర్మన్ మాకు వచ్చేదైనా వారే గుంజుకున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ స్ట్రెచర్‌పై ఉన్నారని, మార్చురీకి వెళ్తారని ఎలా అంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా ఎదుటివారి చావు కోరుకోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గడ్డం ప్రసాద్ గౌరవప్రదమైన పోస్టులో ఉన్నారన్నారు. ఆయనను వ్యక్తిగా చూశామని, ఆయన కులం, మతం చూడలేదన్నారు. తాము సభకు రావొద్దని అనుకుంటున్నారా?.. చెబితే తాము ఆలోచిస్తామన్నారు. ఆ తర్వాత మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. సభలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారని, సభలో అందరూ సమానమే అందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. తాము స్పీకర్‌ని అమానించలేదన్నారు. నిన్న రేవంత్ రెడ్డి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను డైవర్ట్ చెయ్యడానికి ఇవన్నీ మాట్లాడుతున్నారన్నారు. రైతులకి ఇచ్చిన హామీలు ఏమి అమలు చేశారు.. హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించినందుకు మా గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లోనూ మమ్ములను మాట్లాడకుండా చేసే కుట్ర చేస్తున్నారన్నారు. ఒక్కరూ కాదు 20 మంది ఎమ్మెల్యేలు మంది ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## నేడు హోలీ, రంజాన్

- ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** 35 ఏళ్ల తర్వాత హోలీ పండుగ, రంజాన్ మాసములోని రెండవ శుక్రవారం ఒకే రోజు వచ్చాయని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. రెండు పండుగలు సజావుగా జరిగేందుకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ సిటీ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి జోన్ లోని సున్నితమైన, ముఖ్యమైన ప్రాంతాలలో పికెట్ లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలని పోలీసు అధికారులకు కోరారు. అసాంఘిక శక్తులపై, వెగాబాండ్ లపై గట్టీ నిఘా ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. రంగుల హోలీ తమ జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటున్నామని సీవీ ఆనంద్, డీజీ కమిషనర్ ఆఫ్ పోలీసు తెలిపారు. భాగ్యనగర వాసులకు హోలీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో విక్రమ్ సింగ్ మాన్ ఐపీఎస్ (అడిషనల్ సీపీ లా అండ్ ఆర్డర్), చైతన్య కుమార్ , జోనల్ అధికారులు పాల్గొన్నారు.

## జగదీశ్ రెడ్డి తీరు దారుణం

- ఎమ్మెల్యే రాజగోపాలరెడ్డి

**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** స్పీకర్‌ను అవమానించడ్ సరైనదేనా అని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. జగదీశ్ రెడ్డి తీరు దారుణమని అన్నారు. ఇకపోతే తనకు మంత్రి పదవి ఇస్తే పార్టీకి, ప్రజలకు లాభం. కానీ, మంత్రి పదవి ఎప్పుడు వస్తుందనేది చెప్పలేను' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివిధ అంశాలపై స్పందించారు. 'భువనగిరి ఎంపీ స్థానం కోసం నిద్రాహారాలు మాని గెలిపించా. స్పీకర్ కుర్చీని ఎవరూ ప్రశ్నించలేరు. జగదీశ్‌రెడ్డి స్పీకర్ ఛైర్‌ను ప్రశ్నించడం సరికాదు. అసెంబ్లీలో అతిగా ప్రవర్తించారు, స్పీకర్‌ను అవమానించినందుకే ఆయనపై చర్యలు తీసుకున్నారు. మేము ఎవరినీ లక్ష్యంగా చేసుకోం.. తప్పు చేస్తే వదిలిపెట్టం' అని

# జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ అక్రమం

- బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్



**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ అక్రమం, స్వేచ్ఛా హరణం, ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకమని బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ అన్నారు. మొత్తం బడ్జెట్ సమావేశానికి సస్పెండ్ చేయడం పూర్తిగా అక్రమం, అన్యాయమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఇది అసెంబ్లీ బిజినెస్ రూల్స్‌ను మొత్తంగా ఉల్లంఘించడం మాత్రమే కాకుండా, ప్రతిపక్ష స్వరాలను నిర్బంధించే, ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే ఒక ధోరణిగా కనబడుతోంది. తెలంగాణ ప్రభుత్వంలోని అధికార పార్టీ ప్రతిపక్షం మాట వినకుండా, విమర్శలను అణచివేసే తలంపుతో వ్యవహరిస్తోందని ఇది స్పష్టంగా చూపుతోందని, ప్రభుత్వం అసెంబ్లీలో ప్రజాస్వామ్య చర్చలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆక్షేపించారు. అసెంబ్లీ అంటే ప్రజల సమస్యలను చర్చించి, పరిష్కార మార్గాలు కనుగొనే ప్లాట్‌ఫాం, కానీ ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే ప్రతిపక్ష స్వరాలను మూయించడానికి ఒక సాధనంగా మారుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణ భాష, సంస్కృతి అనేవి ప్రజల ఆత్మగౌరవానికి, మనసుపై ముద్ర వేసిన విలువలకు ప్రతిరూపం అని అన్నారు. స్థానిక భాషలో మాట్లాడటం కారణంగా సస్పెండ్ చేయడం అనేది ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కినట్లేనని, ఒక ప్రజాప్రతినిధి తన భావాలను తెలంగాణ ప్రజలకు అంతరార్థంగా అర్థమయ్యే భాషలో వ్యక్తపరచడం సహజం, కానీ దానికి శిక్ష విధించడం అనేది పాలకుల అసహనాన్ని స్పష్టంగా చూపుతోందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్షాన్ని నోరు మూయించేందుకు ఈ తప్పుడు నిర్ణయం తీసుకున్నారని, ప్రజాస్వామ్యంలో ఇదెంత ప్రమాదకరమో ఆలోచించాలని సూచించారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేసే తన నియంతృత్వ ధోరణిని మానుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మాజీమంత్రి జగదీశ్వర్ రెడ్డిని శాసనసభ సమావేశాల నుండి సస్పెండ్ చేయడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఉపేంద్ర అన్నారు. అబద్ధాల వాగ్దానాలతో మోసపూరిత వైఖరితో 6 గ్యారెంటీలు వందల హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నిస్తున్న టిఆర్ఎస్ నాయకుల పట్ల అసెంబ్లీలో ప్రభుత్వ వైఖరిని ఆయన ఖండించారు. ప్రతిపక్ష నాయకులను సభ నుంచి సస్పెండ్ చేయడం అని రాజ్యాంగ విరుద్ధమని శాసనసభ్యుల హక్కులకు విరుద్ధమని శాసనసభ వ్యవహారాల రైట్స్కు వ్యతిరేకమని ఉపేంద్ర అన్నారు తప్పుడు కేసులతో అరెస్టులతో సస్పెండ్లతో ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకులను ఆపలేరని అలా ఆలోచిస్తే మూర్ఖత్వమేనని ఆయన అన్నారు. టిఆర్ఎస్ నిరంతరం తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆత్మ గౌరవం కోసం అభివృద్ధి కోసం కేసీఆర్ నాయకత్వంలో గత 24 సంవత్సరముల నుంచి పోరాటం చేస్తున్నదని అలాంటి పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నదని అలాంటి పార్టీ నాయకులను కించపరచడం అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని ఆయన అన్నారు. జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని, ఏమీ తప్పు జరగలేదని చెప్పినా వినకుండా ఒకవేళ ఏమైనా జరిగి ఉంటే క్షమాపణ కూడా చెప్తామని ప్రజల కోసం అని చెప్పినా వినకుండా ఏకపక్షంగా సభ నుంచి సస్పెండ్ చేయడం అన్యాయమని ఆయన అన్నారు. రాజకీయ నాయకులు వాడే భాష ప్రజలు గమనిస్తున్నారని, రేవంత్‌రెడ్డి కేసీఆర్ పట్ల వాడిన భాషను ప్రజలందరూ ఛీకొడుతున్నారని, దేశంలో ఇలాంటి భాష ఈ రాజకీయ నాయకుడు వాడటం లేదని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పాలన గురించి ప్రజా సమస్యల గురించి రాహుల్ గాంధీ వెంటనే ఇంటలిజెన్స్ ద్వారా విషయాలు తెలుసుకొని ఇలాంటి నాయకులను ఏకపక్ష నిర్ణయాలను కట్టడి చేయాలని కోరారు. తెలంగాణలో ఉన్న ప్రజాస్వామిక వాదులు అభ్యుదయవాదులు ఉద్యమకారులు ఈ రాష్ట్ర ప్రభుత్వ చర్యలను అవగాహన రాయిత్యాలను ఎప్పటికప్పుడు చీల్చి చెండాడాలని ఆయన పిలుపునిచ్చారు.


గౌండ్ల లొట్టికి 'టూరిజం' చిల్లు

## 'గౌడ్ల లొట్టికి టూరిజం చిల్లు'

# జనంసాక్షి వార్త కథనానికి స్పందన

### నీరా కేఫ్ భవనం గీత కార్పొరేషన్ సంస్థకు అప్పగింత



**హైదరాబాద్ సిటీ,మార్చి13(జనంసాక్షి):** నీరా కేఫ్ భవనాన్ని టూరిజం శాఖ వారు కమర్షియల్ గా మార్చే ప్రయత్నం జరుగుతున్న తరుణంలో గౌడ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు.గౌడ కులస్తులకు ఆర్థిక చేయుతనివ్వడం కోసం వారికి కేటాయించిన బడ్జెట్ తో నీరా కేఫ్ భవనాన్ని నిర్మించారు. నీరా కేఫ్ మీద వచ్చే ఆదాయం అంతా టూరిజం ప్రయోజనంకే తప్ప గౌడ కులస్తులకు దక్కలేదు.ఈ విషయమై జనంసాక్షి 'గౌండ్ల లొట్టికి టూరిజం చిల్లు' అనే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. వార్తాకథనానికి స్పందించిన ప్రభుత్వం నీరా కేఫ్ భవనం ను గీత కార్పొరేషన్ సంస్థకు అప్పగించింది. ఈ సందర్భంగా గౌడ సంఘాలు, గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు యెలికట్టే విజయ్ కుమార్ జనంసాక్షి పత్రికకు ధన్యవాదాలు తెలిపారు.

**నీరా కేఫ్ భవనంను గీత కార్పొరేషన్ సంస్థకు అప్పగించిన పొన్నం కు కృతజ్ఞతలు**

నీరా కేఫ్ భవనంను గీత కార్పొరేషన్ సంస్థకు అప్పగించినందుకు గురువారం హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో గౌడ సంఘాలు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు గౌడ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు రాష్ట్ర గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు యెలికట్టే విజయ్ కుమార్ గౌడ్ శాలువాతో సత్కరించి పూల బొకేతో గౌడ సంఘాల పక్షాన కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రూ.20 కోట్ల బడ్జెట్ కేటాయించి నీరా కేఫ్ భవనంను నిర్మించి గౌడ కులస్తులకు ఆర్థిక చేయూత నివ్వడం కోసం ఏర్పాటు చేసిన దానిని ప్రభుత్వం టూరిజం శాఖ వారు వ్యాపార లావాదేవీలు చేసుకున్నారు తప్ప గౌండ్లకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు.ఈ మధ్య కాలంలో టూరిజం శాఖ వారు నీరా కేఫ్ ను ఎత్తివేస్తూ టూరిజం హెూటల్ గా మార్చే ప్రయత్నం చేస్తున్నారు అని మా గౌడ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాము.దానికి స్పందించిన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఇది ప్రవేటు వ్యక్తులకు చెందకూడదని గౌడకులస్తుల ఆత్మ గౌరవ ప్రతీక నీరా కేఫ్ ను గౌడకులానికే దక్కేలా చేస్తా అని మాట ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తక్షణమే టూరిజం శాఖ నుంచి గీత కార్పొరేషన్ సంస్థ కు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావుని సంప్రదించి గీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంక్షేమ సంస్థ కు బదిలీ చేస్తూ రెండు శాఖల మధ్య అధికారుల సమక్షంలో నిర్ణయం తీసుకున్నారు.అంతే కాదు గౌడ సమస్యలు ఏది ఉన్న నేను పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బహుజనులకు రాజ్యాధికారం కోసం సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ట్యాంకు బండ్ మీద పెట్టడానికి కృషి చేస్తానని అన్నారు . వృత్తిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి గౌడ వృత్తి దారుడికి సేఫ్టీ కిట్స్ ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ అసెంబ్లీ సమావేశంలోనే బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును పెట్టీ అన్ని విధాలుగా బీసీ లకు అండగా ఉంటాం అని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, గౌడ బిజినెస్ నెట్వర్క్ అధ్యక్షులు చీకటి ప్రభాకర్ గౌడ్,గౌడ సంఘం నాయకులు చెక్కిళ్ళ మధుసూదన్ గౌడ్, గుర్రం దేవేందర్ గౌడ్, ముద్దగోని రామ్మోహన్ గౌడ్ , మీరయ్యా గౌడ్ ఉన్నారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby infonned that the following cheque belonging to my client Tadanki Kishore Babu, H.no.9-1-MIG-1/129, APHB colony, Rajendra nagar, Rangareddy district. -500077 details of which are mentioned below has been misplaced and lost.

**Cheque bearing No.000266** relating to Bank **A/c No. 737301503126, ICICI Bank RP Road Branch, Hyderabad.**

This Cheque has not been issued to any person by my client. Legal action will be initiated against any person misusing the same.

All efforts have been made to search and find the missing and lost cheque, but the cheque could not be traced despite all the efforts by my client. Appeal is made that if any person in possession or knowledge of the same may inform of the same to my client over phone no +91 8978723434.

Hence, this Notice.

**Advocate**
**G. Anand Kumar**
**6-3-1102, 103B, Hidden Treasure Apa1tment, Somajiguda, Hyderabad.**
**(M) 9849471079**

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 మార్చి 2025
తెలంగాణ

# నాటి మూలవాసులే నేటి ముస్లింలు

మన భారతదేశాన్ని ఎంతోమంది ముస్లిం రాజులు పరిపాలించారు. అందరూ ఈ సంస్కృతిలో మమేకమై ఈ మట్టిని ప్రేమించి ఈ మట్టిలోనే కలిసిపోయారు. అయితే వీరంతా ఇస్లాం మత విస్తరణ కాంక్షతో వచ్చారని ఇక్కడి ప్రజలను బలవంతంగా మతం మార్చారు కనుకే ముస్లిం జన సంఖ్య పెరిగిందని కొంతమంది చరిత్రకారులు చరిత్ర వక్రీకరణలు అసంబద్ధ, అసత్య ప్రచారాలు చేశారు. ఏ మతానికి చెందిన రాజులు పరిపాలిస్తే ఆ మతానికి ప్రోత్సాహం లభించిన మాట వాస్తవమే అయినా మొత్తం మత విస్తరణకు అది కారణం కాదు. ఆనాడు సమాజంలో నెలకొనివున్న సామాజిక, ఆర్థిక రాజకీయ, మత పరిస్థితులు ఇస్లాం వ్యాప్తికి దోహద పడ్డాయి. నాడు నెలకొనివున్న చాతుర్వర్ణ వ్యవస్థ, అమానవీయ అంటరానితనం మొత్తం సమాజాన్ని అనేక పాయలుగా చీల్చింది. దిగువ వర్గాల్ని వివక్షత అనే చట్రంలో నలిగిపోయారు. ఈ పరిస్థితులలో విప్లవకారులుగా, జోలె సంచులతో వచ్చిన సూఫీ సన్యాసులు ఇస్లాం ప్రేమ, సమానత్వం ప్రాతిపదికగా అందించారు. వారి ప్రభావానికి గురైన వేలాదిమంది నాటి మూలవాసులు ఇస్లామ్ స్వీకరించి ఆత్మ గౌరవాన్ని పొందారు. అజ్మీర్‌కు చెందిన ఖాజా గరీబ్ నవాజ్ అనే సూఫీ గురువు చేతుల మీదుగా వేలాది మంది ప్రజలు ఇస్లామ్లో ప్రవేశించారంటే వారి ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా చారిత్రకంగా నాటి తొలితరం మూలవాసులే నేటి ముస్లింలని చెప్పవచ్చు.నేటి వర్తమాన స్థితిగతుల్ని బట్టి చూస్తే ముస్లింలు దళితులకన్నా బాగా వెనుకబడివున్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి అభద్రతా భావంలో కొట్టుమిట్టాడుతున్నారు. దేశ జనాభాలో సుమారు 20 శాతం వుండి కూడా విద్య, ఉద్యోగ విషయాలలో, చట్ట సభల్లో నేటికీ తను వాటా పొందలేక పోయారు. 1991 సం॥ జనాభా లెక్కల ప్రకారం ముస్లింలలో దాదాపు సగానికి పైగా పేదరిక రేఖకు దిగువగా వున్నారంటే ఎంత దయనీయమైన స్థితిలో వున్నారో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ముస్లింలలో నేటికీ 2 ఎకరాల పొలంకంటే తక్కువగా వున్నవారు దాదాపు 90% పై చిలుకు వున్నారని గణాంక వివరాలు తెలియపరుస్తున్నాయి. ఇక ఐ.ఏ.యస్., ఐ.పి.యస్., వంటి క్యాడర్లలో కనీసం 1% కూడా మించలేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో సైతం చెప్పుకోదగ్గ పరిస్థితి లేదు. ఒక రకంగా చెప్పాలంటే కార్యనిర్వాహక వర్గంలో వీరికి ఏ పాత్ర లేదు. పల్లెలలో నివసించే ముస్లింలు కూలీలుగా జీవనం సాగిస్తూ, అక్కడి పెత్తందార్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతుకున్నారు. అయితే మెజారిటీ ముస్లింలు పట్టణాలలోనే స్థిర పడ్డారు. వీరంతా మెకానిక్లుగానో, టైలర్లుగానో, డ్రైవర్లుగానో కొనసాగుతున్నారు. ఇంకా రోడ్డు ప్రక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూనో, చేతివృత్తులు చేసుకుంటూనో పొట్ట పోసుకుంటున్నారు. ఎంతకీ ఎదుగు బొదుగులేని జీవితాలతో, చాలీచాలని ఆదాయంతో



దరిద్రాన్ని అనుభవిస్తున్నారు. ఉత్పత్తి రంగంలో స్త్రీలు పాలు పంచుకోవడం పై ఇస్లామ్ ఎటువంటి నిషేధం విధించక పోయినా పురుషాహంకారం వల్ల స్త్రీలు కుటుంబ ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకోలేక పోతున్నారు. తత్ఫలితంగా వీరి జీవన ప్రమాణస్థాయి దారుణంగా పడిపోయింది.

నేటి ముస్లిం సమాజం ఇంతగా వెనుకబడి వుండటానికి ప్రధాన కారణం నిరక్ష్యరాస్యత, అవిద్య ముస్లింలకు తీరని హాని కల్గించింది. దశాబ్దాల చీకటి గోతుల్ని తవ్వింది. చదివించే స్థోమత లేక పిల్లల్ని పనుల్లోకి పంపటం సహజమై. పోయింది. విద్యా ఉద్యోగాలలో సరియైన రిజర్వేషన్ సౌకర్యం లేక పోవటం వలన నిరాశానిస్పృహలతో ముస్లింలు విద్యకు దూరంగా జరిగి పోయారు. ముస్లింలు మొదటగా ఉద్యమించాల్సింది విద్య, ఉద్యోగాలలో ప్రాతినిధ్యం కోసం మాత్రమే. ఇస్లాంలో విద్యకు, జ్ఞానానికి పెద్ద పీట వెయ్యడం జరిగింది. పవిత్రఖుర్‌ఆన్లో మొదటి వాక్యం చదువుతోనే ప్రారంభమౌతుంది. స్వయాన దైవ ప్రవక్త ముహమ్మద్ (స) విద్యార్జన కోసం భూమి చివరి అంచుల వరకైనా వెళ్ళండి అని ఉపదేశించారు. అయినా ముస్లిం సమాజం విద్యను గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న దాఖలాలు లేవు. ఇటీవలి విద్యా సర్వేప్రకారం ముస్లిం విద్యార్థుల డ్రాపవుట్స్ శాతం పెరిగింది. ఈ డ్రాపవుట్స్ శాతాన్ని తగ్గించేందుకై ప్రభుత్వం, ముస్లిం సమాజం కల్సి కృషి చేయాల్సిన అవసరం ఎంతో వుంది.

ముస్లిం సమాజంలో మదరసాలకు ఎనలేని ప్రాధాన్యత వుంది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదరసాలు కీలకమైన పాత్ర పోషించాయి. అటువంటి మదరసాలు నేడు ఆధునిక విద్యకు దూరమై కేవలం ధార్మిక విద్యకు మాత్రమే పరిమితమయ్యాయి. ఇహలోక సంబంధమైన విషయాలకు, పరలోక సంబంధమైన విషయాలకు ఇస్లామ్ సమాన ప్రాతినిధ్యం ఇచ్చినా ముస్లిం పండితులు మదరసాలలో కేవలం ధార్మిక విద్యను మాత్రమే బోధించటం వల్ల సామాజిక శాస్త్రాల్ని, గణితం, ఇంగ్లీషు, తెలుగు తదితర బోధనాంశాలను ప్రక్కన పెట్టడం ద్వారా నేటి వర్తమాన ప్రపంచంలో ముస్లింల విద్యాస్థాయిని దారుణంగా దెబ్బతింది. ఇప్పుడిప్పుడే ఆధునిక విద్య మదరసాలలో చోటుచేసుకోవటం,ఈ కోణంలో ఉలేమాలు ఆలోచించటం హర్షణీయం.. కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నట్లుగా మదరసాలు తీవ్రవాద నిలయాలు కావు. ఇవి విద్యార్థులలో నైతిక వర్తన పెంచుతూ ధార్మిక నియమాలు పాటించే వారిగా మాత్రమే తయారు చేస్తాయి. ఇందులో చదివే విద్యార్థులకు తమ చుట్టూ వున్న ప్రపంచం గురించి ఏమాత్రం తెలియపర్చకుండా, కనీసమైన సామాజిక స్పృహను కలిగించకుండా కొంతమంది మత పండితులు ఉపేక్షించడం ఇస్లామ్ స్ఫూర్తికే విరుద్ధం. ఇప్పటికైనా మత పండితులు ఆత్మ విమర్శ చేసుకుని ధార్మిక విద్యతో పాటు సామాజిక శాస్త్రాల్ని కూడా బోధనాంశాలుగా పెట్టి మదరసాల్ని ఆధునీకరించాల్సిన అవసరం వుంది.

మతపరమైన విషయాలలోనూ ముస్లింలు ఇస్లామ్ వాస్తవిక రూపాన్ని దర్శించలేక పోతున్నారు. ఇస్లామ్ అత్యంత ప్రగతిశీలమైన ధర్మం. కాని ఒక డ్రైవింగ్ తెలియని డ్రైవర్ చేతిలో చిక్కిన కారులా కొన్ని విషయాలకే పరిమితమై నడుస్తున్నది. ఇస్లాంలో లేని అనేక దురాచారాలను తలకెత్తుకున్న ముస్లిమ్ సమాజం స్వీయ సంస్కరణల బాటలో నడవవల్సి వున్నది. ఆర్థికాభివృద్ధి కోసం దేబిరించే బదులు 'జకాత్' వ్యవస్థను పటిష్ట పర్చుకోవడం ద్వారా స్వీయ సమృద్ధిని సాధించాలి. మతపరమైన ఉద్రిక్తతలకు తావిచ్చే అంశాలలో అత్యంత వివేకంతో సంయమనం పాటించాలి. ఇంటి గడప దాటకుండా, సామాన్య ముస్లిం ప్రజల కష్టనష్టాలు తెలియకుండా బాధ్యతలేని ప్రకటనలతో ఉద్రేకపూరిత ఉపన్యాసాలు చెప్పే రాజకీయ నాయకులు ముస్లింలకు ఒరగబెట్టిందేమీ లేదు. ముస్లింల డోలయాన స్థితిని ఆసరా చేసుకొని కొన్ని శక్తులు మెజార్టీ సమాజంలో మసిపూసి మారేడు కాయ చేసిన చందంలా ముస్లింల ఉనికి పట్ల భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. తమకు అందుబాటులో వున్న మీడియాద్వారా తమ పట్ల ఇతర సమాజాలలో పెరుగుతున్న అపోహలను, అపార్థాలను తొలగించే కార్యక్రమాన్ని ముస్లిం మేధావులు చేపట్టాలి. మతోన్మాదానికి సమాధానం మతోన్మాదం కాకూడదు. స్వయాన ప్రవక్త ముహమ్మద్(స) మలినాన్ని మలినంతో శుభ్రపర్చలేమని చెప్పారు. మతోన్మాదం, టెర్రరిజం పరస్పర ఆధారితాలు ఈ రెండు వివేక శూన్యమయినవే.

ఇప్పుడు ముస్లిమ్ సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్య అభద్రతాభావం. ఈ వలయంలో చిక్కి ముస్లిమ్ సమాజం విలవిలలాడిపోతున్నది. ముస్లింలు స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి కరువైంది. చివరికి క్రికెట్ కూడా టి.వి.లో అందరితో కలిసి చూడలేని దౌర్భాగ్యపు పరిస్థితులు చుట్టుముట్టాయి. కొన్ని శక్తులు ఒక పథకం ప్రకారం ముస్లింల దేశభక్తిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో ఎనలేని త్యాగాలు చేసిన ముస్లింల చరిత్ర ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించబడింది. నిజానికి దేశవిభజన వల్ల ఎక్కువగా నష్టపోయిన వారు భారతీయ ముస్లింలే. భారతీయ ముస్లింలకు దేశ విభజన వల్ల జరిగిన నష్టం అపారమైనది. స్వీయ ప్రయోజనాల కోసం నిత్యం పాకిస్తాన్ పాలకులు అనుసరిస్తున్న దుష్ట వైఖరి భారతీయ ముస్లింలకు పెను శాపంలా మారింది. భారత్లో ఐ.యస్.ఐ. కొనసాగిస్తున్న విధ్వంసకర కార్యక్రమాలతో భారతీయ ముస్లింలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా తదనంతర పరిణామాలకు ముస్లిం సమాజం బలి అవుతున్నది. పరాన్న భుక్కులుగా కాక శ్రమ విలువలతో కూడిన జీవన విధానం కలిగి వున్న ముస్లింలు సామాజిక, ఆర్థిక, సమస్యలతో పాటు అభద్రతాభావాన్ని మోయాల్సి రావడం విచారించదగ్గ విషయం.


వర్తమాన ఆధునిక కాలంలో సమస్యలు పెరిగాయి. ప్రతి సమాజానికీ కొన్ని ప్రత్యేక సమస్యలు వున్నాయి. ఈ పరిస్థితులలో అనేక ఉమ్మడి సమస్యలపై ముస్లిం సమాజం ఇతర సమాజాలతో కల్సి నడవవల్సిన అవసరం వుంది. అయితే అన్ని సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ముస్లిం సమాజం అదనపు సమస్యలను ఎదుర్కొంటుంది. ఇలాంటి విచిత్ర పరిస్థితులలో స్వీయ తప్పిదాలను సవరించుకునే వైపుగా అడుగులు పడాలి. ముందుగా ముస్లింలు తాము అగ్రవర్ణీకులమని,నవాబులమనే భావనను తొలగించుకోవాలి. ప్రత్యేకమైన భాష, సంస్కృతిని కలిగి వుండటం తప్పుకాదు. కాని ఉర్దూభాష ఇస్లామ్ భాషనే భావ జాలం నుండి బయటపడాలి. తెలుగు లేదా ఇతర స్థానిక భాష మాట్లాడే ముస్లింలను చిన్న చూపు చూడటం మానుకోవాలి. సాంస్కృతిక వైరుధ్యం శృతిమించితే అది విభిన్న సమాజాల మధ్య విభజనకు దారితీస్తుంది. ప్రాంతీయ భాషల్ని సామాన్యీకరణ చేసుకోవడం ద్వారా ముస్లిం సమాజం ఇతర సమాజాలకు దగ్గరవుతుంది. తద్వార ఒకరి సమస్యలు మరొకరు తెల్సుకోవటానికి వీలవుతుంది. ఒకరి పట్ల మరొకరికి వున్న అనుమానాలు దూరమై ఉమ్మడి సామాజిక ఐక్యత సాధ్యమవుతుంది.

ముస్లింలు తమ మూలాల్ని వెతుక్కోవాల్సిన అవసరం వుంది. సామాజిక స్పృహను కలిగి వుండాలి. పీడక వర్గాలేవో, పీడిత వర్గాలేవో గుర్తించి తమతో సారూప్యమున్న అట్టడుగు బలహీన వర్గాల ప్రజలతో ఐక్యవేదికను నిర్మించుకోవాలి. అయితే ఇటీవలి కాలంలో ఈ ప్రయత్నాలు జరుగుతూ వుండటం హర్షించదగ్గ విషయం. ముస్లిం యువత ఇప్పుడు తీవ్రమైన నిరాశ నిస్పృహలమధ్య కొట్టుమిట్టాడుతుంది. అసంతృప్తి ఆలోచనాత్మకమైన నిర్మాణం వైపుకు కదలాలి, అంతే కాని అవేశపూరితమైన విధానాల వైపుకు కాదు. ప్రజాస్వామ్యబద్ధమైన ప్రగతిశీల, సెక్యులర్ శక్తులతో కలిసి నడుస్తూ విద్యాభివృద్ధి, ఆర్థికాభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాలి. తద్వారా మాత్రమే ముస్లిం సమాజం సమస్యల సుడిగుండం నుండి బయట పడగలుగుతుంది. ముస్లింలు ఇప్పుడు పాకులాడాల్సింది గుప్పెడు సానుభూతి కోసం కాదు. ఆత్మవిశ్వాసం కోసం, అచంచలమైన విజయ విశ్వాసం కోసం.

**కవి కరీముల్లా, సామాజిక వ్యాసం**

## తెలంగాణ సాయుధ పోరాటయోధుడు

# బి.ఎన్.రెడ్డి



భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. ఆ తెలంగాణ సాయుధ పోరాటంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి 'బి.ఎన్.రెడ్డి'గా ప్రాచుర్యం పొందారు. 'దున్నేవాడిదే భూమి' అంటూ నినదించి వంద ఎకరాల స్వంత భూమిని పేద ప్రజలకు పంచిన నిస్వార్థ త్యాగశీలి బి.ఎన్.రెడ్డి. అనేక ప్రజా పోరాటాల్లో ఆయన నడుం బిగించి పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు ఉద్యమించారు.

తెలంగాణ సాయుధ పోరాట నాయకులలో ఒకరుగా నిలిచిన బి.ఎన్. రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ( ప్రస్తుత సూర్యాపేట జిల్లా ) తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో వందలాది ఎకరాలు కలిగిన భూస్వామ్య కుటుంబంలో 1922 మార్చి 15 నాడు భీంరెడ్డి రాంరెడ్డి, చొక్కమ్మ దంపతులకు జన్మించారు. ఆయన భూస్వామ్య కుటుంబంలో జన్మించినను ఆలోచనలు, ఆశయాలు మాత్రం సమ సమాజం వైపుగా పయనింపజేయడంతో క్రమంగా ఆయన తెలంగాణ సాయుధ పోరుబాట దిశగా ముందుకు సాగారు. స్థానిక భూస్వాముల, జమీందారుల నిరంకుశత్వానికి, వెట్టిచాకిరి విధానానికి వ్యతిరేకంగా మరియు రజాకారుల అరాచకాలకు, అకృత్యాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన తెలంగాణ సాయుధ పోరాటంలో 'తెలంగాణ ఉద్యమానికి సాయుధ సేనాని'గా నిలిచి ఉద్యమ చివరి దశ వరకు ఆయన వీరోచిత పోరాటం సాగించారు.


బి.ఎన్.రెడ్డి భారత కమ్యూనిస్ట్ పార్టీ (సి.పి.ఐ )లో చేరి క్రమంగా కీలక బాధ్యతలు నిర్వహించారు. 1957లో తుంగతుర్తి నియోజకవర్గం నుండి బి.ఎన్.రెడ్డి శాసన సభ్యునిగా గెలుపొందారు. భారత కమ్యూనిస్టు పార్టీ చీలిన తర్వాత ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)లో చేరారు. 1967లో సూర్యాపేట నియోజకవర్గం నుండి శాసన సభ్యునిగా గెలుపొందారు. 1971లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బి.ఎన్.రెడ్డి సి.పి.ఎం పార్టీ నుంచి మొదటిసారి పోటీచేసి పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించారు. 1977-1980లలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బి.ఎన్.రెడ్డి ఓటమి చెందినను 1984లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాలుగో సారి పోటీచేసి రెండోసారి పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించారు. ఆ తర్వాత 1989లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బి.ఎన్.రెడ్డి మరోసారి ఓటమి చెందినను ఆ తర్వాత 1991లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆరవసారి పోటీచేసి మూడోసారి పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించారు. ఆ రకంగా ఆయన రెండుసార్లు శాసనసభ్యుడుగాను, మూడుసార్లు పార్లమెంట్ సభ్యుడు గాను గెలుపొంది సరికొత్త చరిత్రని సృష్టించారు.

అసెంబ్లీ మరియు పార్లమెంటు సమావేశాలకు బి.ఎన్.రెడ్డి ఎప్పుడూ ప్రభుత్వ వాహనాల లోనే ప్రయాణించారు. అసెంబ్లీ మరియు పార్లమెంటులలో సామాన్యులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆయన లేవనెత్తి వాటి పరిష్కారాల దిశగా ముందుకు సాగి భావితరాలకు ఆదర్శంగా నిలిచారు. ఆయన తన 'పాతిక సంవత్సరాల పాటు మచ్చలేని కమ్యూనిస్టు ప్రజాప్రతినిధి'గా పేరు ప్రఖ్యాతులు పొందారు. ఈ తరం రాజకీయ నేతలు అలాంటి నేతల జీవితాల నుంచి ఆదర్శాలు స్వీకరించి పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'సామాజిక న్యాయం లక్ష్యంగా రాజ్యాధికారం కోసం రాజీలేని పోరాటం సాగించాలి' అని బి.ఎన్.రెడ్డి 1996 లో సూర్యాపేట పట్టణంలో భారీ ప్రదర్శనను నిర్వహించారు. ఆయన 1997 లో సి.పి.ఎం పార్టీని విడనాడి సి.పి.ఎం ( బి.ఎన్) స్థాపించారు. అనంతరం 2000 లో మద్దికాయల ఓంకార్ స్థాపించిన ఎం.సి.పి.ఐ లో ఆయన పార్టీని విలీనం చేశారు. ఆయన ఏ కమ్యూనిస్ట్ పార్టీలో కొనసాగినను అంతిమంగా ప్రజా సమస్యల విముక్తి కోసం అవిశ్రాంతంగా ఉద్యమించారు.


బి.ఎన్. రెడ్డి చాలా సాదాసీదా నిరాడంబర జీవితాన్ని గడిపారు. ఆయన తనకోసం ప్రత్యేకంగా సంపాదించుకున్నది ఏమి లేదు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన బి.ఎన్. రెడ్డి అదే భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి లక్షలాది ఎకరాల భూమిని భూస్వాముల బారి నుండి విముక్తి చేసి పేదలకు పంచడంలో అనేక పోరాటాలు నిర్వహించారు. ఆ రకంగా ఆయన ఎల్లప్పుడూ పేదల పక్షాన నిలిచి అణచివేత మరియు దోపిడి నుండి అణగారిన వర్గాల విముక్తి కోసం అవిశ్రాంతంగా పోరాడారు. 'కమ్యూనిస్టులను ఐక్యంగా చూడాలి' అని, 'ఆకలిదప్పులు లేని అసమానతలు లేని సమసమాజం ఆవిష్కరించబడాలి' అని ఆయన పరితపించారు. ఏడు దశాబ్దాలకు పైగా ప్రజా పోరాట ఉద్యమాల్లో జననేతగా వెలుగొందిన బి.ఎన్.రెడ్డి 2008 మే 9 నాడు మరణించారు. అంతిమంగా ఆయన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకోవడమే కాకుండా భారత కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్రలో ఆదర్శ కమ్యూనిస్ట్ గానూ వేనోళ్ళ కొనియాడబడుతున్నారు.

(మార్చి 15 బి.ఎన్.రెడ్డి జయంతి )



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# ఆ ముగ్గురు... శాటిలైట్ ఇంటర్నెట్



ఎలాన్ మస్క్, అనిల్ అంబానీ, భారతి మిట్టల్, ఇప్పుడు ఈ ముగ్గురు శాటిలైట్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని భారత దేశంలో అందించడం కోసం ఒప్పందం చేసుకున్నారు. ప్రపంచ కుబేరుడుగా పేరు ఉన్న, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు సన్నిహితుడైన ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో ఎయిర్టెల్, జియో కంపెనీల యజమానులు ఒప్పందం చేసుకున్నారు. ఆ ఇప్పటిదాకా ఫైబర్ నెట్వర్క్ మీద ఆధార పడి ఉన్న మన దేశంలో తాజాగా స్టార్ లింకుతో ఎయిర్టెల్, జియోలు విడివిడిగా ఒప్పందం చేసుకోవడం ఆశ్చర్యంగానే ఉంది. రంగంలో ఐడియా, తదితర ఎన్నో నెట్వర్కు మనదేశంలో ఉన్నప్పటికీ ఈ రెండు మాత్రమే స్టార్ లింకుతో ఇప్పుడు చేతులు కలిపాయి. ఈ విషయం బుధవారం నాడు ఆ కంపెనీలు ప్రకటించాయి.

కేంద్రం ఆమోదం!

స్టార్ లింక్ ఆమోదమును కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా పొందాల్సి ఉంటుంది. అయితే గత నెల అమెరికాకు మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెళ్లినప్పుడు మస్క్ ఆయనతో విడిగా తన కుటుంబ సభ్యులందరితో కలిసి మాట్లాడారు. బహుశా అక్కడే ఈ విషయాలు ఫైనలై ఉంటాయని , కాబట్టి కేంద్రం నుంచి ఆమోదం లభించడం దీనికి పెద్ద విషయమేమీ కాకపోవచ్చు! మొత్తం ప్రపంచంలో స్టార్ లింక్ వినియోగదారులు 50 లక్షల పైచిలుకు ఉన్నారు. అమెరికాలో స్టార్ లింకు బ్రాడ్ బ్యాండ్ కంపెనీలకు గ్రామీణ ప్రాంతాలలో గట్టి పోటీనే ఇస్తున్నది. సుమారు ఉపగ్రహాలు 7000 శాటిలైట్ ఇంటర్నెట్ అందిస్తున్న దేశాలు వందకు పైగా ఉన్నాయి. మన దేశంలో వెంటనే శాటిలైట్ సేవలు అందే పరిస్థితి లేదు. దీనికి కొంత సమయం అవసరం ఉంటుంది.

**బ్రాడ్ బ్యాండ్ వినియోగదారులు 94 కోట్లు !**


మారుమూల గ్రామాలలో భారత దేశంలో 94 కోట్ల పైచిలుకు బ్రాడ్ బ్యాండ్ వినియోగదారులు ఉన్నారు. అందులో 90 కోట్ల పైచిలుకు మంది మొబైల్ ఇంటర్నెట్ ను వాడుతున్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ చార్జీలతో పోలిస్తే భారతదేశంలో మొబైల్ ఇంటర్నెట్ చాలా చౌకగా లభిస్తుంది. 20 రూపాయలు చెల్లిస్తే ఒక జీబి డేటా అందుకునే పరిస్థితి ఉన్నది. 50 రూపాయల నుంచి అన్లిమిటెడ్ ప్యాక్స్ కూడా లభిస్తాయి. శాటిలైట్ టెలికాం కేవలం ఇంటర్నెట్ కే పరిమితం. కాల్స్ చేయాలంటే ఓటిటి యాప్స్ పైన ఆధార పడాల్సిందే అంటున్నారు. అమెరికాలో స్టార్ లింక్ చార్జీలు మనకు అందుబాటులో ఉండవు.

**స్టార్ లింకు మరీ కాస్ట్లీ!**

మనకి ఇక్కడ చాలా కాస్ట్లీ అయిపోతాయి. అయితే ఇప్పటికే టెస్లా కంపెనీ యజమానిగా ఉన్న మస్క్ తన కారుల బిజినెస్ దెబ్బతింటుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ను రంగంలోకి దింపారు. ఇప్పుడు స్టార్ లింక్ ను భారతదేశానికి తీసుకొస్తున్నారు. మొత్తం నాలుగు లక్షల గ్రామాలకు ఫైబర్ నెట్వర్క్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని అందిస్తామని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గతంలో పేర్కొన్నారు. అయితే కొంత పరిమిత గ్రామపంచాయతీలలో ఈ సౌకర్యాన్ని కల్పించ డం జరిగింది. ఇవి లక్ష వరకు పూర్తి అయ్యా యి. ఇప్పుడు మళ్లీ మొదటి నుంచి శాటిలైట్ కు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే పరిస్థితి వచ్చింది. దీనికి భూమిని తవ్వి లైన్ లు వేయాల్సిన అవసరం ఉండదు.డైరెక్ట్ షార్ట్ లైట్ ద్వార ఈ సౌకర్యం ఉంటుంది.ఫైబర్ నెట్వర్క్ వల్ల భారీగా ఖర్చు అయ్యింది. దాని సంగతే మిటో ఇప్పటిదాకా తెలియదు. ఇప్పుడు తాజాగా ఈ స్టార్ లింక్ ఒప్పందం ఎందుకో ఏమిటో తెలియాల్సి ఉంది. స్టార్ లింక్ కనెక్షన్ కావాలంటే నెలకు కనీసం మొబైల్ కు 4360 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అపరిమితమైన డేటా ఉంటుంది. 220ఎంబిపిఎస్ వరకు వేగాన్ని ఇది ఆఫర్ చేస్తున్నది. బిజినెస్ విభాగంలో నెలకు 12,208 నుంచి 4 లక్షల 36 వేల రూపాయలు వరకు ఇందులో ప్లాన్స్ ఉంటాయి.

**మన అంబాని, మిట్టల్‌ను మస్క్ మింగేయడు కదా!**

ఎయిర్టెల్ అటు జియో లను స్టార్ లింక్ మస్క్ మింగడు కదా.. అనే అనుమానాలు లేక పోలేదు!కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 2జి స్కాం కూల్చినట్టు ఇప్పుడు ఈ స్టార్ లింక్ ప్రవేశం ఒక స్కాంగా మారి బిజెపి పీఎం నరేంద్ర మోడీ ప్రభుత్వానికి గండంగా పరిగణించేది కాదు కదా అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చిత్తం వచ్చినట్లు భారతదేశంను అవమానించే విధంగా మాట్లాడుతున్నప్పటికీ మన వైపు నుంచి బాధ్యతగల మంత్రులు ఎవరు కూడా ఒక్క మాట మాట్లాడడం లేదు. టారిఫ్ పై ఇతర దేశాలు అమెరికా మీద గుర్రుగా ఉన్నాయి. మనం కనీసం ఆ కోపాన్ని కూడా వ్యక్తం చేయడం లేదు. మరోవైపు మస్క్ తో మన ఎయిర్టెల్, జియో యాజమానులు స్టార్ లింకును దేశంలో ప్రవేశపెట్టడానికి ఒప్పందం చేసుకోవడం విశేషంగానే కనిపిస్తుంది. గతంలో ఫైబర్ నెట్వర్క్ గురించి పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చిన వారు ఇప్పుడు ఈ శాటిలైట్ నెట్వర్క్ ను ఇండియాకు తీసుకురావడంలో అంతర్యం ఏమిటో? ఇది పీఎం నరేంద్ర మోడీకి తెలియకుండానే జరిగి ఉంటుందా? అనే చర్చ కూడా ప్రస్తుతం జరుగుతున్నది. ఏది ఏమైనా ట్రంప్ తన మిత్రుని కోసం భారతదేశం పై ఎలాంటి ఒత్తిడి తీసుకొచ్చినా ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే ఇండియన్ మార్కెట్ పరిస్థితి బాగోలేదు! దేశీయ వ్యాపారాలు అన్నీ కుదేలు అవుతున్నాయి.ఇప్పుడు ఏ మేరకు భారత దేశంలో స్టార్ లింక్ ప్రవేశం, ఎవరికి ఎంత ఉపయోగప డుతుందో వేచి చూడాల్సిందే!.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# అమెరికా వైఖరి : ప్రపంచ శాంతి ముప్పు కానుందా?

డోనాల్డ్ ట్రంప్ రెండో సారి అధ్యక్షుడుగా అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా ప్రపంచవ్యాప్తంగా అనేక అంతర్జాతీయ ఒప్పందాలను తిరస్కరిస్తూ, ఐక్యరాజ్య సమితి లోని అనేక సంస్థల నుండి క్రమంగా వైదొలగే దిశగా కదులుతోంది. మార్చి 4న జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో, 'అంతర్జాతీయ శాంతియుత సహజీవన దినం' తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకించింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిరాకరిస్తున్నట్లు అమెరికా ప్రతినిధి స్పష్టం చేయడం గమనార్హం. ప్రపంచదేశాల మధ్య సమగ్ర అభివృద్ధిని నిరోధించే ఈ వైఖరి అమెరికా ఏకపక్ష విధానానికి సంకేతంగా మారింది.

అమెరికా వ్యతిరేకించినప్పటికీ, ఈ తీర్మానం 162 దేశాల మద్దతుతో ఆమోదం పొందింది. కానీ, మరుసటి రోజున 'అంతర్జాతీయ ఆశాదినం', 'అంతర్జాతీయ న్యాయ సంక్షేమ దినం' లాంటి తీర్మానాలకు కూడా అమెరికా వ్యతిరేకంగా నిలవ డం అసలు సమస్యగా మారుతుంది. 'అందరికీ విద్యాహక్కు' తీర్మానానికి అంగీకరించకుండా ఉన్న ఏకైక దేశం అమెరికానే. ట్రంప్ పాలనలో కొనసాగుతున్న 'డీఈఐ- వైవిధ్యం, సమానత్వం, సమగ్రత' వ్యతిరేక విధానాల ప్రభావం అంతర్జాతీయ స్థాయిలోనూ స్పష్టంగా కనిపిస్తోంది.

**ఐక్యరాజ్య సమితి నుంచి అమెరికా వైదొలగితే ప్రపంచ మనుగడ,శాంతి, అభివృద్ధి ఏలా ?**

ట్రంప్ ఇప్పటికే ప్రపంచ దేశాలకు,సర్వ మానవాళికి మేలు చేసే ఆరోగ్య సంస్థ (డబ్లు.హెచ్.ఓ.), పారిస్ వాతావరణ



ఒప్పందం, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (యూ.ఎన్.హెచ్.ఆర్.సీ.) లాంటి అనేక అంతర్జాతీయ ఒప్పందాల నుంచి అమెరికాను తప్పించాడు. ఇప్పుడు ఐక్యరాజ్య సమితి మొత్తంగా వదిలిపెట్టే అవకాశమూ లేకపోలేదు.ఇది ప్రపంచ దేశాలను ఆందోళనలో పడవేసింది.ఇప్పటి వరకు అమెరికా ఒక అగ్ర రాజ్యంగా యూ.ఎన్.ఓ. లోని అనేక విభాగాలకు ఆర్థికంగా విరాళాలు అందించి అందుకొంది. ట్రంప్ ఆ నిధులకు కోతపెట్టే అవకాశం ఉంది.

**అమెరికా నిర్ణయం అంతర్జాతీయ పరిణామాలపై ప్రభావం:**

2022లో అమెరికా ఐక్యరాజ్యసమితికి 18.1 బిలియన్ డాలర్లు అందించింది, ఇది మొత్తం నిధుల్లో 20 శాతానికి సమానం. అయితే, (యూఎస్ ఏఐడీ ) మూసివేతతో అనేక ఐక్యరాజ్య సమితి సహాయ కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఐక్యరాజ్యసమితికి ఇది మరింత తీవ్రమైన దెబ్బ. అయితే, ట్రంప్ చర్యలు అనూహ్యంగా కొత్త అంతర్జాతీయ సహకారాలకు దారితీసే అవకాశం ఉంది. అతని విధానాలకు వ్యతిరేకంగా అనేక దేశాలు మరికొన్ని కూటములుగా ఏర్పడే అవకాశం ఉంది. వాతావరణ మార్పులు, అభివృద్ధి ఫైనాన్సింగ్, పన్ను విధానం వంటి అంశాల్లో అమెరికా లేకున్నా, ఇతర దేశాలు ముందుకు సాగడం విశేషం.

**ఐక్యరాజ్య సమితి భవిష్యత్తు ఏమి కానుందో ?**

అమెరికా, ఐక్యరాజ్యసమితి బహుళపాక్షిక విధానాలను ధ్వంసం చేయాలని చూస్తున్నా, అవి గతంలో ఎక్కువగా అమెరికా వంటి శక్తివంతమైన దేశాలకే ప్రయోజనం కలిగించాయి. ఇప్పుడు ఏర్పడిన అనిశ్చితి బహుళ పాక్షిక సహకారానికి కొత్త మార్గాలను సూచించే అవకాశముంది. ట్రంప్ తన విధానాలతో ప్రపంచంపై ఏకపక్ష ఆధిపత్యాన్ని మోపాలని చూస్తున్నా, ఇది దీర్ఘకాలికంగా అమెరికాకే నష్టం చేసే పరిస్థితిని ఏర్పరచవచ్చు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## స్వేచ్ఛ - అధికారం

ఎంత దూరమైనా పర్లేదు,
భయం లేని చోటుకే వెళ్దాం.
దూరానికి భయపడి, దగ్గరే కూర్చుంటే
వచ్చినవాడు ఆ స్థలం నాది అంటాడు.
నీకు పది నిమిషాల తీరిక,
వాడికి పది తరాల అధికారం.
నువ్వు వాడ్ని పొమ్మనలేవు,
వాడు నిన్ను పొమ్మంటాడు.
నీ వెళ్ళిపోకుంటే, ఇంకేమైనా చేస్తాడు.
నువ్వెళ్లిపోయాక,
వాడక్కడే తిష్టేసి కూర్చుంటాడు.
వాడిని నువ్వు ఆపలేవు,
వాడే నిన్ను శాసిస్తాడు.
నీ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ,
నీ సమస్తాన్ని గుప్పిట్లో దాస్తాడు.
చివరికి... నీ భూమినీ, నీ హక్కునీ,
నీ స్వేచ్ఛనూ, వాడే నిర్ణయిస్తాడు.
ఇది కాదు నీక్కావాల్సింది –
ఇవన్నీ నిర్ణయించే స్వేచ్ఛ కావాలి,
నీ బతుకుపై నీకే కొండంత అధికారం కావాలి
నీ సంపదంతా నీ సొత్తు కావాలి
అణిచి ఉంటే అణిచేస్తారు
తిరగబడి లేస్తేనే తిరిగిచ్చేస్తారు

-బాలాజీ పోతుల
8179283830

## ఫర్జ్..

అలుపొందనివీ
అవసరమైనవీ
అత్యాధునికమైనవీ
ఎన్నెన్నో
నిర్మాణాలు
అన్నీ ఉన్నాయి...
అయినా...
ఆస్థిత్వాలు
ఈటెలయ్
పొడుచుకు
లేస్తున్నయ్..
ద్రోహాలూ
రాసికారే
గాయాలు
షరామాములై..
జీనా గజబ్ హువా
సచ్చీ జిందగీ
గాయబ్ హుయి...
దశబ్దాల ఆక్రోషం
ఎగిసిపడ్డ పిడికిళ్లు
ఉప్పొంగిన అడుగులు
రుధిర ధరిత్రై
సాగుతున్న
సమర చరిత్రలో..
కాలం కసిగా
బిగిసి ఎత్తిన
పిడికిళ్లు
సాచిన చేతుల్లో
చిల్లరగా తేలెనా...
సమత కోసం
మమత కోసం
సాగిన అడుగులు
పడిగాపులేనా..
ఖాబో ఔర్
ఖాయాలోకే
సారే ఉమ్మీద్
సిర్ఫ్ రాహే లేనా..
ఎదురు చూపులు
ఎండమావులై
తేలిపోనీ గాక ..
సంకెళ్లకు
తలవొగ్గని
సంకల్పాలు
గుండె గాయాల
కొలిమిలో తర్ఫీదై
పదును బారి
రాటుదేలి
కొత్త ఉదయాలకు
పురుడుపోస్తానంటున్నాయి.

డాక్టర్. ఇక్బాల్ పాషా
9440775732

# ముదురుతున్న ఎండలు...ఎండుతున్న పంటలు





- **దిక్కుతోచని స్థితిలో రైతులు**

**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లాలో దినదినానికి ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి పంతలకువనిరు అందక పంటలు ఎండిపోతున్నాయి.దాంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు.వర్షాకాలంలో వర్షాలు బాగా కురియడంతో చెరువులు నిండి భూగర్భ జలాలు పెరగడంతో రైతులు రబీలో వరి పంటను అధిక మొత్తంలో సాగు చేశారు.అందరూ వరి సాగు చేయడంతో ప్రస్తుతం చెరువుల్లో నీరు ఇంకిపోయి భూగర్భ జలాల మట్టం పడిపోవడంతో వరి పంటకు సాగు నీరు అందని పరిస్థితి ఏర్పడింది.ఇంకా నెల రోజులు గడిస్తే వరి పంట చేతికి వస్తుంది.కానీ ఇప్పుడే పంటకు నీరు అందని పరిస్థితుల్లో పంట ఎండి పోతున్నది.జిల్లాలోని నదీ తీర ప్రాంతం కృష్ణ, మాగనూర్, నర్వ, సాగు నీటి ప్రాజెక్టులు ఉన్న మక్తల్, మరీకల్ మండలాలతో పాటు కేవలం బోర్ల నీటితో ఆధారపడి ఉన్న దామరిగిద్ద, మద్దూరు, నారాయణపేట, ఉట్కూర్,దన్వాడ ,గుందుమల్,కొత్తపల్లి,కోషిగీ మండలాల్లో రైతులు పెద్ద మొత్తంలో వరి సాగు చేశారు.పంట పెట్టుబడికి వేలల్లో అప్పులు చేసి సాగు చేశారు.తీరా ప్రస్తుతం పంటకు నీరందక ఎండి పోతుండటంతో పంటను పశువులు మేకలకు ఆహారంగా మేపుతున్నారు.దామరగిద్ద మండలం మొగల్ మడక గ్రామంలోని వరి నాట్లు వేసుకున్న రైతులకు భూగర్భ జలాలు ఇంకిపోవడం వల్ల సుమారు70 ఎకరాల భూమికి సాగునీరు అందడం లేదు పంటలు ఎండిపోయే దశ ఉన్నందున రైతులకు అపార నష్టం కలిగింది. విధి లేక రైతులు పశువులకు మేతమేపుతున్నారు.ఇలా ప్రతి మండలంలో వరి పంట సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చే దశలో పంటలు ఇంకా నెల అయిపోతే చేతికొచ్చే అవకాశం ఉన్న తరుణంలో పంటలు ఎండపోతుండడంతో రైతులు దిక్కు తోచక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వము దృష్టిలో పెట్టుకొని నష్టపోయిన రైతులను ఆర్థికంగా పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.వేరే మార్గం లేక అప్పుల పాలైన సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లి వలస కూలీలుగా బతికే పరిస్థితి ఏర్పడుతున్నదనీ రైతులు వాపోతున్నారు.

# పొలాలకు దారి వదలాలని వినతి

- **తహసిల్దార్, ఆర్డిఓ, జిల్లా కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు**



**తూప్రాన్, మార్చి 13 (జనం సాక్షి) :** ముప్పిరెడ్డిపల్లి కొండాపూర్ పరిశ్రమల మండలి నుండి తమ పొలాలకు దారి వదలాలని కోరుతూ కొండాపూర్ ముప్పిరెడ్డిపల్లి గ్రామాల రైతులు తూప్రాన్ ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల పరిధిలోని కొండాపూర్,ముప్పిరెడ్డిపల్లి చెందినసర్వే నంబర్ 129,131,కి చెందిన 191 ఎకరాల ప్రభుత్వ భూమిని పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం తీసుకొని పారిశ్రామవాడకి టిజిఐఐసీకి అప్పగించింది. చుట్టుపక్కన ఉన్న తూప్రాన్ మండల పరిధిలోని రెవెన్యూ గ్రామం మజీద్ పల్లి మనోహరాబాద్ మండల పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న గ్రామాలకు వ్యవసాయ భూములకు చెందిన రోడ్డుతో పాటు పట్టా భూములను కూడా టీఎస్ ఐఐసీకి అప్పగించారు. దీనితో మజీద్ పల్లి ఎన్కె గ్రామానికి వెళ్లేందుకు ఉన్న నక్షదారిని కూడా దారిని పరిశ్రమలకు కేటాయించడంతో సుమారుగా 42 నుంచి 50 ఎకరాల వరకు రైతులు పండిస్తున్న పంటల పొలాలకు వెళ్లే దారి కనుమరుగవుతుంది. దీనితో రైతులు ఆందోళన చెందుతూ పెద్ద ఎత్తున పరిశ్రమ కట్టడాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ముప్పిరెడ్డిపల్లి గ్రామ రైతులు మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా ఉన్న నక్షదారిని ఊర చెరువుని అక్కడికి వెళ్లడానికి వరి కోత మిషన్లు ట్రాక్టర్లు పోకుండా దారినీ పరిశ్రమలకు ఇవ్వడం తో చుట్టుపక్కల ఉన్న పట్టాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా సర్వే చేసి పరిశ్రమలకు కేటాయించడంపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన లేకుండా పరిశ్రమలను ఇంకో చోటికి తరలిస్తున్నారు. మరలా ఇంకో పరిశ్రమ రాగానే సమస్య మొదటికి వస్తుంది. దీని కారణంగా గ్రామానికి రైతులకు పట్టాదారులకు ఎన్నో రకాల ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయమై గురువారం నాడు ఎంకే మసీదు పల్లి రైతులు ముప్పిరెడ్డిపల్లి రైతులు మనోహరాబాద్ మండల తాసిల్దార్ కు ఆర్డిఓ జయచంద్రారెడ్డికి కలెక్టర్ రాహుల్ రాజుకి వినతి పత్రం అందజేసి మా పొలాలకు వెళ్లేందుకు దారి ఇవ్వాలని కోరారు.

**టిజిఐసి అధికారులు నిర్లక్ష్యం**

టిజిఐసి అధికారులు అటు పరిశ్రమ యజమానులకు ఇటు రైతులకు ఇబ్బందుల గురిచేస్తూ పట్టించుకోవడంలేదని బాధ్యతారహితంగా వ్యవహరిస్తురని రైతులు అగ్రహారం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని లేదంటే గ్రామం నుండి టీజీఐఐసీ పార్కికు ఇచ్చిన పట్టా ల్యాండుకు అడ్డంగా కందకం తీసి నిరసన వ్యక్తం చేసి పరిశ్రమలకు వెళ్లే దారిని మూసివేస్తామని హెచ్చరిస్తున్నారు.

# కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

- **కొండాపూర్ మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన**
- **బాలుర వసతి గృహము, కేజీబీవీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన**



**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 13 (జనం సాక్షి) :** పదవ తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. గురువారం కొండాపూర్ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, కేజీబీవీ బాలికల పాఠశాల , ఇందిరమ్మ ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులతో మాట్లాడారు. త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధి దారులకు అందించాలన్నారు. కస్తూరిబా బాలికల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. అభ్యాస దీపికలో ఉన్న ముఖ్యమైన ప్రశ్నలను నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చేతిరాతతో రాస్తూ చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. కస్తూరిబా పాఠశాల విద్యార్థులతో చదువు, యోగా, మెడిటేషన్, కృత్రిమ మేధా (ఏఐ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెంట్)పై పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు చక్కగా సమాధానాలు చెప్పడంతో విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కిచన్ షెడ్‌ను, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని వసతి గృహ సంక్షేమ అధికారికి కలెక్టర్ సూచించారు. వసతి గృహంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్టు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు 10వ తరగతి పరీక్షలు సమయం దగ్గర పడుతున్నదని విద్యార్థులు కష్టపడి చదవాలని విద్యాశాఖ తరపున అందజేసిన స్టడీ మెటీరియల్ చదవాలని సూచించారు. చదువుకుంటేనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని కిచెన్ షెడ్డును స్టోర్ రూమ్ ను, డైనింగ్ హాల్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ చలపతి రావు, ఏఈ మాధవ రెడ్డి, కొండాపూర్ ఎంపీడీవో, కొండాపూర్ తహసిల్దార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- **సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ**



**నంగునూరు, మార్చి 13 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి జరిగితే రాష్ట్రం తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నంగునూరు మండలం లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం భూమి పూజ చేశారు. నర్మెటలో రూ.25 లక్షలతో, మగ్దూంపూర్ లో రూ.30 లక్షలు, సిద్దన్నపేటలో రూ.30 లక్షలు, పాలమాకులలో రూ.30 లక్షల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరు అయిన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పెట్టుకుమ్దన్నారు. ముఖ్యమంత్రి అండతో జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖగారి కృషితో సిద్దిపేట నియోజకవర్గంను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే నంగునూరు మండల అభివృద్ధి కోసం నాలుగు కోట్ల ముప్పై లక్షల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అచ్చిన సత్తయ్య, నాయకులు బొమ్మల యాదగిరి, ఎల్లం యాదవ్, డిసిసి మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ, ఎండి.ఇమ్రాన్, కాంగ్రెస్ నాయకులు చిలకల రాజిరెడ్డి, కర్ణ కంటి రవీంద్ర చారి, శేరి సురేందర్ రెడ్డి, బొల్లు సంజీవ్, బంగారి నరసింహులు, ఆదిమూలం మైసయ్య, బాగు శ్రీకాంత్ యాదవ్, అనరాజు నాగరాజు,ఎర్ర మహేందర్ జనార్దన్ రెడ్డి, బొల్లు సంజీవ్, పంగ రాజశేఖర్ రెడ్డి, కుమార స్వామి, ప్రవీణ్, మనోహర్ రెడ్డి, వంశీ, ప్రతాప్, రాకేష్, పవన్, రజని, సన, మోతె కాని అశోక్, రాములు, రంగు అశోక్ గౌడ్, భూపాల్, వరదోలు యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి




**బిజినేపల్లి, మార్చి 13 (జనం సాక్షి) :** మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఐఎన్‌టియుసిటిఎస్, ఏపీ రాష్ట్రాల కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారు పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగాగ్రామపంచాయతీ సిబ్బందితో, ఉపాధి హామీ కూలీలతో, తాపీ మహిళా కార్మికులతో, మహిళలకు మద్దతుగా సంఘీభావం తెలుపుతూ మహిళలను సన్మానించి మాట్లాడారు. ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్న, మహిళలే, సమాజానికి దిక్సూచిలుగా నిలువాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు అన్ని రంగాల్లో ముందున్న మహిళ సోదరీమణులందరికీ మహిళలకు అంతర్జాతీయమహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా రాబోయే రోజుల్లో మహిళలు ఇంటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో మనోధర్యంతో, ముందుండి తన పాత్ర పోషించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, శుభాభివందనాలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, ఐఎన్‌టియుసి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, లక్ష్మణ్ నాయక్, ఐఎన్‌టియుసి తాలూకా ఉపాధ్యక్షులు శ్రీశైలం, మహిళా సోదరిమణులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలి

- **గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటయ్య**



**వీపనగండ్ల, మార్చి 13 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల ఆయా గ్రామాలలో గ్రామపంచాయతీ లలో పని చేస్తున్న కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉండాల్సి వస్తుందని, వెంటనే పెండింగ్ జీతాలను చెల్లించి మా కుటుంబాలను ఆదుకోవాలని లేదంటే ధర్నా చేస్తామని తెలిపారు. తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీవో, శ్రీనివాసరావు, డిప్యూటీ తహసిల్దార్ కృష్ణమూర్తికి వినతిపత్రాలు అందించారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించకపోతే ఈనెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపడతామని మండల పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. పెండింగ్ లో ఉన్న రెండు నుంచి ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించి ఇకనుంచి రెగ్యులర్ వేతనాలు ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు అందించాలని, కార్మికుల వేతనం కోసం ప్రత్యేక గ్రాంట్ ను ఏర్పాటు చేయాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రామపంచాయతీ లో కార్మికులను పెంచాలని అన్నారు. అలాగే ప్రతి ఒక్క వర్కర్ కు 5 లక్షలు ఇన్సూరెన్స్, ప్రమాద బీమా 10 లక్షలు, దహన క్రియలకు 30000 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు కార్మిక చట్టం ప్రకారం ఎనిమిది గంటల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం సెలవు ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి సంవత్సరానికి మూడు జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, వంటనూనె లకు నగదు రూపంలో అలవెన్స్, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసిల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు గోవిందు, శివుడు, ఉపాధ్యక్షుడు రాజబాబు చారి, మహేష్, లక్ష్మయ్య, గంగమ్మ, బాలనాగమ్మ, ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎండా కాలంలో ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- **కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) :** ఎండాకాలంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టర్ విసి హాల్లో వాతావరణం మార్పులు వేసవికాలం ఎండ తీవ్రత వడదెబ్బ తదితర అంశాలపై వివిధ శాఖల అధి కారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎండాకా లంలో ప్రతి ఒక్కరు ప్రయా ణాలలో త్రాగునీరు వెంట తీసుకెళ్లాలన్నారు.ఎండ తగలకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని ఐఎండి సూచనలు పాటించా లన్నారు. ముఖ్యంగా చిన్నా రులు మహిళలు వృద్ధులు గర్భిణీలు ఎండ పట్ల తగు జాగ్రత్త వహించాలన్నారు. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఉపయోగించాలని నిమ్మ రసం మజ్జిగ పండ్ల రసాలు వంటి ఇంట్లో తయారు చేసిన పానీయాలు కొద్దిగా ఉప్పు కలిపి త్రాగాలన్నారు. పుచ్చ కాయ, కర్బూజా, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు కూర గాయలు వంటి అధిక నీటి పరిమాణం గల సీజనల్ పండ్లు కూరగాయలు తినాల న్నారు.సన్నని వదులుగా లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలని తలను కప్పుకోవాలని సూర్య రష్మి తగలకుండా గొడుగు టోపీ టవల్ వాడాలన్నారు.అనారోగ్యంగా భావిస్తే విపరీ తమైన వేడి సమయంలో చల్లని ప్రదేశానికి వెళ్లి ద్రవప దార్థాలు తాగాలి.వడదెబ్బ అనేది మెడికల్ ఎమర్జెన్సీ కావున అయోమయం గందరగోళం ఆందోళన చిరాకు మూర్ఛ లేదా కోమ వంటివి పెద్దలలో కలుగు తాయని, శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల వరకు ఉండి తలనొప్పి ఆందోళన, వికారం, వాంతులు, హృదయ స్పందన పెరగడం వంటివి కలుగుతాయన్నారు. కూలీలు పని ప్రదేశంలో చల్లని త్రాగు నీటిని ఏర్పాటు చేసుకో వాలన్నారు.కార్మికులు నేరు గా సూర్య రష్మికి గురికాకుం డా జాగ్రత్త వహించాలన్నారు. కార్మికులకు కూలీలకు షెడ్డు ఏరియాలో ఏర్పాటు చేయాలన్నారు. మీ ఇంటిని చల్లగా ఉంచండి షెటర్లు లేదా చలువ పందిల్లను ఉపయోగించండి. రాత్రివేళ కిటికీలను తెరవాలి. పగటిపూట దిగువ అంతస్తులలో ఉండడానికి ప్రయ త్నించాలని శరీరాన్ని చల్లబరచటానికి ఫ్యాన్,తడి బట్టలను ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుండి మూడు గంటల వరకు ఎండ లో బయ టకు రాకూడదనీ ఇలాంటి జాగ్రత్తలు వేసవిలో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం దీనికి సంబం ధించిన గోడపత్రికను విడు దల చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ గారిమా నరుల, డి. ఎం. హచ్. ఓ. సౌభాగ్య లక్ష్మి తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హెూలీని సంప్రదాయ పద్ధతుల్లో జరుపుకోవాలి

- **సహజ సిద్ధమైన రంగులు వాడాలి**
- **జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**



**వనపర్తి, మార్చి 13 (జనంసాక్షి) :** జిల్లా ప్రజలు హెూలీ పండగను సంప్రదాయ పద్ధతుల్లో ప్రకృతిలో లభించే, చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించని న్యాచురల్ కలర్స్‌ను వినియోగించి, ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ కోరారు. మద్యం సేవించి, బైకులపై పెద్ద శబ్దాలు చేస్తూ గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెూలీ వేడుకలు ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దని, మహిళల పట్ల మర్యాదగా ఉండాలని ఎస్పీ సూచించారు. రంగుల హెూలీ మీ జీవితాలలో వెలుగులు నింపాలని కోరుకుంటూ జిల్లా ప్రజలకు హెూలీ పండగ శు భాకాంక్షలు తెలిపారు.రంగులు వేసుకోవడానికి వేడుకల్లో పాల్గొనడానికి ఇష్టపడని వ్యక్తులు, ప్రదేశాలు, వాహనాలపై రంగులు లేదా రంగు నీటిని విసరడం కఠినంగా నిషేధించబడిందని, జిల్లా ప్రజలు,యువత మద్యం సేవించి వాహనాలను నడపడం, బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్లు చల్లకూడం వంటివి చేయకూడదన్నారు. బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వ్యక్తులపై చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. హెూలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, పిల్లల కార్యకలాపాలను తరుచూ గమనిస్తూ వారికి సరైన మార్గాలను నిర్దేశించాలన్నారు. యువత వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, రేష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, లాంటివి మానుకోవాలని సూచించారు. హెూలీ పండగ సందర్భంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుండి మద్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే హెూలీ పండుగ జరుపుకోవాలని కోరారు. ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రదేశాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100 ఫోన్ నెంబరుకు డయల్ చేయాలని సూచించారు.

# సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాలపై అవగాహన



గద్వాల్ రూరల్, మార్చి 13 (జనంసాక్షి) : గద్వాల్ మండలము గోనుపాడు గ్రామంలో ఎస్‌పిటి శ్రీనివాసరావు ఆదేశాలతో ఏ ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కళబృందం సభ్యులు డయల్ 100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్,మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు,పోక్సో కేసుల పర్యవసానాలు, సీసీ కెమెరాల ఉపయోగాలుపై అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సమయంలో పోలీస్ సహాయం కొరకు డయల్ 100 కు కాల్ చేయలని దగ్గరలో ఉన్న బ్లూ కొల్ట్స్ సిబ్బంది నిమిషాల వ్యవధిలో వచ్చి తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఆ గ్రామంలో ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్ కు ఎన్ని డయల్ 100 కాల్స్ వచ్చాయి,వాటినీ ఉపయోగించడం ద్వారా పోలీస్ సహాయం ఎలా పొందారో వివరించారు.వాహన దారులు తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని చిన్న చిన్న రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించకపోవడం వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. జాతీయ రహదారికి అప్రోచ్ గా ఉన్న గ్రామాలలో స్పీడ్ బ్రేకర్స్,లైటింగ్,సైన్ బోర్డ్స్ ఎర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు.ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు దగ్గరలో ఉన్న వారు అందించాల్సిన ఫస్ట్ రిస్పాన్స్ చికిత్స గురించి, గ్రామాలలో ఏర్పాటు చేసుకోవాల్సిన విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీల గురించి అవగాహన కల్పించారు,విత్ ఔట్ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్,మైనర్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. నేర చేధనకు, నేర నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడే సిసి కెమెరాలను గ్రామంలో ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్థులు ముందుకు రావాలని గ్రామాల్లో మైనర్ బాలికలను లైంగికంగా,మానసికంగా వేదించకూడదు మైనర్ బాలికలను వేధిస్తే నిందితులపై పోక్సో కేసుల నమోదు చేయడం జరుగుతుందని,నేరం రుజువు అయితే నిందితులకు పడే శిక్షలు కఠినంగా ఉంటాయని కావున ఎవరు కూడా మైనర్ బాలికలను వేదించారాదు అనే విషయాలను గుర్తుంచుకోవాలని అన్నారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 కు సమచారం అందించి ఎన్ సిఆర్ పి( నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్) లో ఫిర్యాదు చెయ్యాలని,సోషల్ మీడియా (ఫేస్ బుక్,ఇన్స్టాగ్రం) ద్వారా అడ్వటేజ్మెంట్ ఇన్వెస్ట్మెంట్ స్కీమ్స్ చూసి సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు రుణ మాఫీ పేరుతో సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్లకు స్పందించవద్దు ఏవైనా తక్కువ రేట్లకు వస్తుయంటే నమ్మి మోసపోవద్దు బ్యాంకుల నుండి ఎలక్ట్రిక్ డిపార్ట్మెంట్ నుండి ఫోన్ చేసి మొబైల్ ఓటిపి అడిగితే చెప్పవద్దు బ్యాంకు వారు ఎప్పుడు ఫోన్ చేసి ఓటిపి వివరాలూ అడగరు అన్నారు.దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు వాటికి అలవాటు పడిన యువత డబ్బు కోసం నేరాల వైపు వెళ్ళి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు గ్రామాలలో ఎవరైనా గంజాయి,ఇతర మాదక ద్రవ్యాలు వాడుతున్న,సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన పోలీస్ వారికి సమచారం అందించాలని అన్నారు.వాటిని వాడటం ద్వారా జరిగే దుష్ఫలితాల గురించి కళ కారులు పాటల రూపంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు రాధమ్మ, రామాంజనేయులు, కృష్ణ,గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన జహీరాబాద్ ఏపీడీ



న్యాల్‌కల్, మార్చి 13 (జనం సాక్షి) : జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) జహీరాబాద్ డివిజన్ ఏపీడి పూజ పలు పనులను పరిశీలించారు. గురువారం మండలంలోని గంగువార్ గ్రామంలో చేపట్టిన, చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. చేపడుతున్న పనులతో రైతులు, కౌలు రైతులు, ప్రజానీకానికి ప్రయోజనం కలిగేలా.. పనులు నాణ్యతగా ఉండేలా దృష్టి సారించాలని స్థానిక అధికారులకు సూచించారు. చేపడుతున్న పనులతో భూగర్భ జలాలు మరింత మెరుగు పడేలా పనులను చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో 60 మంది ఉపాధి కూలీలు తప్పకుండా 100 రోజులు తప్పనిసరిగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్, ఏపీఓ రంగారావు, క్షేత్రస్థాయి అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు హెూళీ పండుగ శుభాకాంక్షలు

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 13 (జనం సాక్షి) : జిల్లా ప్రజలకు కలెక్టర్ క్రాంతి వల్లూరి హెూళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆనందం కలిగేలా, శాంతి, సామరస్యంతో హెూళీ వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. హెూళీ అనేది ప్రేమ, స్నేహానికి, భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. రసాయనిక పదార్థాలు కలిగిన రంగుల బదులుగా సహజమైన, ఆరోగ్యానికి హాని కలిగించని రంగులను ఉపయోగించుకోవాలని సూచించారు.ఎక్కువగా నీటిని వృథా చేయకుండా హెూళీ జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలనీ కోరారు.

# అర్ధరాత్రి గుడిసె దగ్ధం

చిన్నశంకరంపేట, మార్చి 13 (జనం సాక్షి) : మండలంలోని రుద్రారం గ్రామంలో ముత్తిగల బాబుకు చెందిన గుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి ఒక్కసారి మంటలు చెలరేగడంతో బీరువాలోని బట్టలతో సహా పూర్తిగా కాలిపోయాయి ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ లక్ష్మణ్ కోరారు ప్రభుత్వం నుండి ఆదుకొని సహాయం చేయగలరని కోరుచున్నాము.

## క్రీడాకారులకు అండగా నిలుస్తాం





నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) : సమ్మర్ క్రికెట్ టోర్నీ(ఎస్.ఎస్.సీ.టీ.) ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని ఐటీఐ కాలేజ్ మైదానంలో ఈనెల 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు.ఈ క్రికెట్ టోర్నమెంట్ లో 5 జట్లు హెూరాహెూరీగా తలపడగా, అందులో ఎస్.ఆర్.జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.12222 బహుమతిని అందజేశారు. బుధవారం సాయంత్రం పల్ల బురుజు హనుమాన్ దేవాలయ చౌరస్తాలో ఏర్పాటు చేసిన క్రీడాకారులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి భీష్మరాజ్ ఫౌండేషన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి రూ.12222 నగదును భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా రాజ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరిచి నారాయణపేట కీర్తిని దశదిశలా వ్యాపింపజేయాలని పిలుపునిచ్చారు.పేద విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాళ్లను వెలికి తీసేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. నారాయణపేట పట్టణానికి చెందిన కరాటే, కుంగ్ ఫూ తదితర క్రీడాకారులకు ఆర్థిక సహాయం స్వెటర్లను తమ ఫౌండేషన్ ద్వారా అందజేశామని పేర్కొన్నారు.అంతకుముందు టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు రాజ్ కుమార్ రెడ్డిని శాలువలతో ఘనంగా సత్కరించి షీల్డును అందజేశారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పి.ప్రభాకర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, అశోక్ కుమార్, కె.రమేష్, బి.శ్రీనివాస్, ధరణిధర్ దీక్షిత్, ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గద్దం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, హన్మంత్, మన్నె గోపాల్, సుదర్శన్ రెడ్డి, రుద్రారెడ్డి, నర్సింహులు, శివరాజ్, ఎం.సంతోష్, కృష్ణ, నగరి నాగురావు, మేంగ్జీ నందుకుమార్, బసుదే అశోక్ కుమార్, అధిక సంఖ్యలో క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

## పంట పొలాలకు చివరి వరకు నీరు అందిస్తాం

- జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్



గద్వాల్ రూరల్, మార్చి 13 (జనంసాక్షి) : కేటిదొడ్డి మండల పరిధిలోని కొండాపురం,గువ్వలదిన్నె గ్రామాలల్లో వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ వ్యవసాయ అధికారులు.నీటి కొరత కారణంగా వరి పంటలు వాడు పడుతున్నట్టు గ్రహించారు. ర్యాలంపాడు ఎడమ ప్రధాన కాలువ104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, మైలగడ్డ గ్రామాల వద్ద కాలువ ప్రవాహాన్ని,నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి అధికారులతో మాట్లాడి రైతుల అభ్యర్థన మేరకు సాగునీటిని కాలువలకు విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.కాలువల ద్వారా చివరి ప్రాంతాలకు కూడా నీరు అందేలా సమతుల్యతను పాటించాలనీ ఎగువ ప్రాంతాల్లోని రైతులు మోటార్లు,పంప్ సెట్లతో నీటిని వినియోగిస్తున్న పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు.నీటి ప్రవాహం చివరి ఆయకట్టు వరకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు ప్రభుత్వ మద్దతు ఉంటుంది.సాగునీటి సరఫరా పద్ధతులను మెరుగు పరిచేందుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ.ఈ రహీముద్దీన్,వ్యవసాయ అధికారి సక్రియ నాయక్,ఏడీఏ సంగీత లక్ష్మి ,విద్యుత్ శాఖ ఎ.డి. రమేష్ బాబు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నారాయణపేట జిల్లా ప్రతినిధి, మార్చి 13 (జనం సాక్షి) : నారాయణ పేట జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వ పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కలెక్టర్, డీఈ ఓ, ఎంఈఓ, ఆచార్య మాతాజీలుగా వ్యవహరించారు. ఆచార్య మాతాజీలుగా విద్యార్థులు తరగతి గదుల్లో చక్కగా పాఠ్యాంశాలు బోధించి ఆకట్టుకున్నారు. స్వయం పాలన సందర్భంగా ఆ పాఠశాల చెందిన పదో తరగతి విద్యార్థులు ఆచార్య మాతాజీలుగా వ్యవహరించి, పదో తరగతి పాఠ్యాంశాలు బోధించి, విద్యార్థులకు వచ్చిన అనుమానాలు, సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థి విష్ణువహంత్ పదో తరగతి సాంఘిక శాస్త్రంలోని పాఠ్యాంశాన్ని భారత దేశ చిత్ర పటం ప్రదర్శించి మరీ బోధించి అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాడు. చక్కటి బోధనకు గాను విద్యార్థి విష్ణువహంత్ ప్రథమ బహుమతిని పొందారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రబంధ కారిణి బృందం, పాఠశాల ప్రధాన ఆచార్యులు, ఆచార్య మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంప్రదాయ రంగులతో హెూలీ పండుగ జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ





గద్వాల రూరల్, మార్చి 13 (జనంసాక్షి) : హెూలీ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో సంప్రదాయ రంగులను ఉపయోగించి ఎదుటివారికి ఇబ్బంది కలుగకుండా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. ప్రజల శాంతి భద్రతలను పరిరక్షించేందుకు జిల్లా ఎస్పీ కొన్ని సూచనలతో హెూలీ పండుగను సురక్షితంగా జరుపుకునేందుకు ఒక ప్రకటన విడుదల చేశారు.ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు హెూలీ పండుగ జరుపుకోవాలి.ఇష్టపడని వ్యక్తులు,ప్రదేశాలు, వాహనాలపై రంగులు రంగు నీటిని వేయటం కఠినంగా నిషేధించబడింది. ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దు నీటి బెలూన్లు,గాజు పొడి కలిపిన రంగులు వాడరాదు.ఎవరైనా తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం,శారీరక,మానసిక వేధింపులకు గురిచేయడం తీవ్రంగా నేరంగా పరిగణించబడుతుంది.పబ్లిక్ రోడ్లు,బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం,మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధం.మద్యం సేవించి వాహనం నడపకండి మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం చట్టవిరుద్ధం. ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలను సమూహాలుగా తరలించడం,వీధుల్లో అవాంఛిత రీతిలో తిరగడం అనుమతించబడదు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్లకు కాల్ చేయండి ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించండి.శాంతిభద్రతలకు భంగం కలిగించే, ప్రజలకు అసౌకర్యం లేదా ప్రమాదం కలిగించే ఏ చర్యైనా కఠినంగా ఎదుర్కొనబడుతుంది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు తెలిపారు.

## అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

- పెద్దసంఖ్యలో హాజరైన భక్తజనం





ఉప్పునుంతల, మార్చి 13 (జనం సాక్షి) : కన్నుల పండుగగా శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం చోళులనాటి కాలంలో పురాతన ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహెూత్సవాన్ని అంగరంగ వైభవంగా వేద పండితులు వరదరాజులు అయ్యగారు,సభ్యుల మంత్రోచ్ఛారణతో కన్నుల పండుగగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయ చైర్మన్ వేముల నరసింహారావు నివేదిత దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో అంగరంగ వైభవంగా కళ్యాణ మహెూత్సవాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. కళ్యాణ మహెూత్సవానికి కల్వకుర్తి, నాగర్ కర్నూల్, అచ్చంపేట నియోజకవర్గాల నుండి ఆయా మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహెూత్సవాన్ని విజయవంతం చేశారు. కళ్యాణమనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నర్సింహులు, పాలకవర్గ సభ్యులు చలమల గణేష్ గౌడ్, ఎలుక స్వరూప, తన్నోజు ప్రదీప్ ప్రసాద్, బుధగం శ్రీనివాస్ గౌడ్, చవ్వ కృష్ణయ్య కళ్యాణ మహెూత్సవానికి సహకరించిన గ్రామ పెద్దలు మోహన్ గౌడ్ బలరావ్, సుదర్శన్, పానం సైదులు,వెంకటేష్ మండల నాయకులు కట్ట అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి అనంత ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీపీ తిపర్తి అరుణనర్సింహారెడ్డి,రఘుపతి రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

- మన సమాజం ఫౌండేషన్ అధ్యక్షులు మహేష్ స్వామి



సదశివపేట, మార్చి 13 (జనం సాక్షి) : విద్యార్థులకు పరీక్ష సామాగ్రి మన సమాజం ఆధ్వర్యంలో అందజేశారు. గురువారం సదాశివపేట మండలం ఆరూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేసినట్టు సమాజం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జంగం మహేష్ స్వామి అన్నారు. ఈ సందర్భంగా మహేష్ స్వామి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో 10వ తరగతి కీలకం కనుక అత్యధిక మార్కులతో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు , ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష సాధనకై నిరంతరము కృషి చేయాలని ఆయన అన్నారు. నిజ జీవితంలో విద్యార్థి విజయం సాధించాలంటే వాడు నిత్య విద్యార్థి అయి ఉండాలి అని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం సమక్షంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు అందజేసి విజయవంతంగా పరీక్షలు రాయాలని అభినందనలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ సమాజంలో ఉన్నటువంటి వారందరూ విద్యార్థులను ఇలా ప్రోత్సహించడం వల్ల విద్యార్థుల్లో చదువుపై శ్రద్ధ వహించి మంచి మార్గంలో పోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ జాయింట్ సెక్రెటరీ రవికుమార్ గౌడ్, మన సమాజం ఫౌండేషన్ నిర్వాహకులు మడివాలయ స్వామి, విజయ్ స్వామి, నాగభూషణం, యాదగిరి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

వీపనగండ్ల, మార్చి 13 (జనం సాక్షి) : వనపర్తి జిల్లా కేంద్రం నుండి వీపనగండ్ల మండల కేంద్రానికి ప్రజల అవసరాల రవాణా సౌకర్యార్థం ఆర్టిసి బస్సులు కేటాయించినందుకు తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు మండల కేంద్రం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రం ఏర్పాటు అయినప్పటినుండి చందాపురం రాయినపల్లి మాందాపురం, బుసిరెడ్డిపల్లి పుల్గర్ చర్ల, కల్వరాల మీదుగా మండల కేంద్రానికి రవాణా సౌకర్యం లేదని కానీ మంత్రి చొరవ తీసుకొని రవాణా సౌకర్యం ఏర్పాటు చేయడం అభినందనీయమని వారన్నారు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్, గ్రామ అధ్యక్షుడు నక్క విష్ణు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడు బసవరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు ఎస్.రవీందర్ రెడ్డి,ఎత్తం కృష్ణయ్య, గోపి,కావలి మహేష్, వైయస్ వెంకటయ్య, రాజు తదితరులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్





నారాయణపేట జిల్లా బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) : నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ లో నారాయ ణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ, కోస్గి రోడ్డు విస్తరణ పనులపై కలెక్టర్ రెవెన్యూ, నీటి పారు దల శాఖ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని మక్తల్, నారాయణ పేట నియోజక వర్గాలలో భూసే కరణ ప్రక్రియను అధికారులు సమన్వయంతో చేపట్టాల న్నారు.భూసేకరణ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆమె అడిగారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలాం స్పందిస్తూ జిల్లాలోని మక్తల్, నారాయణ పేట నియోజక వర్గాల పరిధిలో మొత్తం 21 గ్రామాలలో 556 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉందని, ఇప్పటి వరకు 16 గ్రామాలలో భూసేకరణ గాను ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. అయితే ఆ 16 గ్రామాలకు సంబంధించి మొత్తం 379.07 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. మిగతా 5 గ్రామాలలో భూసే కరణ ప్రాసెస్‌లో ఉందని ఆర్డీవో రాంచందర్ నాయక్ తెలిపారు. అంతకుముందు కోస్గి రోడ్డు విస్తరణ పనులు ఎంతవరకు వచ్చాయని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా కోస్గి పట్ట ణంలో మొత్తం 228 వ్యాపార, నివాసగృహాలు విస్తరణ లో పోతున్నాయని, వాటిలో 139 సొంత స్థలాలు, 89 ఖాళీ స్థలాలు ఉన్నట్లు మున్సి పల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. వీరిలో కొంతమం ది కోర్టును ఆశ్రయించారని చెప్పారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోస్గి రోడ్డు విస్తరణ పనులను ఎలాంటి వివాదాలు లేకుండా అర్హతను బట్టి నష్ట పరిహారం చెల్లించి ముందుకు వెళ్లాలని అవసరమైతే న్యాయ నిపు ణుల సలహాలు తీసుకోవా లని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, ఆర్డీవో రామచందర్ నాయక్, ఆర్ అండ్ బి డీ ఈ రాములు, పిఆర్ ఈ ఈ హీర్యా నాయక్, ఇరిగేషన్ ఈ ఈలు ఉదయ్ శంకర్, బ్రహ్మానందం, డిఈఈలు సతీష్, సురేష్, కోస్గి తహ సిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, భూసేకరణ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన పారమిత విద్యార్థుల వీడ్కోలు సంబరాలు






**కరీంనగర్ బ్యూరో, మార్చి 13 (జనంసాక్షి) :**

స్థానికనగరంలోని మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల విగమ (వీడ్కోలు) అనే పేరు తో సంబరాలు ఆనందంగా అట్టహాసంగా నిర్వహించారు. ఇట్టి వేడుకలను పారమిత విద్యా సంస్థల డైరెక్టర్స్ అనుకర్ రావు, వినోద రావు జ్యోతి ప్రజ్వలన చేసి వీడ్కోలు కార్యక్రమన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిది గా విచేసిన పారమిత విద్యా సంస్థ అధినేత ఇ.ప్రసాద్ రావు ప్రసంగిస్తూ... పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో ఏ విధంగా సమాజంలో ప్రత్యేక స్థానం ఏర్పరుచుకోవాలో తెలిపారు. సుమారు పదకొండు సంవత్సరాలుగా పారమిత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు ఇక ముందు మెదిలే తీరులో పారమిత పాఠశాల క్రమశిక్షణ ప్రతిబింబించాలని తెలియజేశారు.

విద్యార్థులు వారి పాఠశాల విద్యను పారమిత విద్యాసంస్థలో అభ్యసించి ఉన్నత విద్యాభ్యాస నిమిత్తము పాఠశాలను వదిలి వెళ్తున్నందుకు

వారి జ్ఞాపకాల మధురానుభవాలను నెమరు వేసుకుంటూ ఒకింత బాధ పడ్డారు, అత్యుత్తమ ప్రతిభ గల ఉపాధ్యాయ బృందం బోధనతో విషయ

పరిజ్ఞానం, నైతిక విలువలు అలవర్చుకొని వారిని ఆదర్శంగా తీసుకుంటూ జీవితంలో మరో అడుగు ముందుకు వేసి, రాబోయే బోర్డు పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యాసంస్థకు, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. వీడ్కోలు కార్యక్రమం ఆధ్యంతము ఆనందభరితంగా ఉల్లాసంగా కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్సులు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పారమిత విధ్యాసంస్థల ఛైర్మన్ డా.ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, రశ్మిత, రాకేష్, అనుకర్ రావు , టి యస్వి.రమణ, వినోదరావు, వి.యు.యం ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత , శ్రీకర్, శర్మిష్ఠ, ప్రోగ్రాం హెడ్ గోపి కృష్ణ,కోఆర్డినేటర్ శ్రీనాథ్ సమన్వయకర్తలు , ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

# హెచ్‌సీయూ భూములను వేలం వేస్తే ఊరుకునేది లేదు

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి)**



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. యూనివ ర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంపై యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గురువారం యూనివర్సిటీ విద్యా ర్థులు పెద్ద ఎత్తున వర్సిటీ మెయిన్ గేట్ వద్దకు చేరుకొని ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భూములు అమ్మితే తప్ప ప్రభుత్వాన్ని నడపలేని పరిస్థితి నెలకొంది అని ఎద్దేవా చేశారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని ఒక స్పోర్ట్స్ అకాడమీకి ఎకరానికి 50 వేల చొప్పున కేటాయించింది. కానీ ఈ భూమిలో అకాడమీ కార్యకలాపాలు కొనసాగించలేకపోవడంతో తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ఈ భూమిని టీజీఐఐసీ ద్వారా వేలం వేసి ప్రభుత్వ ఖజానా నింపేందుకు సిద్ధమైంది. ఈ నెల 15వ తేదీ వరకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు టీజీఐఐసీ ప్రకటించింది. ప్రస్తుతం హెచ్‌సీయూ భూముల వేలం మరోసారి తెరపైకి రావడంతో వర్సిటీ విద్యార్థులు ఆందోళనలు చేపట్టారు. భూములు వేలం వేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నాలుగు వందల ఎకరాల భూమిలో వేలాది చెట్లు, పక్షులు, వివిధ జాతుల జంతువులు, వందల సంవత్సరాల నాటి శిలలు(రాక్స్) ఉన్నాయని వీటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విద్యార్థులు స్పష్టం చేశారు. ప్రభుత్వం హెచ్ సి యు భూముల వేలాన్ని నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# త్రిబుల్ ఆర్ వరకు హైదరాబాద్ విస్తరణ

**హెచ్ఎండిఏ పరిధిలోకి మర్రిగూడ మండలం**

**భారీగా పెరగనున్న భూముల ధరలు**

**మర్రిగూడ, మార్చ్13 (జనంసాక్షి) :**




హెచ్ఎండిఏ పరిధిలోకి మర్రిగూడ మండలం, త్రిబుల్ ఆర్ వరకు హైదరాబాద్ ను విస్తరిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంది, మర్రిగూడ మండలంలోని బట్లపల్లి, దామర భీమనపల్లి, ఇందుర్తి, కె.బిపల్లి, కొండూర్, లెంకలపల్లి, మర్రిగూడ, మేటిచందా పురం, సరంపేట, తమ్మడపల్లి, తిరుగండ్లపల్లి ,యరగండ్లపల్లి రెవిన్యూ గ్రామాలను హెచ్ఎండిఏ పరిధిలోకి తీసుకుంటూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది, మర్రిగూడ మండలానికి మహర్దశ పట్టనుంది, మండలంలో భూములకు భారీగా ధరలు పెరగనున్నట్లు తెలుస్తుంది, భారీగా పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా

# పేద పిల్లలకు అధునాతన గుండె చికిత్సలే లక్ష్యం

**అపోలో మెడికల్ కాలేజ్, రాష్ట్రీయ బాల్ ఆరోగ్య కార్యక్రమ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ప్రారంభం**

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి)**



అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్స్ (ఏఐఎంఎస్ఆర్), హైదరాబాద్, రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమ (ఆర్ బీఎస్ కె), హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో అపోలో మెడికల్ కాలేజ్ హాస్పిటల్, జూబ్లీ హిల్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత పిల్లల గుండె వ్యాధుల వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ఈ శిబిరంలో గుండె సంబంధిత సమస్యలతో ఉన్న పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్స్ ఉచితంగా ఈ శిబిరాన్ని నిర్వహించడం ప్రశంసనీయం అన్నారు. రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యాక్రమ్ పిల్లలలో పుట్టుకతో వచ్చే వైకల్యాలకు తగిన చికిత్స అందించే లక్ష్యంతో పని చేస్తుంద`న్నారు. ఈ పిల్లల్లో చాలా మంది సామాన్య కుటుంబాలకు చెందిన వారన్నారు. ఖరీదైన చికిత్స వారికి కష్టం అన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు అపోలో ఈ సేవలను అందిస్తుండటం అభినందనీయం అన్నారు. ఈ శిబిరంలో స్క్రీనింగ్ నిర్వహి స్తున్నార న్నారు. అవసరమైన వారికి సహాయం చేస్తున్నారని చెప్పారు. ఇటువంటి చర్యలు పిల్లల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతాయ న్నారు. తమవంతుగా సమాజానికి తిరిగి ఇవ్వడంలోనూ పిల్లలకు కొత్త జీవితాన్ని ఇవ్వడంలోనూ ఇతర కార్పొరేట్ హాస్పిటల్‌కు ఇది ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపర్ణా రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి వైద్యం అందరికీ చేరువ చేయడం అపోలో లక్ష్యమ న్నారు. ఈ కార్యక్రమమే అందుకు నిదర్శన మన్నారు. ఇందులో పేదలు, అనాథలు, అణగారిన వర్గాల పిల్లలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. మా శిశు హృద్రోగ చికిత్స విజయశాతం ప్రపంచంలో అత్యుత్తమ స్థాయిలో ఉందన్నారు. స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత రెండు సంవత్సరాల్లో 800 పైగా పిల్లలకు చికిత్స అందించామని తెలిపారు. దీనిని కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వంతో భాగస్వామ్యానికి, కలిసి పని చేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అపోలో ఇన్‌స ్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ హాస్పిటల్ డీన్ డాక్టర్ కే మనోహర్ మాట్లాడుతూ సుమారు 200 మంది పిల్లలకు ఉచితంగా స్క్రీనింగ్ నిర్వహిస్తు న్నామని చెప్పారు. పుట్టుకతో ఉన్న గుండె సమస్యలు గుర్తించినట్లయితే, వారికి ఉచితంగా చికిత్స అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు 800 పైగా శస్త్రచికిత్సలు చేశామన్నారు. 99.5 శాతం విజయం సాధించామన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ శిబిరం ద్వారా పిల్లలలో ఉన్న, అభివృద్ధి చెందిన గుండె వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం, తగిన చికిత్స అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రధానంగా కార్డియాక్ నిపుణుల సేవలు అందుకునే అవకాశం లేని పేద పిల్లలకు అధునాతన వైద్య సహాయం అందించను న్నామని తెలిపారు. తద్వారా వారిలో గుండె సంబంధిత సమస్యలను తొందరగా గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం లక్ష్యమన్నారు. సంక్లిష్టంగా ఉన్న గుండె లోపాలు, అభివృద్ధి చెందిన గుండె వ్యాధులు, ఇతర తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. అపోలో హాస్పిటల్‌లోని నిపుణులైన పీడియా ట్రిక్ కార్డియాలజిస్టులు, కార్డియాక్తోరాసిక్ శస్త్రచికిత్స నిపుణులు, అనేక క్లిష్టమైన చికిత్సలు, ప్రాణాలను రక్షించే శస్త్రచికిత్స లను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. ఎంతో మంది చిన్నారులకు కొత్త జీవితాలను ప్రసాదించా రన్నారు. ప్రతి శిబిరంలో పిల్లలకు గుండె వైద్య సేవలు అందిస్తూ, సమాజంలోని చిన్నారుల ఆరోగ్యా న్ని మెరుగుపరిచే బాధ్యతను నెరవేరు స్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ జీ ముకుంద రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటి,

అదనపు మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ అబ్దుల్ వాసే, కన్సల్టెంట్ పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ అమోల్ గుప్తా, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ ఉమా మహేశ్వరి, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కే సాంబమూర్తి, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డి యోథొరాసిక్ సర్జన్, కార్డియాక్ అనస్తీషియా, క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్ స్వైన్, చీఫ్ పీడియాట్రిక్ కార్డియాక్ అనస్తీటిస్ట్, ఇంటెన్సి విస్ట్ డాక్టర్ మీనా టేహ్రాన్, చీఫ్ పీడియాట్రిక్

కార్డియాక్ అనస్తీటిస్ట్, ఇంటెన్సివిస్ట్, పిల్లల అనస్తీషియా నిపుణులు డాక్టర్ ఆర్ అపర్ణ, పిల్లల అనస్తీషియా నిపుణులు డాక్టర్ డీ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# కారు బోల్తాపడి అక్కచెల్లెలు మృతి




**ఖానాపురం మార్చి 13 (జనంసాక్షి)**

రోడ్డు ప్రమాదంలో కారు బోల్తా పడి అక్క, చెల్లెలు మృతి చెందిన సంఘటన ఖానాపురం మండల కేంద్రం శివారులోని పెట్రోల్ పంపు సమీపంలో గురువారం జరిగింది. ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్‌కు చెందిన ఏసిరెడ్డి యశోద (80), బోలుగొడ్డు మాణిక్యమ్మ (78) మరో ముగ్గురు తమ కుటుంబ సభ్యులతో కలిసి కారులో మహబూబాబాద్ జిల్లా కొరివిలో తమ సమీప బంధువు దశదినకర్మ వేడుకలకు హాజరయ్యారు కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి ఖిలా వరంగలు? వెళు తుండగా ఖానాపురం శివారు పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే కారు వెనుక టైరు పేలి అదుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏసిరెడ్డి యశోద, బోలుగొడ్డు మాణిక్యమ్మ తీవ్రంగా గాయపడ్డారు. రమేష్ ,హరీష్ అనితలకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో నర్సంపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అప్పటికే యశోద, మాణిక్యమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒకే కుటుంబానికి చెందిన అక్క, చెల్లెలు ఇద్దరు ఒకేసారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

# లా కళాశాల విద్యార్థులను అభినందించిన ఉన్నతాధికారులు




**హైదరాబాద్ (జనంసాక్షి)**

ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీలో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల విద్యార్థులను వర్సిటీ ఉన్నతాధికారులు గురువారం అభినందించారు. సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, బ్యూరో పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా నూతన నేర చట్టాలపై వీడియో రూపొందించే అంతర్ కళాశాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఓయూ లా కలాశాల విద్యార్థులు ఏడు బహుమతులు సాధించారు. దానితోపాటు ఉత్తమ కళాశాల అవార్డును ఓయూ లా కళాశాల సాధించింది. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి, ఓ ఎస్ డి ప్రొఫెసర్ జితేందర్ నాయక్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

# “గాంధీ”లో ఆరో అంతస్తులో ఆగిన లిఫ్టు

**హైదరాబాద్ (జనంసాక్షి)**



హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో ఘోరం జరిగింది. గురువారం మధ్యాహ్నం ఆస్పత్రిలోని ఆరో అంతస్తులో లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో లిఫ్టులో ఉన్న 15 మంది రోగులు, వారి అటెండర్లు తీవ్ర భయాందోళనకు గురై గట్టిగా కేకలు వేశారు. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది అక్కడికి చేరుకుని.. లిఫ్ట్‌ను తెరిచేందుకు ప్రయత్నించారు. లిఫ్ట్ వైర్లను సరిచేయడంతో అది ఐదో అంతస్తులో వచ్చి ఆగింది. అనంతరం లిఫ్ట్ డోర్ తెరిచి రోగులను, అటెండర్లను బయటకు తీసుకొచ్చారు. 15 మంది సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. 30 నిమిషాల పాటు లిఫ్టులో ఉండిపోయే సరికి కొందరికి ఊపిరాడలేదు. ఈ సంఘటనపై అధికారులను వివరణ కోరగా పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో వెళ్లడం వల్ల లిఫ్టు ఆగిందని, వెంటనే తమ సిబ్బంది అక్కడ చేరుకొని డోర్ ఓపెన్ చేయడం జరిగిందని అన్నారు. డాక్టర్లు, సిబ్బంది వెళ్లే లిఫ్ట్‌లో ఆపరేటర్లు ఉన్నారని, రోగులు, సాధారణ ప్రజలను తరలించే లిఫ్ట్‌లలో ఆపరేటర్‌లను ఎందుకు నియమించలేదని రోగి సహాయకులు ప్రశ్నించారు.

# ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు ఆస్ట్రేలియా పేటెంట్

**కంటి కార్నియా చికిత్సకు కొత్త స్టెమ్ సెల్ థెరపీ**

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి)**



ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కు ఆస్ట్రేలియా పేటెంట్ లభించింది. ఇది కార్నియా వ్యాధుల చికిత్సకు ఉపయోగపడే విప్లవాత్మకమైన సెల్ థెరపీ. ఈ ప్రత్యేకమైన 'సెల్ కాంపోజిషన్' ఆధారిత చికిత్స ఆప్తల్మాలజీ, సెల్-బేస్డ్ థెరపీ రంగంలో గొప్ప మైలురాయిగా చెప్పవచ్చు. ఈ పేటెంట్ లింబల్ ఎపిథీలియల్, స్ట్రోమల్ సెల్స్ సమ్మిళితంగా రూపొందించిన కొత్త థెరపీకి మంజూరైంది. ఇది కార్నియా వ్యాధుల చికిత్స, నివారణకు ఉపయోగ పడుతుంది. ఈ థెరపీ తయారీ పద్ధతులు, చికిత్సా ప్రయోజనాలకు కూడా పేటెంట్ లభించింది. ఇప్పటికే భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం ఈ థెరపీకి పేటెంట్స్ యాక్ట్, 1970 ప్రకారం ఇరవై సంవత్సరాల కాలపరిమితి కలిగిన పేటెంట్ మంజూరు చేసింది. ప్రస్తుతం భారత ప్రభుత్వ అనుమతితో క్లినికల్ ట్రయల్స్ జరుగుతు న్నాయి. మరింత పరిశోధన పూర్తయ్యాక మాత్రమే ఇది రోగులకు అందుబాటులోకి వస్తుంది. ఈ పేటెంట్ ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కు చెందిన డాక్టర్ సయన్ బసు, డాక్టర్ వివేక్ సింగ్ లకు మంజూరైంది. డాక్టర్ సయన్ బసు కార్నియల్ సర్జన్, క్లినీషియన్-సైంటిస్ట్. ఆయన బ్రయన్ హోల్డన్ ఐ రీసర్చ్ సెంటర్ (బీహెచ్ఈఆర్సీ)లో ప్రొఫెసర్ డీ బాలసుబ్ర మణియన్ చైర్ ఆఫ్ ఐ రీసెర్చ్ హోదాలో పని చేస్తున్నారు. సెంటర్ ఫర్ అకులర్ రీజనరేషన్ (సీఓఆర్ఈ), ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ గా ఉన్నారు. డాక్టర్ వివేక్ సింగ్.. సుధాకర్, శ్రీకాంత్ రవి స్టెమ్ సెల్ బయాలజీ ల్యాబొరేటరీ, సీఓఆర్ఈ, ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ కు చెందిన శాస్త్రవేత్త.

# భగత్ సింగ్ స్పూర్తితో యువత దేశ అభివృద్దిలో భాగస్వాములు కావాలి

**తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి)**



మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, భగత్ సింగ్ స్పూర్తితో యువత దేశ అభివృద్దిలో భాగస్వాములు కావాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్ దేవ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఉస్మానియా విశ్వవిద్యాల యంలోని క్రికెట్ గ్రౌండ్లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ ప్రీమియర్ లీగ్ కు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఐదు రోజుల పాటు జరగనున్న పోటీలకు, మొదటి రోజు పోటీలలో పాల్గొన్న క్రీడాకారు లకు కరచాలనం చేసి అభినందించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ క్రీడలు నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ బృందాన్ని వారు అభినందించారు. క్రీడలు శరీర ఎదుగుదలకు,మానసిక స్థైర్య పెంపుదలకు ఉపయోగపడుతుందని వారు అన్నారు. భగత్ సింగ్ కు మన దేశం ఏమి చేసిందని ఆలోచించకుండా.. దేశానికి భగత్ సింగ్ చేసిన నిస్వార్ధ సేవలను గుర్తించాలని, తద్వారా భగత్ సింగ్ అడుగుజాడల్లో నేటి యువత నడిస్తే సామాజిక స్పృహ అలవర్చుకోవచ్చని వారు ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగాన్ని అభివృద్ధి పర్చడానికి కృషి చేస్తుందని వారు అన్నారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆ వ్యాసనాల వల్ల మానసిక ఒత్తిడి తెచ్చి కుటుంబాలకు, సమాజానికి దూరం అయ్యే పరిస్థితి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కె. ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కార్యవర్గ సభ్యులు మాజీద్, కళ్యాణ్, అనిల్, హేమంత్, బాలు, విజయ్, సీపీఐ హైదరాబాద్ జిల్లా నేత చెట్టుకింద శ్రీనివాస్ తో పాటు 10జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
14 మార్చి 2025

# నందనవనం పార్కు బీఆర్ఎస్ హాయంలోనే కబ్జా

- కేసులకు భయపడకుండా పార్కును కాపాడింది కాంగ్రెస్ పార్టీనే
- కబ్జాదారులకు కళ్లేం వేసేది ప్రజా ప్రభుత్వమే
- కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



**జవహర్‌నగర్, మార్చి 13 (జనంసాక్షి) :** నందనవనం పార్కు బీఆర్ఎస్ హాయంలోనే కబ్జాకు గురైతే కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్లాడి కేసులకు భయపడకుండా కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని, మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రోద్బలంతోనే బీఆర్ఎస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని, ఇంత జరుగుతున్న ఎమ్మెల్యే కిమ్మనకుండా ఉండటంలో ఆంతర్యమేమిటని దుయ్యబట్టారు. జవహర్ నగర్ కార్పొరేషన్ లోనిఆనంద్ నగర్ కాలనీలోని నందనవనం పార్కుకబ్జా చేసేందుకు 30మంది బౌన్సర్లతో కబ్జాదారులు రావడంతో గమనించిన స్థానిక మహిళలు ఆడ్డుకోబోగా వారిపై దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీ కాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నందనవనం పార్కులో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ నందనవనం పార్కును కబ్జా చేద్దామని బౌన్సర్లు రావడంతో ప్రాణాలకు తెగించి మహిళలు అడ్డుకోబోగా వారిపై దాడి చేయడం దుర్మార్గమని, దాడికి గురైన ఆడ బిడ్డలను జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య పరామర్శించకపోవడ శోచనీయమని అన్నారు. నందనవనం పార్కు కబ్జాకు గురికాకుండా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆనంద నగర్ కాలనీవాసులు అధైర్య పడద్దని మనోధైర్యం కల్పించారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కబ్జాలకు పాల్పడుతుంటే బి ఆర్ఎస్ పెద్దలు ఏమి చేస్తున్నారని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి తమ నిజాయితీని నిరూపించుకోవాలని తెలిపారు. నాలుగు ఏళ్లుగా నందనవనం పార్కులో ఆనంద నగర్ కాలనీవాసులు సేద తీరుతుంటే కబ్జా చేద్దామని బౌన్సర్లతో ప్రభుత్వ ప్రాపర్టీలను ధ్వంసం చేయడమే ఉంటది అని ప్రశ్నించారు. మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ సహకారంతో పార్కును కబ్జాకు గురికాకుండా కాపాడుతామని ఇప్పటికే కాంగ్రెస్ అధినాయకత్వానికి విన్నవించామని తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్ కుమార్ మెట్టు యాదవ్ ప్రభాకర్ కాలనీవాసులు పుష్పలత ఐరమ్మ లతా జయ రత్న బాలమణి శ్వేత భవాని సరిత మౌనిక రవీందర్ రెడ్డి సందీప్ రాంబాబు దేవేందర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వ పథకాలు

- శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్చార్జి వాలిదాసు




**శేరిలింగంపల్లి, మార్చి 13 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్ ప్రాంతానికి చెందిన ఎల్. వనిత అనే లబ్ధిదారురాలికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని గురువారం జగదీశ్వర్ గౌడ్ అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో నిజమైన ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైనమిక్ లీడర్ గా రాష్ట్ర ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని, ఇందుకోసం ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే నిదర్శనం అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రస్తుత పాలనలో ఓట్లేసి గెలిపించిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సిఎంఆర్ఎఫ్ ఎల్ఓసి ద్వారా లక్షా 50 వేల రూపాయలు మంజూరైన దరిమిలా వనితకు సదరు చెక్కును అందజేయడం ఆనందాన్ని కలిగిస్తుందని జగదీశ్వర్ గౌడ్ వివరించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను గుర్తుచేస్తూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే ప్రాధాన్యతక్రమంలో అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ విధివిధానాలు తెలిసిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు తమను ప్రజా ప్రతినిధులుగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆశీర్వదించాలని, వారి రుణం తీర్చుకునే భాగ్యం మాకు దేవుడు కలిగించినందుకు రాష్ట్ర ప్రజలకు, దేవుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం సైతం పెద్ద ఎత్తున కృషిచేస్తూ ప్రత్యేక నిధులను విడుదల చేస్తుందని నియోజకవర్గ ఇంచార్జి వాలిదాసు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ డివిజన్ నాయకులు రాఘవులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మద్యం షాపులో మర్డర్

- పోలీస్ స్టేషన్‌కు కూసంత దూరంలోనే..
- షాబాద్ పోలీసులకు సవాల్‌గా వైన్స్ దొంగతనాలు



**షాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** షాబాద్ మండల కేంద్రం పోలీస్ స్టేషన్ కు కూసంత దూరంలోనే శ్రీ దుర్గా వైన్స్ షాపులో వ్యక్తి దారుణ హత్య బుధవారం షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అర్ధరాత్రి సమయాలలో వైన్ షాపులే టార్గెట్ చేసుకొని దొంగతనాలు నిర్వహిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు. షాబాద్ ఇన్స్పెక్టర్ కాంతా రెడ్డి తెలిపిన సమాచారం మేరకు షాబాద్ శ్రీ దుర్గా వైన్స్ బుధవారం రాత్రి యధావిధిగా షాపు మూసివేసి అక్కడే వాచ్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న చేగురి బిక్షపతి (35) అర్ధరాత్రి సమయంలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వైన్స్ వెనకాల గోడకు రంధ్రం చేసుకుని వైన్స్‌లోకి చొరబడి విధులు నిర్వహిస్తున్న చేగురి బిక్షపతినీ హత్య చేశారు. 20వేల రూపాయల నగదు, మద్యం బాటిల్లను, సీసీ కెమెరా డివిఆర్ కనబడుట లేదని ఉదయాన్నే షాపును తెరిచిన నిర్వాహకులు షాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. మార్చి నాల్గవ తారీకు నాడు మండల పరిధిలోని నగార గూడెం వైన్స్ లో ఇదే తరహా దొంగతనం జరిగిన తొమ్మిది రోజులవ్యదిలో షాబాద్ వైన్ షాపులో జరగడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. షాబాద్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి క్లూ టీమ్స్, డాగ్ స్క్వాయిడ్ తో దర్యాప్తు నిర్వహిస్తూ ఆధారాలు సేకరిస్తున్నారు. ఎస్ఓసి కృష్ణ, ఏసీపి చేవెళ్ల, ఏసీపి సిసిఎస్ శశాంక్, ఎస్ఓటి ఇన్స్పెక్టర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్, బృందాలుగా విడిపోయి దర్యాప్తు నిర్వహిస్తున్నామని తొందరలోనే దోషులను కనిబెడతామని తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# మహిళల పట్ల మర్యాదగా ఉండాలి

- సంప్రదాయ పద్ధతుల్లో హెూలీ జరుపుకుందాం
- పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝూ



**ప్రత్యేక ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి) :** ఎదుటివారికి ఇబ్బంది కలిగించకుండ , మహిళల పట్ల మర్యాదగా ఉంటూ సంప్రదాయ పద్ధతుల్లో హెూలి జరుపుకుందామని రామగు ండము పోలీస్ కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు. హెూలీ పండుగ సందర్భంగా రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిశోరే ఝూ ప్రజలకు ప్రజలకు పలు సూచనలు చేస్తూ సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తూ హెూలీ పండుగను ప్రశాంతవంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హెూలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళవద్దని, ప్రధానముగా బహిరంగ ప్రదేశాలపై, అనుమతి లేకుండా వ్యక్తులపై, మహిళలు, యువతులు, వాహనాలపై రంగులు చల్లడం బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తప్పవని. హెూలీ పండుగను సజావుగా జరుపుకొనేందుకు రామగుండం పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించబడుతుందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఆస్తి కోసం కన్నతల్లిని దారుణంగా హత్య చేసిన తనయుడు

- పోలీసుల అదుపులో నిందితుడు





**శంషాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** ఆస్తికోసం కన్నతల్లిని దారుణంగా హత్య చేసిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాళ్లగూడ రాఘవేంద్ర కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఆర్జిఐ ఇన్స్పెక్టర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం, శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడ రాఘవేందర్ కాలనీలో రాచ మల్ల చంద్రకళ ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటుంది. పెద్ద కొడుకు ప్రకాష్ (35), మద్యానికి బానిసై తల్లి చంద్రకళని (55) డబ్బుల కోసం నిత్యం వేధిస్తుంటాడు. ప్రకాష్ గత కొంతకాలంగా పని పాట చేయకుండా ఖాళీగా తిరుగుతు తల్లి వద్ద అందిన కాడికి డబ్బులు దండుకుంటూ మద్యం మత్తులో తిరుగుతుంటాడు. పలుదపాలుగా చిన్న చిన్న గొడవల కారణంగా పోలీస్ స్టేషన్కు పలుసార్లు వచ్చారు కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్టు తెలుస్తుంది. బుధవారం రాత్రి 10 గంటలకు రాచమల్ల ప్రకాష్ తన తల్లి చంద్రకళ (55)తో మద్యం మత్తులో నివాసముంటున్న ఇంటిని తన పేరుపై రాయాలంటూ గొడవపడుతు మాట మాట పెరగడంతో తన కొడుకు ప్రకాష్ కర్ర, సిలిండర్‌తో దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాలతో రక్తప్రసరణతో కొట్టుమిట్టాడుతుంది. చిన్న కొడుకు అంబులెన్స్ తో పాటు పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారంతో ఆర్జిఐఏ ఇన్స్పెక్టర్ బాలరాజు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని చంద్రకళను అంబులెన్స్ లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మార్గం మధ్యలోనే చంద్రకళ కనుమూయడంతో, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి నిందితుడు ప్రకాష్‌ని పోలీసులు అదుపులకు తీసుకొని మర్డర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# డబ్బులు ఇవ్వలేదని ముక్కు పగులగొట్టిన హిజ్రాలు



**శేరిలింగంపల్లి, మార్చి 13 (జనంసాక్షి) :** తమ అడిగినంత డబ్బు ఇవ్వలేదని ఓ హెూటల్ యజమాని ముక్కు పగులు కొట్టిన ముగ్గురు హిజ్రాలను మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించిన ఘటన గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్పెక్టర్ వెల్లడించిన వివరాల ప్రకారం...మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి 100 ఫీట్ రోడ్ పక్కన గల 'తాజా కిచెన్' రెస్టారెంట్ లో ఈనెల 4వ తేదీన సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో ముగ్గురు హిజ్రాలు హెూలీ పండుగ ఇనాం కావాలంటూ 2 వేలు ఇచ్చి తీరాల్సిందేనని రెస్టారెంట్ యజమాని అయిన రాఘవేందర్ రావును దబాయించారు. దీంతో అంత డబ్బు తాను ఇవ్వలేనని, ఇచ్చింది తీసుకోవాలి తప్ప డిమాండ్ చేయకూడదు అంటూ అతను వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేయగా సహనం కోల్పోయిన హిజ్రాలు పక్కనే ఉన్న ఐరన్ డస్ట్ బిన్ ను రాఘవేంద్రరావు పైకి విసిరేశారు. దాడి నుండి అతను తప్పించుకునే లోపే అతని ముక్కుకు బలంగా తాకడంతో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. కాగా చికిత్స నిమిత్తం హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌కి తరలించడం జరిగింది. ఇదే విషయాన్ని ఉటంకిస్తూ రెస్టారెంట్ యజమాని బంధువు మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు చేసిన అనంతరం ముగ్గురు హిజ్రాలు అయిన అర్జు అలియాస్ షేక్ హుసైన్, ఆధాఖాన్ అలియాస్ అబ్దుల్ సాదిక్ అబ్దుల్ రఫిక్, నేహా అలియాస్ నీలేష్ ఆనంద్ కాడే లను గురువారం రిమాండ్ కు తరలించడం జరిగిందని మాదాపూర్ పోలీస్ అధికారులు తెలిపారు.

# రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి



**షాబాద్, మార్చి 13 (జనం సాక్షి) :** రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన సమాచారం మేరకు బోడంపాడు గ్రామానికి చెందిన మొగిలిగిద్ద సుధాకర్ (46) తిమ్మక్క రజనీకాంత్ (28) కొత్తపల్లి బాలయ్య (60) అతివేగంతో ఢీకొని తీవ్రమైన రక్తస్రావంతో ఉన్నవారిని వెంటనే 108 వాహనంలో శంషాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడం మొగలిగిద్ద సుధాకర్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలుపగా షాద్నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజినీకాంత్, బాలయ్య పరిస్థితి విషమంగానే ఉందని తెలిపిన ఆసుపత్రి డాక్టర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని షాబాద్ ఇన్స్పెక్టర్ కాంతారెడ్డి తెలియజేశారు.

# వాల్మీకి బోయలను ఎస్టీలో కలిపితే ఉద్యమమే..

**పాలకుర్తి, మార్చి 13 (జనంసాక్షి) :** బీసీ కులాల జాబితాలో ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీల్లో కలిపితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలంగాణ ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దేవరాయ సాయిలు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ ఎంపీ డీకే అరుణ బీసీ కుల జాబితాలో ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలని పార్లమెంట్లో మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ తన రాజకీయ అవసరాల కోసం గతంలో అదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాబూరావు ద్వారా గిరిజనుల విద్వేషాలకు పాల్పడ్డారని ఇప్పుడు డీకేఅరుణ ద్వారా వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చడానికి కుట్రలు చేస్తే గిరిజనులు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. డీకే అరుణ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మహిళ మృతి

**శంకర్‌పల్లి, మార్చి 13 (జనంసాక్షి) :** మోకిలా వద్ద ఓ ద్విచక్ర వాహనం యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఒక మహిళ మృతి చెందగా ఒక వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మోకిలా సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారంగా మోకీలలోని ఎన్సిడి అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్న రవీందర్ మరియు భార్య ఉమాదేవి (55) బుధవారం నార్సింగ్‌కి వెళ్లి తిరుగు ప్రయాణంలో మోకిలలోని సుబిసి టౌన్షిప్లో గల ఉడిపి హెూటల్లో టీ తాగేందుకు యూటర్న్ తీసుకుంటుండగా గండిపేట( మెహదీపట్నం) నుంచి శంకర్పల్లి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శంకర్పల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఉమాదేవి మృతి చెందింది. మృతదేహా న్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్లకు తరలించినట్లు తెలిపారు. మృతురాలి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఫ్యూచర్ సిటీలో తమ గ్రామాన్ని కలపాలని ఎమ్మెల్యేకు వినతి



**యాచారం, మార్చి 13 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీలో మొండి గౌరెల్లి గ్రామాన్ని కలపాలని గురువారం గ్రామస్తులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డిని కలిసి వినతపత్రం అందజేశారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాన్ని ఖచ్చితంగా ఫ్యూచర్ సిటీ లో కలపడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కోలన్ బుచ్చి రెడ్డి, మేకల యాదగిరి రెడ్డి, మర్రిపల్లి అంజయ్య యాదవ్, బుచ్చి రెడ్డి, తాంద్ర రవీందర్, నక్క శ్రీనివాస్ యాదవ్, మాధం జంగయ్య , సందీప్ రెడ్డి , గుర్రం జంగారెడ్డి , వెంకటేష్ తదితరులు పాల్గోన్నారు.

# ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి

- 'జనంకోసం' సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి



శేరిలింగంపల్లి, మార్చి 13 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో నెలకొనివున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని 'జనంకోసం' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి మండల డిప్యూటీ కలెక్టర్ కు గురువారం ఆయన ప్రత్యేక వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కసిరెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్ పరిధి శేరిలింగంపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోగల సర్వే నెంబర్ 64/1 లో 2360 గజాల ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడానికి తక్షణమే అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకోవాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. 2010 సంవత్సరంలో ప్రభుత్వం సదరు ప్రభుత్వ భూమిలో బిసి హాస్టల్, కమ్యూనిటీ హాల్, సబ్ పోస్ట్ ఆఫీస్ నిర్మాణం నిమిత్తం 2360 గజాల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. అయితే కొంతమేర బిసి హాస్టల్ నిర్మాణానికి పూనుకున్నా మిగిలిన కాళీ ప్రదేశంపై కన్నేసిన కొంతమంది దళారులు తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి అట్టి స్థలాన్ని కబ్జా చేయడం జరిగిందని, ఇదే విషయమై స్థానికులు 2024లో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ అధికారులకు, జిల్లా ఆర్డీవో అధికారికి పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందని, అయినప్పటికీ పెద్దగా చర్యలు లేకపోవడంతో ప్రభుత్వ భూమి ఇంకా కబ్జాకోరుల చెరలోనే ఉందని ఆయన దుయ్యబట్టారు. పలు ప్రజా ప్రయోజనాలకోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని తక్షణమే పరిరక్షించి ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన అవసరం ఉందని కసిరెడ్డి భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. కొంతమంది అక్రమార్కులు దొంగ సర్టిఫికెట్లను సృష్టించి సదరు భూమిని తమదిగా చెప్పుకుంటూ ఉండడం దుర్మార్గమన్నారు. పూర్తి ఆధారాలతో గత సంవత్సరమే ఫిర్యాదు చేసినప్పటికీ భూ కబ్జా విషయంలో అధికారులలో చలనం లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుండడంతోపాటు వారి ప్రమేయాన్ని కూడా శంకించక తప్పదని కసిరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించాల్సిన బాధ్యతను మరోసారి శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులకు గుర్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జనం కోసం సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో సంపూర్ణ వర్గీకరణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ





**స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 13 (జనం సాక్షి) :** ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో సంపూర్ణమై న వర్గీకరణ చట్టాన్ని తేవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ లేకుండానే తెలంగాణలో విడుదల చేస్తున్న ఉద్యోగ పరీక్ష ఫలితా లు వాయిదా వేయాలని, వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరవధిక నిరసన నిరాహార దీక్షలు నేటితో ఐదవరోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు ఎమ్ఆర్పీఎస్ మండల అధ్యక్షులు గుర్రం నవీన్ మాదిగ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మా ర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాది గ పాల్గొని దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ.. ఒకవైపు ఎస్సి వర్గీకరణపై చట్టం చేస్తామని చెప్తూ ఆగమేఘాల మీద గ్రూప్ 1 గ్రూప్ 2, గ్రూప్ 3 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఎక్స్టెన్షన్ ఆఫీసర్ల ఉద్యోగ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తూ మాదిగలే కాకుండా మెజార్టీ ఎస్సి కులాలకు ఉద్యోగాలు దక్కనీయకుండా ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి చిత్త శుద్ధి ఉంటే ఇచ్చిన మాటకు కట్టుబడి విడుదల చేస్తు న్న వివిధ ఉద్యోగ పరీక్షా ఫలితాలకు కూడ వర్గీకరణ వర్తించేలా ఆర్డినెన్స్ తీసుకొచ్చైనా ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈదీక్షలో నాయకులు నలిమేల నాగరాజు, మంద శ్రీనివాస్, చాడ ఏలియా, గుర్రం అశోక్, గాదె శ్రీధర్, మేడ స్వామి, గుర్రం వెంకటేష్, గుర్రం శ్రీను, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.




# ఉద్యోగాల పంట

## వచ్చే ఏడాది ఐటీలో నియామకాలు డబుల్



ఐటీ రంగంలో ఫ్రెషర్ల నియామకాలు పుంజుకొనే అవకాశం ఉంది. ఏప్రిల్ నుంచి మొదలుకానున్న ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1,50,000 మందిని కంపెనీలు నియమించుకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే దాదాపు రెట్టింపు నియామకాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని రిక్రూటింగ్ సంస్థ టీమ్‌లీజ్ తన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి ఐటీలో ఫ్రెషర్ల నియామకాల సంఖ్య 85 వేల నుంచి 95 వేలకు చేరే అవకాశం ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దీని సంఖ్య దాదాపు డబుల్ కానుంది.

# ఎంటీఎన్‌ఎల్ షేర్లు పైపైకి..

MTNL

ప్రభుత్వరంగ టెలికాం సంస్థ మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ షేర్లు నేడు ట్రేడింగ్ సెషన్‌లో దూసుకెళ్తున్నాయి. ఇంట్రాడేలో ఏకంగా 14 శాతం పెరిగి రూ.49.29 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. ప్రస్తుతం లాభాల్లో పయనిస్తున్నాయి. ఆస్తుల విక్రయం ద్వా రా నిధుల్ని సమకూర్చుకోవడమే ఇందుక్కారణం. ఎంటీఎన్‌ఎల్, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తమ భూములు, భవనాలు, టవర్లు, ఫైబర్ విక్రయం ద్వారా మొత్తం రూ.12,984.86 కోట్లను ఆర్జించింది. ఈ విషయాన్ని కేంద్ర కమ్యూనికేషన్ల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిన్న లోక్‌సభలో తెలిపారు. తమ ప్రధాన కార్యకలాపాలకు వినియోగించని ఆస్తులనే ఆయా సంస్థలు నగదీకరణ చేశాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఆమోదించిన విధానానికి అనుగుణంగానే ఆస్తుల మానిటైజేషన్ జరుగుతుందని వెల్లడించారు.

# భారత్‌లో స్టార్‌లింక్ ఎంట్రీ.. సవాలేనా?



**జనంసాక్షి:** శాటిలైట్ కమ్యూనికేషన్స్ సాయంతో ఇంటర్నెట్ సేవలందించేందుకు ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్‌ఎక్స్‌తో దేశీయ టెలికాం సంస్థలు భారతీ ఎయిర్‌టెల్, జియో ఒప్పందం చేసుకున్నాయి. స్పేస్‌ఎక్స్ అనుబంధ స్టార్ లింక్ ఇప్పటికే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను 100 దేశాల్లో అందిస్తోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి భద్రతా పరమైన అనుమతులు లభిస్తే మన దేశంలోనూ ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. అయితే, స్టార్‌లింక్ సేవలకు దేశంలో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. దేశీయ టెలికాం సంస్థలకు స్పెక్ట్రమ్ కేటాయించేందుకు అనుసరిస్తున్న వేలం పద్ధతినే శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థలకూ అమలు చేయాలని గతంలో ఎయిర్‌టెల్, జియో కోరాయి. కట్ చేస్తే.. ఆ రెండు సంస్థలే ప్రధాని మోదీ అమెరికా పర్యటన తరవాతి పరిణామాల్లో స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకున్నాయి. కాబట్టి భారత్‌లో స్టార్ లింక్ ఎంట్రీ మార్గం దాదాపు సుగమం అయినట్లే. స్టార్‌లింక్‌కు చెందిన 6,000 లియో (లో ఎర్త్ ఆర్బిట్) ఉపగ్రహాలు భూమికి దగ్గరగా (దాదాపు 550 కి.మీ.ఎత్తున) ఉండే కక్ష్యలో పరిభ్రమి స్తుంటాయి. భూమి నుంచి ఈ ఉపగ్రహాలు తక్కువ దూరంలో ఉండడం వల్ల తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సేవలను ఆస్వాదించొచ్చు. దేశంలో ఇంటర్నెట్ వినియోగదార్లు కోట్లలో ఉన్నప్పటికీ.. నెట్‌వేగం సరిగా లేని మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాలు చాలా ఉన్నాయి. అలాంటి చోట ఇంటర్నెట్ సేవలందిచేందుకు స్టార్ లింక్ ఉపయోగపడుతుంది. స్టార్ లింక్ అందిస్తున్న శాటిలైట్ సేవల ఏర్పాటు ఖర్చు ఎక్కువ. స్టార్ లింక్ ఇన్‌స్టలేషన్‌కు దాదాపు రూ.30,500, నెలవారీ సబ్‌స్క్రిప్షన్ సగటు రూ.10వేలు ఉంది. మన దేశంలో ఈ ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. స్టార్ లింక్‌లో ప్రస్తుతం డౌన్‌లోడ్ స్పీడ్ 25-220 ఓఎజూబ వేగం ఉంటోంది. దేశీయంగా టెలికాం కంపెనీలు ఫైబర్, ఎయిర్‌ఫైబర్ సేవల ద్వారా 100 ఓఎజూబ వేగంలో అపరిమిత డేటాను రూ.599కే అందిస్తున్నాయి. ఛార్జీల పరంగా చూస్తే ఫైబర్, టెలికాం టవర్లు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండే నగరాలు, పట్టణాల్లో స్టార్ లింక్ సేవల విస్తరణకు అవకాశం తక్కువ. అంటే ఇంటర్నెట్ సేవలందించేందుకు ఏమాత్రం అవకాశం లేని కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలకు మాత్రమే స్టార్ లింక్ సేవలు పరిమితం కానున్నాయి. శాటిలైట్ సిగ్నళ్ల ద్వారా డేటా అందించాలంటే వాతావరణం కూడా అనుకూలించాలి. ఒకవేళ వర్షాలు, దట్టమైన మేఘాలు కమ్ముకొన్నా సిగ్నళ్లకు విఘాతం కలుగుతుంది. దేశంలో టెలికాం విభాగంలో జియో, ఎయిర్‌టెల్ సంస్థల హవా కొనసాగుతోంది. ఆయా సంస్థలు బ్రాడ్‌బ్యాండ్ సేవలనూ అందిస్తున్నాయి. అదీ తక్కువ ధరలో. కాబట్టి ఈ సంస్థలకు స్టార్ లింక్ ఏమాత్రం పోటీ కాబోదని నిపుణులు చెబుతున్నారు. చూడాలి భారత్‌లో స్టార్ లింక్ ఏమేర ప్రభావం చూపుతుందో.

## స్టార్‌లింక్‌కు స్వాగతం అంటూ కేంద్రమంత్రి పోస్ట్..

### • కానీ ఆ వెంటనే డిలీట్..

స్టార్‌లింక్ సేవల కోసం అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌తో దేశీయ అగ్రగామి టెలికాం సంస్థలు భారతీ ఎయిర్‌టెల్, జియో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'స్టార్‌లింక్‌కు స్వాగతం' అంటూ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే కాసేపటికే దాన్ని డిలీట్ చేయడం గమనార్హం."స్టార్‌లింక్, వెల్‌కమ్ టు ఇండియా! మారుమూల ప్రాంతాల్లోని రైల్వే ప్రాజెక్టులకు ఇది ఎంతో ఉపయోగకరం" అని అశ్వినీ వైష్ణవ్ తొలుత పోస్ట్ పెట్టారు. దీంతో భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు కేంద్రం నుంచి అనుమతులు లభించాయని, త్వరలోనే అందుబాటులోకి వస్తాయనే సంకేతాలిచ్చినట్లయ్యింది. కానీ, కొద్దిసేపటి తర్వాత కేంద్రమంత్రి ఈ పోస్ట్‌ను డిలీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. స్పేస్‌ఎక్స్ అనుబంధ స్టార్‌లింక్ ఇప్పటికే శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను 100 దేశాల్లో అందిస్తోంది. దేశీయ టెలికాం సంస్థలకు స్పెక్ట్రమ్ కేటాయించేందుకు అనుసరిస్తున్న వేలం పద్ధతినే శాటిలైట్ కమ్యూనికేషన్స్ సంస్థలకూ అమలుచేయాలని ఇటీవల టెలికాం దిగ్గజాలు కోరాయి. ఇప్పుడు అవే సంస్థలు స్పేస్ఎక్స్‌తో ఒప్పందం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఒప్పందం ద్వారా ప్రపంచస్థాయి హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను మారుమూల గ్రామాలకు సైతం అందించేందుకు వీలుపడుతుంది. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్‌కు మనదేశ హోంమంత్రిత్వ శాఖ నుంచి భద్రతాపరమైన అనుమతులు లభించాకే ఈ సేవలు ప్రారంభమవుతాయి.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 3.85

వరంగల్ ₹ 3.87

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 81,200 (22 క్యారెట్లు)

₹ 88,580 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,10,000

# ఓలా ఫ్లాష్ సేల్..


## ఎస్1 స్కూటర్‌పై రూ.6 వేలు డిస్కౌంట్



ప్రముఖ విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ ప్రత్యేక సేల్‌ని ప్రకటించింది. హోలీ సం దర్భంగా ఎస్1 శ్రేణిలోని ఎలక్ట్రిక్ స్కూటర్లపై పెద్ద ఎత్తున డిస్కౌంట్ అంది స్తోంది. నేటి నుంచి (మార్చి 13) ప్రారంభమైన ఈ సేల్ మార్చి 17 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. సేల్‌లో భాగంగా ఓలా ఎస్1 ఎయిర్ కొనుగోలుపై రూ.26,750 వేల డిస్కౌంట్ అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఈవీ ధర రూ.89,999గా ఉంది. రూ.22 వేల వరకు రాయితీ అందించనన్నట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ స్కూటీ ధర రూ.82,999 నుంచి ప్రారంభం అవుతుంది. ఇక ఎస్1 రేంజ్‌లోని మిగిలిన స్కూటర్లపై రూ.25 వేల వరకు తగ్గింపు ఉంటుందని కంపెనీ వెల్లడించింది. మార్కెట్లోకి కొత్తగా తీసుకొచ్చిన ఎస్1 జెన్3 శ్రేణి ఈవీలకూ ఈ ఆఫర్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. డిస్కౌంట్‌తో పాటు రూ.10,500 విలువైన ప్రయోజనాలను ఓలా ఎలక్ట్రిక్ అందిస్తోంది. కొత్తగా ఎస్1 జెన్2 స్కూటర్ కొనుగోలు చేసేవారికి ఏడాది పాటు రూ.2,999 విలువైన మూవ్ ఓఎస్+ సబ్‌స్క్రిప్షన్‌ని ఉచితంగా అందిస్తోంది. రూ.14,999 విలువైన ఎక్స్‌టెండెడ్ వారెంటీని రూ.7,499కే ఇస్తోంది.

# మరోసారి నష్టాల్లోనే..

## 200 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. 22,400 దిగువకు నిఫ్టీ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. ఇంట్రాడేలో ఆ లాభాలను కోల్పోయాయి. హోలీ సందర్భంగా శుక్రవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈకి సెలవు కావడంతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పుడేం జరుగుతోందోనన్న భయాలు ప్రపంచ మార్కెట్లను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా పొజిషన్లు తీసుకొనేందుకు ఇన్వెస్టర్లు ముందుకు రాలేదని అనలిస్టులు చెబుతున్నారు. దీంతో సెన్సెక్స్ వరుసగా ఐదో రోజు నష్టపోగా.. నిఫ్టీ సైతం 22,400 దిగువన వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిసింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలూ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74,392.54 పాయింట్ల వద్ద (క్రితం 74,029.76) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,401 వద్ద గరిష్ఠాన్ని తాకింది. తర్వాత అమ్మకాలతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. చివరికి 200.85 పాయింట్ల నష్టంతో 73,828.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్ల నష్టంతో 22,397.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 22 పైసలు బలపడి 87గా ఉంది. సెన్సె?క్స్ 30 సూచీలో జొమాటో, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, టాటాస్టీల్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 70 డాలర్లు, బంగారం ఔన్సు 2953 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.

లాభాల్లో ప్రారంభమైన స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 300 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 22,500 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టింది. ఉదయం సెన్సెక్స్ 105 పాయింట్లు లాభంతో 74126 వద్ద.. నిఫ్టీ 12 పాయింట్లు పెరిగి 22,482 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఎంఅండ్ఎం, అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 71.01 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,953.80 డాలర్ల వద్ద కదలాడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 87.14 వద్ద కొనసాగుతోంది.

# సీఎం 'భంగ్' తాగి సభకు వస్తున్నారు

## మత్తులో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు

## మండలిలో నీతీశ్‌తో రబ్రీదేవి తీవ్ర వాగ్వాదం

**పట్నా(జనంసాక్షి):** బిహార్ శాసనమండలిలో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, మాజీ సీఎం, ప్రతిపక్ష నేత రబ్రీ దేవి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకొంది. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్జేడీ మిత్రపక్షమైన సీపీఐ(ఎంఎల్) మహిళా ఎమ్మెల్సీ శశి యాదవ్ అడిగిన ఓ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పింది. అది సంతృప్తికరంగా లేదని శశి యాదవ్ చెబుతుండగా, సీఎం నీతీశ్ మధ్యలో కల్పించుకుని 'మా ప్రభుత్వం చాలా చేస్తోంది. కానీ గత ప్రభుత్వాలు చేసిందేమీ లేదు' అని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రతిపక్ష నేత రబ్రీ దేవి ఘాటుగా స్పందించారు. "మీరు ముఖ్యమంత్రి కాకమునుపు ఎలాంటి అభివృద్ధీ జరగలేదంటున్నారు. నాటి పనులకు సంబంధించిన రికార్డులు సభకు చూపించండి. అప్పుడు మీకే అర్థమవుతుంది" అని అన్నారు. ఈ క్రమంలో నీతీశ్ తన వ్యాఖ్యలను గట్టిగా సమర్థించుకొనే ప్రయత్నం చేయగా, రబ్రీదేవి జోక్యం చేసుకుంటూ "మీరు చెబుతున్న దాని ప్రకారం 2005లో మీరు సీఎం కావడానికి ముందు మహిళలు దుస్తులు కూడా వేసుకొనే పరిస్థితిలో లేరంటారు" అని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఇవి నీతీశ్‌ను ఆగ్రహానికి గురిచేశాయి. "మా ప్రభుత్వం రాకముందు మహిళలకు సరైన గౌరవం లేదు. వారు(గత పాలకులు) మహిళల కోసం ఏం చేశారు? ఆమె భర్త సమస్యల్లో చిక్కుకున్నప్పుడు ఆమెను సీఎం కుర్చీలో కూర్చోబెట్టారు" అంటూ రబ్రీదేవిని ఉద్దేశిస్తూ సీఎం వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై రబ్రీదేవి తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్షాలతో కలసి వాకౌట్ చేశారు. ఆ సమయంలోనూ నీతీశ్ శాంతించలేదు. "గతంలో వారి(ఆర్జేడీ)తో రెండు సార్లు పొత్తుపెట్టుకుని పొరపాటు చేశాను. మళ్లీ మా పాత స్నేహితుల(భాజపా)తో కలిశాను. ఇకపై వారితోనే కలిసి కొనసాగుతూ అభివృద్ధి చేస్తాం" అని పేర్కొన్నారు. రబ్రీదేవి విలేకర్లతో మాట్లాడుతూ నీతీశ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం 'భంగ్' తాగి సభకు వచ్చి మత్తులో మాట్లాడుతున్నారని ఆరోపించారు.

# రూ.8 లక్షల కోట్ల క్రిప్టో మోసం..

క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజీ పెట్టి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన కేటుగాడు ఎట్టకేలకు చిక్కాడు. అమెరికాలో భారీ క్రిప్టో మోసానికి పాల్పడి పరారీలో ఉన్న లిథువేనియా దేశస్థుడిని కేరళ పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. రూ.8 లక్షల కోట్ల క్రిప్టో మోసానికి సంబంధించి నిందితుడు అలెక్సెజ్ బెస్కియోకోవ్ అమెరికాలో వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. లిథువేనియాకు చెందిన అలెక్సెజ్ కొన్నేళ్ల కిందట 'గారంటెక్స్' పేరుతో క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజీని ఏర్పాటుచేసినట్లు యూఎస్ సీక్రెట్ సర్వీస్ డాక్యుమెంట్లు వెల్లడించాయి. దీనిద్వారా కంప్యూటర్ హ్యాకింగ్, నార్కోటిక్స్ లావాదేవీలు, రాన్సమ్‌వేర్ వంటి మోసాలకు పాల్పడేవాడు.

# త్రిభాషా సూత్రం ఎందుకింత రచ్చ?

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జాతీయ విద్యా విధానంలోని త్రిభాషా సూత్రంపై రాజకీయ భావోద్వేగాలు రగిలాయి. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని ఎన్ఈపీ-2020 సిఫార్సు చేస్తోంది. ఇందులో కచ్చితంగా రెండు భారతీయ భాషలుండాలి. ఈ ఫార్ములా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ వర్తిస్తుంది. అయితే విద్యార్థులకు నేర్పాల్సిన భాషలేమిటన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలదే. పిల్లలకు ఐదో తరగతి వరకూ తప్పనిసరిగా మాతృభాషలోగానీ, స్థానిక భాషలోగానీ, ప్రాంతీయ భాషలోగానీ సబ్జెక్టులను (మీడియం) బోధించాలి. ఆ తర్వాత 8, ఆపై తరగతుల్లోనూ స్థానిక మీడియాల్లో బోధన సాగితే బాగుంటుంది. త్రిభాషా సూత్రాన్ని మొట్టమొదటి సారిగా కొఠారి కమిషన్ (1964-68) సూచించింది. దీన్ని అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 1968 నాటి జాతీయ విద్యా విధానంలో పొందుపరిచారు. రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న రోజుల్లో పునర్వ్యవస్థీకరించి ఎన్‌పీఈ-1986 పేరుతో అమల్లోకి తెచ్చారు. 1992లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం జాతీయ సమైక్యత, భాషా వైవిధ్యం



పెంపొందించే దిశగా ఈ విధానానికి సవరణలు చేసింది. ఈ ఫార్ములా కింద మాతృభాష, ప్రాంతీయ భాష, అధికార భాష (ఆంగ్లంతో సహా), మరో ఆధునిక భారతీయ భాష, యూరోపియన్ భాష నేర్పాలని ప్రతిపాదించారు. పాఠశాల స్థాయిలోనే బహుభాషా తత్వాన్ని పెంపొందించడానికి త్రిభాషా సూత్రాన్ని సత్వరం అమలు చేయాలని ఎన్ఈపీ-2020 చెబుతోంది. రాజ్యాంగ నిర్దేశాలను, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు బహుభాషా తత్వాన్ని ప్రోత్సహించి జాతీయ సమైక్యతను సాధించేందుకు ఇది అవసరమని అభిప్రాయంపడింది. త్రిభాషా సూత్రం అమలులో వెసులుబాటు ఉంటుందని, ఏ రాష్ట్రంపైనా.. ఏ భాషనూ రుద్దబోమని ఎన్ఈపీ-2020 చెబుతోంది. రాష్ట్రాలు, ప్రాంతాలు, ముఖ్యంగా విద్యార్థులు ఎంచుకునే మూడు భాషలనే ఈ విధానం కింద నేర్పుతారు. అయితే మూడు భాషల్లో రెండు భారతీయ భాషలై ఉండాలి. విద్యార్థులు మాధ్యమిక పాఠశాల స్థాయిలో భారతీయ భాషలు, ఆంగ్లంతోపాటు కొరియన్, జపనీస్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ భాషలూ అభ్యసించవచ్చని ఎన్ఈపీ-2020 చెబుతోంది. అధిక శాతం పాఠశాలల్లో భాషా మాధ్యమంగా ఉన్న ఆంగ్లాన్ని విదేశీ భాషగా పరిగణిస్తారు. అందుకే ఈ భాషను ఎంచుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆది నుంచీ త్రిభాషా సూత్రాన్ని తమిళనాడు వ్యతిరేకిస్తోంది. 1937లో సి.రాజగోపాలాచారి నేతృత్వంలోని మద్రాస్ ప్రభుత్వం పాఠశాలల్లో తప్పనిసరిగా హిందీ నేర్పాలన్న విధానాన్ని ప్రవేశపెట్టింది. దీనిపై జస్టిస్ పార్టీ నాయకులతోపాటు పెరియార్ వంటి ద్రవిడ భావజాల నాయకులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో ఈ విధానాన్ని 1940లో రద్దు చేశారు. కానీ హిందీ వ్యతిరేక సెంటిమెంటు అలాగే కొనసాగింది. 1968లో త్రిభాషా సూత్రం ప్రవేశపెట్టినప్పుడు తమిళనాడు వ్యతిరేకించింది. ఇది హిందీని రుద్దే ప్రయత్నమని ఆరోపించింది. అప్పటి ముఖ్యమంత్రి సి.ఎన్.అన్నాదురై నాయకత్వంలో తమిళనాడు ప్రభుత్వం ద్విభాషా విధానాన్ని అమలు చేసింది. హిందీ, మరే ఇతర భారతీయ భాషకు బదులు ఆంగ్లాన్ని ఎంచుకుంది. తమిళం, ఆంగ్ల భాషలు నేర్పే విధానాన్ని అనుసరించింది. ఎన్ఈపీ-2020లోని కీలక అంశాలను, ముఖ్యంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్ఈపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి.

## జాతీయం అంతర్జాతీయం


# స్నేహితుడి కోసం వచ్చి.. అతడి చేతిలోనే అత్యాచారానికి గురైన బ్రిటిష్ మహిళ

**ఢిల్లీ:** సోషల్ మీడియా వేదికగా పరిచయమైన స్నేహితుడి మాయమాటలు నమ్మి, అతడిని కలిసేందుకు ఓ యువతి బ్రిటన్ నుంచి భారత్‌కు వచ్చింది. హోటల్ గదిలో అత్యాచారానికి గురైంది. దిల్లీలో మహిపాల్‌పుర్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. దిల్లీలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచే స్తున్న కైలాశ్‌కు బ్రిటన్‌కు చెందిన మహిళతో ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడిం ది. అతడిని చూసేందుకు ఇటీవల ఆమె భారత్‌కు వచ్చింది. మహిపా ల్‌పుర్‌లోని ఒక హోటల్ గదిని బుక్ చేసుకుంది. ఆమెను కలిసేందుకు వచ్చిన కైలాశ్.. మహిళతో అభ్యంతరకరంగా వ్యవహరించాడు. మరో స్నేహి తుడితో కలిసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారి నుంచి తప్పిం చుకున్న బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. తొలుత కైలాశ్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, అక్కడి నుంచి తప్పించుకొని రిసెప్షన్ వద్దకు చేరుకునేందుకు లిఫ్ట్ ఎక్కిన తనను అతడి స్నేహితుడు లైంగికంగా వేధిం చాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నింది తులను అరెస్టు చేశారు. భారత్‌కు వచ్చిన ఆ మహిళ తొలుత మహారాష్ట్ర, గోవాల్లో పర్యటించింది. కైలాశ్‌ని కూడా అక్కడికి రమ్మని అడిగింది. అయితే తాను రాలేనని చెప్పి, ఆమెనే దిల్లీకి రావాలని కోరాడు. ఆమెతో ఇంగ్లిష్‌లో మాట్లాడేందుకు ఇబ్బందిపడిన కైలాశ్.. గూగుల్ ట్రాన్స్‌లేట్ వాడినట్లు బాధితురాలు ఫిర్యాదులో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఘటనను భారత్‌లోని బ్రిటన్ హైకమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కర్ణాటకలో కూడా ఇదేతరహా ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కొప్పళ జిల్లాలో కొందరు నిందితులు విదేశీ పర్యటకులపై దాడి చేసి, ముగ్గురిని కాల్వలోకి తోసి, ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే.

# యూట్యూబ్ చూసి గోల్డ్ స్మగ్లింగ్ నేర్చుకున్నా

## విచారణలో సంచలన విషయాలు వెల్లడించిన రన్యారావు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆమెను కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. విచారణ సందర్భంగా ఆమె పలు విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి నుంచి తనకు కాల్స్ వచ్చాయని, యూట్యూబ్ వీడియోలు చూసి స్మగ్లింగ్ చేయడం నేర్చుకున్నానని ఆమె వాంగ్మూలంలో పేర్కొన్నట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి."గత రెండు వారాలుగా గుర్తుతెలియని వ్యక్తుల నుంచి నాకు కాల్స్ వచ్చాయి. మార్చి 1న ఓ విదేశీ ఫోన్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. దుబాయ్ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్ 3 వద్ద ఉన్న గేట్ ఏ వద్దకు వెళ్లాలని సూచించారు. అక్కడ బంగారం తీసుకుని బెంగళూరులో డెలివరీ చేయాలని చెప్పారు. దుబాయ్ నుంచి ఇంతకు ముందెన్నడూ బంగారాన్ని అక్రమంగా తీసుకురాలేదు. స్మగ్లింగ్ చేయడం ఇదే మొదటిసారి" అని రన్యా రావు అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. "రెండు ప్లాస్టిక్ కవర్లలో బంగారాన్ని ఇచ్చారు. దాన్ని దాచడం కోసం బ్యాండేజ్‌లు, కత్తెరలను ఎయిర్‌పోర్టులో కొన్నాను. ఆ తర్వాత రెస్ట్‌రూమ్‌కు వెళ్లి ఆ బంగారం కడ్డీలను నా శరీరానికి అతికించుకున్నా. జీన్స్, బూట్లలో దాచిపెట్టా. ఇదంతా యూట్యూబ్ వీడియోలు చూసి నేర్చుకున్నా" అని నటి వాంగ్మూలంలో పేర్కొన్నారు. అయితే, కాల్ చేసిన వ్యక్తి ఎవరన్న విషయం మాత్రం తనకు తెలియదని చెప్పారు. అతడి భాష చూస్తే



ఆఫ్రికన్-అమెరికన్‌లా అనిపించిందన్నారు. ఆ బంగారం ఎవరికి ఇవ్వాలో కూడా తనకు తెలియదని నటి చెప్పారు. "ఎయిర్‌పోర్టు టోల్ గేట్ నుంచి బయటకు వచ్చాక సర్వీస్ రోడ్డులో వెళ్లమని నాకు సూచించారు. అక్కడ సిగ్నల్ దగ్గర ఆగి ఉన్న ఆటోలో పెట్టి వెళ్లిపోవాలని చెప్పారు. ఆ వ్యక్తి ఎవరనేది నాకు తెలియదు" అని రన్యారావు అధికారులకు తెలిపారు. ఫొటోగ్రఫీ, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే తాను పలుమార్లు దుబాయ్‌కు వెళ్లినట్లు ఆమె చెప్పారు. గతంలో యూరప్, ఆఫ్రికా, అమెరికాకు కూడా అనేకసార్లు వెళ్లానని పేర్కొన్నారు. ఈ వివరాలపై డీఆర్ఐ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆమె ఫోన్, ల్యాప్‌టాప్‌లో ఉన్న డేటా ఆధారంగా స్మగ్లింగ్ సిండికేట్ నంబర్లను ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా రన్యా రావు బంగారం అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా బెంగళూరు సహా వ్యాప్తంగా అనేక చోట్ల దాడులు చేపట్టింది. కేవలం రాజధానిలోనే ఎనిమిది చోట్లు సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ రాకెట్‌లో భారీ కుట్ర దాగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఈడీ ఆ దిశగా దర్యాప్తు చేస్తోంది. ఈ వ్యవహారంలో సీబీఐ కూడా ఇప్పటికే దర్యాప్తు ముమ్మరం చేసిన విషయం తెలిసిందే. దుబాయ్, మలేసియాలకు హవాలా మార్గంలో నగదు తరలిస్తున్నట్లు గుర్తించడంతో ఇందులో అంతర్జాతీయ రాకెట్ హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. రన్యాతోపాటు మరి కొంత మంది పాత్ర ఉండవచ్చని దర్యాప్తు సంస్థలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఎయిర్‌పోర్టుల ద్వారా సాగిస్తున్న ఈ స్మగ్లింగ్‌లో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖుల పాత్రపైనా దృష్టి సారించాయి. వీటికి సంబంధించిన సాక్ష్యాలను వెలికితీసేందుకు సీబీఐ, డీఆర్ఐలతో సమన్వయం చేసుకుంటున్న ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఇటీవల కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా బెంగళూరు సహా ఇతర ప్రాంతాల్లో సోదాలు కొనసాగిస్తోంది. ఈ కేసులో సీఐడీ దర్యాప్తును ఉపసంహరించుకోవడంలో తనపై ఎటువంటి ఒత్తిడి లేదని కర్ణాటక హోంమంత్రి జీ పరమేశ్వర పేర్కొన్నారు. రన్యా తండ్రి రామచంద్రరావు ఐపీఎస్ అధికారి అయినందువల్ల ఈ కేసును సిబ్బంది, పాలనా సంస్కరణల విభాగం (డీపీఏఆర్)తో దర్యాప్తు చేయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు.



# కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

## డిఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్

**నిర్మల్ రూరల్, మార్చి13(జనంసాక్షి)**

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు.గురువారం జిల్లా కేంద్రంలోని వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్టు వ్యాధి కేసు గుర్తింపు కార్యక్రమం పై శిక్షణ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే కుష్టి వ్యాధిని గుర్తించి చికిత్స అందించినట్లయితే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చు అని తెలిపారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 17 నుండి 30వ తేదీ వరకు లెప్రసీ కేసు గుర్తింపు కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్టు వ్యాధిని గుర్తించడానికి ప్రతి ఒక్కరిని పరీక్షించడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని లెప్రసీ కేసులు గుర్తించి చికిత్సలు అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మాస్ మీడియా అధికారి బారే రవీందర్,డిప్యూటీ పి ఎం ఓ రాజేశ్వర్,లెప్రా సొసైటీ ఫిజియోథెరపిస్ట్ కిషన్ రావు,జిల్లాలోని ప్రాథమిక వైద్య కేంద్రాల వైద్యాధికారులు,ఆరోగ్య పర్యవేక్షక అధికారులు పాల్గొన్నారు.

# కేసిఆర్ హరితవనంలో చెట్లను నరికిన గ్రామస్తులు



**దస్తురాబాద్, మార్చి 13 (జనంసాక్షి):**

మండల కేంద్రంలోని దేవునిగూడెం గ్రామ శివారులో గల కేసీఆర్ హరిత వనాన్ని కొందరు గ్రామస్తులు సుమారు 60 చెట్ల వరకు బుధవారం నరికినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ అటవీ శాఖ ను రోడ్డు నిర్మాణానికి, పోచమ్మ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించమని ఎన్ని సార్లు అడిగిన ఆ శాఖ నుండి ఎటువంటి స్పందన లేకపోవటంతో గ్రామస్తులు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్తులు ఎంతకు శాంతించకపోవటంతో ఎస్ ఐ శంకర్ గ్రామస్తులతో మాట్లాడి పంపించేసారని తెలిపారు. ఎఫ్ఆర్ఓ గీతారాణి మాట్లాడుతూ ఈ సంఘటనను పై అధికారుల దృష్టి కి తీసుకుని వెళ్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎఫ్బిఓ కింగ్ ఫిషర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బి.ఎడ్ పరీక్షలను రంజాన్ పండుగ సందర్భంగా వాయిదా వేయాలని కోరిన జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్

## కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్.

**కరీంనగర్ బ్యూరో, మార్చి 13 (జనంసాక్షి) :**



ఈనెల 18 నుండి ఏప్రిల్ నెల 04 వరకు జరిగే బి.ఎడ్ పరీక్షలు రంజాన్ పండుగ తర్వాత నిర్వహించాలని కాంగ్రెస్ మైనారిటీ జిల్లా చైర్మన్ మొహమ్మద్ తాజోద్దీన్ ఆధ్వర్యంలో శాతవాహన వీసీ ఉమేష్ కుమార్ ను కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఒక ప్రకటన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ ఎండీ తాజోద్దీన్ మాట్లాడుతూ... రంజాన్ ఉపవాసం దీక్షలు ఉండడం వలన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 వరకు పరీక్షలకు దూర ప్రాంతాల నుండి విద్యార్థులు రావాలంటే చాలా కష్టమని, ఎండా కాలం, రంజాన్ ఉపవాస దీక్షలు ఉండటం వలన చాలా కష్టం ఉంటదని పరీక్షలు వాయిదా వేయాలని వారిని వినతి పత్రం రూపంలో వేడుకోవడం జరిగిందన్నారు. దీనికి వైస్ ఛాన్సలర్ సాధ్యమైన వరకు ప్రయత్నం చేస్తానని తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. అక్బర్ అలీ, పెద్దపల్లి కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్, కాంగ్రెస్ మైనారిటీ నాయకులు నేహాల్ అహ్మద్, ఎండీ కలిమోద్దీన్, ఆరిఫ్ ఖాన్, ఇర్షాద్, ఎండీ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుతంగా దీక్ష చేస్తున్న వారిపై కత్తితో దాడి

**భూపాలపల్లి , మార్చి 13 (జనంసాక్షి) :**



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్ నగర్ మెయిన్ రోడ్ లో గల ఊర పోచమ్మ తల్లి గుడి దగ్గర శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తూ గోపరాజు సాంబలక్ష్మి మాట్లాడుతూ సేవలు చేస్తున్న తనను తప్పించి వేరే వ్యక్తులకు అమ్ముకున్నారని అన్నారు. 30 సంవత్సరాల నుండి అక్కడ సేవలు చేస్తూ పరిసరాలను శుభ్రపరుస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. మహిళ 5 రోజులుగా తనకు న్యాయం కావాలని నిరసన దీక్ష చేస్తున్న తరుణంలో గురువారం నాడు తనకు మద్దతు తెలపడానికి సుభద్ర అనే మహిళ వచ్చి నిరసన దీక్షలో మద్దతుగా తెలుపుతున్న సమయంలో ఓరిగంటి శేఖర్ అనే వ్యక్తి సుభద్ర పై కత్తితో దాడి చేసి గాయపరిచినట్టు సుభద్ర, సాంబలక్ష్మి తెలిపారు. గత ఐదు రోజులుగా దీక్ష చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని నాకు ప్రాణహాని ఉందని అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి మార్చి 13 (జనంసాక్షి) :**



ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విలువలు కలిగిన గుణాత్మక విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆకస్మికం గా సందర్శించి తరగతి గదులు, వంట శాల, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు సమన్వయం తో కృషి చేయాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టికా హార ం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యా ర్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వేసవికాలంలో వడదెబ్బకు గురి కాకుండా పాటించవలసిన జాగ్రత్తలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సమయ పాలన పాటిం చాలని, విధుల పట్ల బాధ్యతా యుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులు పఠనా సామర్థ్యాలను పరీక్షిం చి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిం చాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనర్‌ను కలిసిన ఎంఐఎం నాయకులు

**కరీంనగర్, మార్చి 13 (జనంసాక్షి)**



కరీంనగర్ జిల్లా నూతన పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన గౌస్ఆలంను, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు కలిసి జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పూల బొకే అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖకు తమ పార్టీ ద్వారా సహాయ సహకారాలను అందిస్తామని గులాం అహ్మద్ చెప్పారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా హలీం స్టాల్స్, హొటల్లు, రెస్టారెంట్లు, మిల్క్ హౌస్ లు, ఐస్ క్రీమ్ పార్లర్ లు, టీ స్టాల్స్, ఫ్రూట్ మార్కెట్ వెజిటేబుల్ మార్కెట్ కిరాణా షాపులు వంటివి రాత్రి వేళల్లో తెరిచి ఉంచేలా చొరవ తీసుకోవాలని సిపిని కోరారు. ఇఫ్తార్ వేళలో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల నుంచి మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై సిపి సానుకూలంగా స్పందించినట్లు గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ హాఫ్ ఇజ్ సయ్యద్ ఖాద్రి సమరుద్దీన్ ఇబ్రహీం శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, అలిబాబా, అజర్, మాజిద్ హుస్సేన్, వాజిద్ అలీ, అంజద్ ఖాన్, సాజిద్, కాజం ఖాన్, సమీ, యఖుబ్, అబ్దుల్లా ఖాన్, సుల్తాన్ మీర్జా, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

# హజ్రత్ షేర్ అలిబాబా దర్గా అభివృద్ధికి కృషి చేయండి

**నూతన అధ్యక్షుడు వాజిద్ అలీకి ప్రొసీడింగ్ అందించిన గులాం అహ్మద్ హుస్సేన్**

**ఎమ్మెల్యే సహకారంతో దర్గాలో మౌళిక వసతుల కల్పనకు కృషి**

**దర్గా నూతన అధ్యక్షుడు వాజిద్ అలీ**

**తిమ్మాపూర్, మార్చి 11 (జనంసాక్షి)**



హజరత్ షేర్ అలీ బాబా దర్గా అభివృద్ధికి, మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అండదండలతో అహర్నిశలు కృషి చేయాలని, అవినీతి అక్రమాలకు తావు లేకుండా దర్గా అభివృద్ధే, ధ్యేయంగా కమిటీ సభ్యులు పనిచేయాలని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సూచించారు. గురువారం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో నూతన దర్గా కమిటీ అధ్యక్షుడు వాజిద్ అలీకి, గులాం అహ్మద్ హుస్సేన్ తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ద్వారా వచ్చిన అధికారిక ప్రొసీడింగ్ను (ఎఫ్ఎన్04/కెఎంఎన్ఆర్/ఎంసీ/2020/జెడ్-ఐవి) అందజేశారు. ఈకమిటీ యొక్క కాలపరిమితి 3సంవత్సరాలు ఉంటుందన్నారు. గతంలో ఉన్నటువంటి కమిటీ అధ్యక్షుడు చేసినటువంటి తప్పులను నూతన కమిటీ పాలకవర్గం సరిదిద్దాలన్నారు. స్థానిక మానకొం డూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారా యణ, ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీల కృషితో, వక్ఫ్ బోర్డు చైర్మన్, సీఈవోల సహకారంతో నూతన కమిటీ పాలకవర్గం ఏర్పడి, ప్రొసీడింగ్ వచ్చిందన్నారు. అక్రాంతమైన దర్గా భూమిని ప్రభుత్వ సహకారంతో, ఎమ్మెల్యే కృషితో న్యాయపరంగా భూమిని దర్గా పరమయ్యేట్లు సాధించాలన్నారు. దర్గా కమిటీ నూతన అధ్యక్షుడు వాజిద్ అలీ మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి, మౌళిక వసతుల కల్పన కోసం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో కృషి చేస్తామన్నారు. తమ కమిటీ నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవంపల్లి సత్యనారా యణకు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీకి, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబుకు, పొన్నం ప్రభాకర్ కు, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనికి, ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కు, వక్ఫ్ బోర్డు సీఈఓకు, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కు, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి, జాయింట్ సెక్రటరీ హాఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీకు, జిల్లా కాంగ్రెస్ సమస్త మైనార్టీ సెల్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇర్ఫాన్ మొయినుద్దీన్, ఆయుబ్ ఖాన్, సయ్యద్ జకీయుద్దీన్ నదీమ్, యూసుఫ్ మీర్జా, సలీం, అలీ షేక్, ఎం.ఏ ఫహీం, మూసా షేక్, మౌలాన అలీముద్దీన్ నిజామీ, ఎంఏ సలాం, లయిఖ్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# వైద్య-ఆరోగ్యశాఖ లో ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీ

## జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి)**

జాతీయ ఆరోగ్య సంస్థలో నూతనంగా మంజూరైన ఎం.ఎం.యు. యూనిట్ నందు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి నేరుగా ముఖాముఖి పద్ధతిన దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా॥ హరీష్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 వైద్య అధికారి పోస్టుకు ఎం.బి.బి.ఎస్. పూర్తి చేసి టి.ఎస్. మెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకొని ఉండాలని, 1 నర్సింగ్ అధికారి పోస్టుకు బి.ఎస్సి / జి.ఎన్.ఎం. నర్సింగ్ కోర్స్ ధృవపత్రం, టి.ఎస్. మెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకొని ఉండాలని, 1 లాబ్ టెక్నీషియన్ పోస్టుకు బి.ఎస్సి / ఎం. ఎల్.టి. / డి.ఎం.ఎల్.టి., ల్యాబ్ లో 2 సం॥ల అనుభవం, టి.ఎస్. పారామెడికల్ కౌన్సిల్లో రిజిస్టర్ చేసుకొని ఉండాలని, 1 పారామెడిక్ కమ్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 10.30 గం॥ల నుండి 19వ తేదీ సాయంత్రం 5 గం॥ల వరకు కార్యాలయ పనివేళలలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు నిజ ధృవీకరణ పత్రాలు, గెజిటెడ్ అధికారి సంతకం చేసిన ధృవపత్రాల నకలు ప్రతులు స్వయంగా తీసుకురావాలని, జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎఫ్-1 బ్లాక్ మొదటి అంతస్తులో గల ఎఫ్-25లో గల జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. నోటిఫికేషన్, దరఖాస్తు ఇతర వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ http://mancherial. telangana. gov.inలో, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# భౌతిక శాస్త్రంలో దశావ దానం



**కాళేశ్వరం, మార్చ్ 13,(జనం సాక్షి)**

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఎఫ్ పి ఎస్ టి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల సమక్షంలో ప్రధానోపాధ్యాయురాలు బాసిరి అన్నపూర్ణ అధ్యక్షతన భౌతిక శాస్త్రంలో దశావధాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తొమ్మిదవ తరగతి చదువుతున్న నాంసాని అక్షయ ఈ అవధానాన్ని న్యూటన్ గమన నియమాలు అనే అంశం పై చేయడం జరిగింది. ప్రశ్నకు జవాబు, సమాధానాలకు ఆశువుగా ప్రశ్నలను తయారు చేయడం, చూపించిన పటంలో దాగున్న న్యూటన్ గమన నియమాన్ని గురించి చెప్పడం, చూపించిన పరికరాలతో ఏ కృత్యం చేయవచ్చునో దానితో ఏ నియమాన్ని గురించిన అంశాన్ని వివరించడం, ఇచ్చిన నాలుగు పదాలతో న్యూటన్ గమన నియమాలు అంతర్గతంగా ఉండేలా ఒక కథ ను చెప్పడం అందులోని సందర్భాలలో దాగి ఉన్న నియమాలు వివరించడం, నిర్వహించిన కృత్యంలో గమన నియమాలను వివరించడం, పెన్ను పేపర్ ఉపయోగించకుండా గమన నియమాల ఆధాంగా ఇచ్చిన వివరాలతో సమస్యను సాధించడం, పటాన్ని చూసి శాస్త్రవేత్త ను గుర్తించడం, మధ్య మధ్య లో అప్రస్తుత ప్రసంగంతో ఆటంక పరచడం మొదలగు పది అంశాలతో నిర్వహించడం జరిగింది.

ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ ఎంతో ధారణాశక్తి కలిగిన మేధావులు నిర్వహించే అవధానాన్ని భౌతిక శాస్త్రం లో చేయడం చాలా గొప్ప విషయమని, ఇంత అలవోకగా అవధానాన్ని చేసిన అక్షయకు మంచి భవిష్యత్తు ఉందని భౌతిక శాస్త్రంలో వినూత్న ప్రయోగం చేసిన గైడ్ టీచర్ రాజేందర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు బిల్లా రఘునాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంటా రాజబాపు, మడక మధు, వెంకటేశ్వర్లు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇక నుండి సదరం సర్టిఫికెట్ బదులుగా యుడిఐడి కార్డులు

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు.**

**త్వరలో మీసేవలో కొత్తగా ఇన్సూరెన్స్, కొరియర్ సర్వీసులు...ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**

**ములుగు ప్రతినిధి,మార్చి 12 (జనంసాక్షి) :**



మీసేవ నిర్వాహకులందరూ యు డి ఐ డి (యూనిక్యూ డిసబిలిటీ ఐడి) అప్లికేషన్ పై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తెలిపారు .గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యుడిఐడి పోర్టల్, మీసేవ, ఆధార్ సాంకేతిక సమస్యల పై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇకనుండి సదరం సర్టిఫికెట్ కి బదులుగా యూనిక్ డిసబిలిటీ ఐడి కార్డుని ఇవ్వడం జరుగుతుందని దీని గురించి మీసేవ నిర్వాహకులు అందరికీ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దేశం లో ఎక్కడైనా ఈ కార్డు చెల్లుబాటు అవుతుందని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్లికేషన్ చేయాలని, త్వరలోనే డిజబులిటీ స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి స్లాట్ తేదీలను తెలియజేస్తామని తెలిపారు.మీసేవ నిర్వాహకులకు యుడిఐడి ఆన్లైన్ అప్లికేషన్ నమోదు గురించి ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ శిక్షణ ఇవ్వడం జరిగినది.ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ త్వరలోనే మీసేవలో కొత్తగా ఇన్సూరెన్స్, కొరియర్ సర్వీసులు మరియు బ్యాంక్ ఆధారిత కస్టమర్ సర్వీస్ లను పొందుపరచనున్నామని తెలిపారు.మళ్ళీ మీసేవ లకి మంచి రోజులు రాబోతు న్నాయని, కొత్త సర్వీసులపై అవగాహన కల్పించారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేయాలని తెలిపారు. మీసేవ అప్లికేషన్స్ చేసేటప్పుడు తప్పులు లేకుండా చేయాలని, చిన్న చిన్న తప్పుల వలన ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగ వలసి వస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో ప్రాంతీయ వైద్యశాల సూపరిటెంట్ డాక్టర్ జగదీష్, డిపిఎం పెన్షన్స్ రేవతి, టిజి టిఎస్ మేనేజర్ విజయ్, టిజి ఆన్లైన్ మేనేజర్ రాకేష్, 9 మండలాల మీసేవ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కర ఏర్పాట్లు

**కాళేశ్వరం, మార్చ్ 13 (జనం సాక్షి)**




కాళేశ్వర క్షేత్రం లో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా అభివృద్ధి పనుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 35 కోట్ల కేటాయించి 25 కోట్లు విడుదల చేసింది. దీంతో క్షేత్రంలో పుష్కర ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. పుష్కరాలకు రెండు నెలల సమయం మాత్రమే ఉన్నందున పనులు త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 23 పనులకు టెండర్లు పూర్తయ్యాయి. అందులో త్రివేణి అతిథి గృహంలో 7 లక్షలతో ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. ప్రముఖుల వాహనాలు నిలిపే స్థలం వద్ద ఫ్లోరింగ్ కోసం 30 లక్షలు, ప్రసాదం తయారీ వద్ద ఫ్లోరింగ్ కోసం 6 లక్షలు, ఉత్తరం వైపు ప్రసాదం హాల్ వద్ద 20 లక్షలు, కళ్యాణ మండపం నుంచి ప్రసాదం హాల్ వరకు ఫ్లోరింగ్ కోసం 40 లక్షలు, శ్రీ రాజరాజేశ్వరి అతిథి గృహం వద్ద ఫ్లోరింగ్ కోసం 41 లక్షలు ఖర్చు చేయనున్నారు. అలాగే 100 గదుల అతిథి గృహం వద్ద 88 లక్షలు, ధార్మిక భవనం నుంచి రాజగోపాలం వద్దకు 28 లక్షలు, సూర్యాలం నుంచి రాజగోపాలం వద్దకు 25 లక్షలు ఫ్లోరింగ్ కోసం వ్యయం చేయనున్నారు.

కళ్యాణ మండపం వద్ద తూర్పు ఉత్తర మూలలో కలుపుతూ 18 లక్షలు, క్యూలైన్ నుండి దక్షిణ రాజగోపురం వరకు 42 లక్షలు, సింగరేణి అతిథి గృహ ఆవరణలో 38 లక్షలతో, ధార్మిక భవనం ముందు పదిలక్షలతో ఫ్లోరింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. గులికోట అతిథి గృహం వద్ద ప్రహరి నిర్మాణానికి 15 లక్షలు, క్యూలైన్ వద్ద ఇనుప తీగలకు 15 లక్షలు వెచ్చించనున్నారు. గోదావరి నది సాధారణఘాట్ వద్ద హారతి వేదిక ,ఆర్చి నిర్మాణానికి 45 లక్షలు, కళ్యాణకట్ట నిర్మాణానికి 42 లక్షలు, పిండ ప్రధాన హాల్ నిర్మాణానికి 42 లక్షలతో పనులు చేపట్టనున్నారు. టెలిగ్రామ్ షెడ్డు కోసం 1.15 కోట్లు, ప్రసాద తయారీ రెండు అంతస్తుల భవన నిర్మాణానికి 1.12 కోట్లు, వెదురు కర్రలకు 15 లక్షలు ఇనుప గేట్లకు 20 లక్షలు వ్యయం చేయనున్నారు.

# 100 శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలి

### పంచాయతీ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి)

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలో100 శాతం ఆస్తి పన్నులు పంచాయతీ కార్యదర్శులు వసూలు చేయాలని, పంచాయతీ విధులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో పంచాయతీ శాఖ పని తీరుపై పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ,పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజుల వసూళ్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలు,ఇండ్ల ఆస్తి పన్ను 100 శాతం వసూలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం మరో 17 రోజులు మాత్రమే ఉందని,ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను చేరుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా తక్కువ ఆస్తి పన్ను వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ చేశారు. ఆస్తి పన్ను చెల్లించిన వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు.గ్రామాలలో అవసరమైన చోట ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆస్తి పన్ను విలువ పెంచాలని, రీ అసెస్మెంట్ చేసి సరైన ఆస్తుల విలువ ప్రకారం పన్ను వసూలు చేయాలన్నారు. గ్రామాలలో వ్యాపారాల ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సకాలంలో జరిగేలా చూడాలని, ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎక్కడైనా వ్యాపారాలు నిర్వహిస్తే సీజ్ చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ పన్ను ముందుగా వసూలు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాలలో మల్టీ పర్పస్ సిబ్బంది వేతనాలు ఎప్పటికప్పుడు పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలన్నారు.గ్రామాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అయన ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలలో అపరిశుభ్రత అధికంగా ఉంటుందని దీన్ని నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న ప్రభుత్వ భవనాల పరిసరాల్లో పరిశుభ్రత పట్ల శ్రద్ధ పెట్టాలని అన్నారు.రోడ్లను రెగ్యులర్గా శుభ్రం చేయాలని, ప్రతి రోజు ప్రజల నుంచి చెత్త సేకరణ జరగాలన్నారు. గ్రామాల్లో పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు క్లియర్ చేయాలన్నారు. ఆమోదించిన ఎల్ఆర్ఎస్. దరఖాస్తుల నుంచి ఫీజు వసూలు చేయాలని, దరఖాస్తుదారులను ఫాలో అప్ చేస్తూ మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా చూడాలని, ప్రజలు ప్రభుత్వం కల్పించిన 25శాతం రీబెట్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.ఎల్ఆర్ఎస్ చేసుకోకపోతే ఇంటి నిర్మాణం అనుమతులు, ఇతరులకు అమ్మేందుకు ఆస్కారం ఉండదని, ఎల్ఆర్ఎస్ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.ఈ సమావేశంలో డిపిఓ శరిపుద్దీన్, డిఎల్పిఓ నరేష్, డిటిసిపిఓ అన్సర్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శివ కల్యాణానికి రాజన్న ఆలయం ముస్తాబు

### ఐదు రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి)

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 16 ఆదివారం శివ కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆదివారం నుండి గురువారం వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు.అన్ని శివాలయాల్లో మహాశివ రాత్రి రోజు స్వామి వారి కల్యాణం జరుపుతుంటారు,కానీ వేములవాడ రాజన్న ఆల యంలో మాత్రం కామదహనం తర్వాత శివ కల్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తుంది. ఆదివారం ఉదయం స్వస్తి పుణ్యావచనం,అంకురార్పణ, దేవతా హ్వానం, 17న ఉదయం 10.40 గంటల నుంచి మధ్యాహ్నం 12.55 గంటల వరకు శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారి కళ్యాణం,19 న రథోత్సవం, 20 న ధర్మగుండంలో త్రిశూల యాత్ర,రాత్రి దేవాలయంలో ఏకాదశావరణలుజరుగుతాయి. శివ కల్యాణోత్సవానికి మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర,ఢిల్లీ నుండి శివపార్వతులు, జోగినిలు హాజరుకానున్నారు.

**ఐదురోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు**

శివ కళ్యాణం సందర్భంగా రాజన్న ఆలయంలో ఆదివారం నుండి గురువారం వరకు ఐదు రోజుల పాటు స్వామి వారికి భక్తులు నిర్వహించే ఆర్జిత సేవలు ,నిత్య కళ్యాణం,అభిషేకాలు, అన్న పూజలు పూజలు రద్దు చేసినట్లు ఆలయ ఈఓ వినోద్ రెడ్డి తెలిపారు. స్వామి వారి కళ్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఈవో కోరారు.

# దడ పుట్టిస్తున్న టూ వీలర్ల డబుల్ సౌండ్ "సైలెన్సర్లు"

### అడ్డూ అదుపూ లేని ధ్వని కాలుష్యం!

### భయ పడుతున్న ప్రజలు.

ఆదిలాబాద్ ప్రతినిది, (జనంసాక్షి)



ఆదిలాబాద్ పట్టణంలో ఇప్పుడు ఎటూ చూసిన ఒక్కటే భయం ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తూ మన దగ్గరలో బిగ్గరగా సౌండ్ చేస్తూ వెళ్ళి పోతుందోనన్న భయం పట్టుకుంది. ఎందుకంటే గత కొన్ని రోజుల నుంచి కొన్ని రకాల ద్విచక్ర వాహనాల నుంచి వివిధ రకాల డబుల్ సైలెన్సర్ ల ద్వారా విడుదల అవుతున్న పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ హడలెత్తిస్తున్నాయి. ఇటువంటి డబుల్ సైలెన్సర్ లు ఉన్న ద్విచక్ర వాహనాలు ప్రజల మధ్యన దగ్గరలో వచ్చి సైలెన్సర్ ద్వారా పెద్ద చప్పుడు చేస్తూ తరువాత మనం గుర్తు పట్టే లోపే క్షణాల్లో మన ముందు నుంచి మాయమౌతుండడంతో ఏమీ జరిగిందో తెలియని పరిస్తితి నెలకొంది.దీంతో రోడ్డు పైన వచ్చి పోయే పాద చారులు, షాపింగ్ చేస్తున్న వారు మహిళలు వృద్దులు, పిల్లలు ఈ సైలెన్సర్ల ద్వారా వచ్చే అతి పెద్ద ధ్వని ధాటికి గజగజ వణికిపోతున్నారు. పట్టణంలో ప్రతీ రోజు వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి.వాటిలో ఎక్కువ శాతం సైలెన్సర్ లలో వచ్చే సౌండ్ మామూలుగానే ఉంటుంది. కానీ కొంత మంది ఆకతాయిలు వారి వాహనాలకు ఉన్న సైలెన్సర్ లు పీకేసి ఆన్ లైన్ ద్వారా ఎక్కువ ధ్వనులు వచ్చే కొన్ని రకాల డబుల్ సైలెన్సర్లు ఎక్కువ శబ్దం వచ్చే ఉన్న వాటిని తెప్పించుకుని మరీ వారి ద్విచక్ర వాహనాలకు అమర్చు కుంటున్నారు. జనావాసాలు ఎక్కువగా ఉన్న చోట వాటిని తిప్పుతూ బండిని రేస్ చేస్తుండడం వల్ల ఒక్కసారిగా సైలెన్సర్ల నుంచి పెద్దగా రీ సౌండ్ వ్యాపింప జేస్తుండడంతో రోడ్డుపైన గుమి గూడి ఉన్న ప్రాంతంలో, ఇంకా షాపింగ్ చేస్తున్న ఏరియాలో ఉన్న ప్రజలు ఈ సౌండ్ దాటికి ఉలిక్కి పడుతున్నారు. మరికొంత మంది గజగజ వనికి పోతున్నారు. అంతగా ఈ ధ్వని సైలెన్సర్లు దడ పుట్టిస్తున్నాయి. దీంతో రోడ్డుపైన వెళ్లాలంటేనే ప్రజలు భయపడి పోతున్నారు. వీటి సౌండ్ ఒక కిలోమీటరు వరకు వినిపించడం గమనార్హం. ఇంతగా ఈ సైలెన్సర్ల ద్వారా వస్తున్న ధ్వని శబ్దాలు పట్టణంలో అల్లంత దూరం వరకు వ్యాపిస్తున్నాయి. కావాలని కొంతమంది ఆకతాయిలు జనాలు గుంపులు గుంపులుగా ఉన్న చోటు షాపింగ్ చేస్తున్న ప్రాంతాల్లో పెద్ద శబ్ద కాలుష్యం చేస్తూ ఎవరికి కనిపించకుండా బర్రుమని క్షణాల్లో అక్కడి నుంచి మాయమై పైసాచిక ఆనందం పొందుతున్నారు. ఇది ఇప్పుడు పట్టణంలో ప్రధాన సమస్యగా మారిపోయింది. సైలెన్సర్ల సౌండ్ అంటేనే ప్రజలు భయ పడుతున్న పరిస్థితి నెలకొంది. సైలెన్సర్ల ద్వారా ఇంత పెద్ద ధ్వని కాలుష్యంకు పాల్పడుతున్న ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేసి అదికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేక పోతే వాటి ధ్వనుల ధాటికి వయో వృద్దులు, చంటి పిల్లలకు వినికిడి సమస్య వంటి పెను ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అదికారులు ఇటువంటి ధ్వని కాలుష్యం చేస్తున్న ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఇవ్వాలి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 13 (జనం సాక్షి)



కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను అధిష్టానం గుర్తించాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ గంప ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మాజీ మంత్రి,ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్ కు మంత్రి పదవి ఇవ్వాలని,45 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించాలని, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్,ఆర్యవైశ్య జిల్లా మహాసభ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా గంప ప్రసాద్ మాట్లాడుతూ మైనారిటీ నేతగానే కాకుండా మెజారిటీ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరిగిందని,, కామారెడ్డి మరింతగా అభివృద్ధి కావాలంటే మంత్రి పదవిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం షబ్బీర్ అలికి ఇవ్వాలని, అన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఎన్నో శాశ్వత అభివృద్ధి పనులను పూర్తిచేసిన ఘనత ఉన్నదని అన్నారు. పార్టీలు మారిన వారికి పదవులు ఇస్తున్న అధిష్టానం పార్టీనే నమ్ముకుని ఉన్న వారిపైన సరియైన నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని అన్నారు.

# పేదలకు అండగా మంత్రి శ్రీధర్ బాబు

మంథని, (జనంసాక్షి)



తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గ పరిధిలోని మంథని మండలం అక్కేపల్లి గ్రామానికి చెందిన పేయ్యాల రాజేశ్వరి కు 75,000 ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. రాజేశ్వరి నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 85,000 రూపాయలు మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు గురువారం వారికి ఎల్ఓసి మంజూరు కాపీని హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు సదరు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# గ్రామీణ నియోజకవర్గాల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 13 (జనం సాక్షి)



రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా గురువారం సమీక్ష నిర్వహించారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏటీసీ ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. చర్చించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే సమర్పించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టర్లను కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ నియోజక వర్గాల్లో ఐ.టీ.ఐ. ల ఏర్పాటుకు అవసరమైన రెండు ఎకరాల చొప్పున భూములను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో ఐ.టీ.ఐ. ఉన్నదని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఏం.కోటేశ్వర్లు, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులు , పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ అయ్యేవరకు ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు పి సావిత్రి




ఎడపల్లి, మార్చి 13 ( జనంసాక్షి )

ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ పూర్తయ్యే వరకు అన్ని రకాల ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ గురువారం మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎడపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సావిత్రి ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు చేపట్టడం జరిగింది. సుప్రీం కోర్ట్ తీర్పు వచ్చిన రోజే నిండు శాసన సభలో మాటిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడుతాం అని చెప్పి దానికి విరుద్ధంగా ఫలితాలు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వర్గీకరణ పూర్తయ్యేవరకు అన్ని రకాల ఉద్యోగ నియామకాలను ఆపాలని, మాదిగలకు తీవ్ర అన్యాయం చేసేలాగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. షమీమ్ అక్తర్ నివేదికలో అనేక లోపాలున్నాయని అవి మాదిగ కులాలకు శాపంగా మారనున్నాయని అందువల్ల లోపాలను సరిచేయాలన్నారు. ఈరోజు నుంచి అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు మండల కేంద్రాల్లో దీక్షలు కొనసాగుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు అన్ని రకాల ఉద్యోగాల భర్తీ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య మాదిగ, జిల్లా మహి అధ్యక్షురాలు పి సావిత్రి, మండల అధ్యక్షులు ఎర్రోళ్ళ మారుతి, మండల ప్రధాన కార్యదర్శి పెరవలి నాగభూషణం, మండల మహిళా అధ్యక్షురాలు కర్రోళ్ళ లక్ష్మి, ఉపాధ్యక్షులు పోశెట్టి, అరుణ్, లక్ష్మణ్, లక్ష్మి, రమాదేవి, పద్మ, రుక్మాబాయి, గంగవ్వ, గంగారం తదితరులు పాల్గొన్నారు.

# తనిఖీలో బయటపడ్డ రేషన్ డీలర్ల అక్రమాలు

### 3రేషన్ షాపుల పై కేసు నమోదు చేసిన ఏఎస్ఓ వేణుగోపాల్

మంచిర్యాల ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి)

మంచిర్యాలజిల్లాలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం యదేచ్ఛగా కొనసాగుతుంది. ప్రతి నెల రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నా లారీ లేదా డీసీఎం లాంటి వాహనాలు బియ్యం తరలిస్తూ పట్టుబడుతూ ఉంటాయి. అధికారుల కళ్ళు కప్పి దొరకకుండా వందలాది టన్నుల బియ్యం అక్రమంగా జిల్లా బార్డర్ దాటి ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాయి.ప్రతి నెల 8 తారీకు నుండి 16వ తారీకు వరకు రేషన్ బియ్యాన్ని కొంతమంది అక్రమంగా తరలిస్తూ ఉంటారు. జిల్లాలోని కొన్ని రేషన్షాపుల్లో అయితే బియ్యం స్టాక్ ఉన్నప్పటికీ బియ్యం తీసుకువెళ్తామన్న లబ్ధిదారులకు డీలర్లు బియ్యం స్టాక్ లేదని చెబుతారు . బియ్యం అవసరం లేదు డబ్బులు కావాలని అడిగితే స్టాక్తో పనిలేకుండానే ఈపాస్ యంత్రంపై వేలిముద్రలు వేయించుకొని డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి . కిలో బియ్యానికి 10 నుండి 13 రూపాయల డబ్బులు ఇచ్చి పంపిన రేషన్ షాప్ డీలర్ 18 నుండి 20రూపాయలకు ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీరికితోడు కొంతమంది రేషన్ షాపుల వద్ద ఉంటూ బియ్యం కొనుగోలు చేస్తూ ఓ లోడు బియ్యం అయ్యే వరకు నిల్వ చేసుకొని రాత్రిపూట ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ ఇది ఒక జీవనోపాధి గా మార్చుకున్నారని చర్చ జరుగుతోంది.

**మూడు రేషన్ షాపులపై కేసు**

మంచిర్యాలజిల్లా వ్యాప్తంగా ఐదు రోజుల నుండి రేషన్ షాపులపై వచ్చిన ఫిర్యాదుల మేరకుజిల్లా అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి వేణుగోపాల్ తనిఖీలు నిర్వహించారు .హాజీపూర్ మండలం ముల్కల గ్రామానికి చెందిన రేషన్ షాప్ తనిఖీ చేయగా రేషన్ షాపులో 14క్వింటాళ్ల బియ్యం రికార్డులలో స్టాక్ కన్నా ఎక్కువగా ఉన్నాయని తెలిపారు .రామకృష్ణాపూర్ కు చెందిన ఒక రేషన్ షాపుతనిఖీ చేయగా రికార్డ్ లో ఉన్న స్టాక్ కన్నా 3.5 క్వింటాళ్ల బియ్యం తక్కువగాఉన్నట్లు తెలిపారు . వేమనపల్లి మండల కేంద్రంలో రేషన్ షాపులు తనిఖీ చేయగా 38వనెంబర్ షాపులో స్టాక్ రికార్డుల కన్న 13 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నాయనిపేర్కొన్నారు. మూడు షాపులపై 6ఏ కేసు చేసినట్లు ఏఎస్ఓ వేణుగోపాల్తెలిపారు.

# అంతర్ జిల్లా నేరస్తుడు అరెస్ట్

చెన్నూర్, మార్చి13 (జనం సాక్షి)

పట్టణంలో మూడు రోజుల క్రితం బంగారు గొలుసు దొంగతనం చేసిన అంతర్ జిల్లా నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం ప్రశాంత్నగర్కు చెందిన అల్లెపు కృష్ణ తండ్రి వెంకటయ్య(47) ను పోలీసులు అరెస్ట్ చేశారు. 10న జంగమనమ్మ భర్త నారాయణరెడ్డి పని నిమిత్తం పాత బస్టాండ్ ఏరియాకు రాగానే అల్లెపు కృష్ణ ఆమెను వెంబడిస్తూ మాటలో మాట కలుపుతూ కొంత దూరం వెళ్ళగానే ఆమెను గ్రోమోర్ షాప్ ప్రక్కన గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకొని వెళ్లి వృద్ధురాలి తన మెడలో ఉన్న బంగారు గొలుసు ఇవ్వమని లేకపోతే చంపుతానని బెదిరించి బలవంతంగా వృద్ధురాలి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసులు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో భాగంగా పై అధికారుల సూచనల మేరకు ఎస్సై వెంకటేశ్వరరావు తన సిబ్బందితో పట్టణంలో గాలిస్తుండగా 13 గురువారం ఉదయం కొత్త బస్టాండ్ ప్రాంతంలో పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న రెండు తులాల బంగారు గొలుసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అతనిపై గతంలో 58 కేసులు ఉన్నట్లు కొన్ని రోజుల క్రితమే జైలు నుండి బయటకు వచ్చినట్లు మద్యం త్రాగడానికి జల్సాలకు అలవాటు పడిన అతను దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించి నిందితుడిని పట్టుకోవడంలో కృషిచేసిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జైపూర్ ,ఇన్స్పెక్టర్ కే రవీందర్, ఎస్సై పి సుబ్బారావు ,ఎస్ఐ వెంకటేశ్వర్ రావు, ఎస్సై వి సంపత్ ,హెచ్ సి దేవేందర్ , జీవన్ లను జిల్లా పోలీస్ కమిషనర్ భాస్కర్ అభినందించి వారికి పారితోషకం అందజేశారు.

## వల్మిడి ఆలయానికి వేలం ద్వారా ఆదాయం రూ.4 లక్షల 91 వేలు

పాలకుర్తి, మార్చి 13 (జనంసాక్షి)

వల్మిడి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో 2025-2026 సంవత్సరం కొబ్బరి కాయలు. పూజా సామాగ్రి, లడ్డు పులిహొర, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు బహిరంగ వేలం పాట ద్వారా రూ.4,91,000. దేవాలయానికి ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు ప్రకటనలో తెలిపారు. బుధవారం వల్మిడి శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించారు. కొబ్బరికాయలు పూజా సామాగ్రి అమ్ముకునే హక్కు పాలకుర్తి మండల కేంద్రం చెందిన ముద్రబోయిన సంతోష్ కుమార్ రూ.2 లక్షలు పెచ్చు పాట పాడి దక్కించుకోగా, లడ్డు పులిహొర అమ్ముకునే హక్కు వల్మిడి గ్రామానికి చెందిన తాళ్ల నవీన్. రూ.2,60,000 బహిరంగ వేలం ద్వారా దక్కించుకున్నాడు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కొండూరు గ్రామానికి చెందిన పుల్ల ఎల్లగౌడ్ రూ 31,000 బహిరంగ వేలం పాట ద్వారా హక్కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటలక్ష్మి,పాటదారులు, ఆలయ, సిబ్బంది పాల్గొన్నారు



# నేషనల్ మార్కెటింగ్ విధానం కార్పొరేట్ సంస్థల కోసమే..

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆరోపణ
- కొత్త విధానం అమలైతే ఉద్యోగాలు పోవడమే కాదు, ఏటా వెయ్యి కోట్లు రాష్ట్ర సర్కార్‌కు గండి
- జాతీయ మార్కెటింగ్ విధాన ముసాయిదాపై రైతు కమిషన్ అధ్యయనం
- వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** నేషనల్ మార్కెటింగ్ విధానం కార్పొరేట్ సంస్థల కోసమేనని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆరోపించారు. వ్యవసాయ మార్కెటింగ్ పై జాతీయ విధాన ఫ్రేమ్ వర్క్ ముసాయిదా పేరుతో మార్కెటింగ్ వ్యవస్థను ప్రైవేట్ పరం చెయ్యాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈ కీలకమైన అంశంపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ గురువారం బీఆర్కే భవన్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్, భూమి సునీల్, రాములు నాయక్‌లతోపాటు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మలక్ పేట మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి హాజరయ్యారు. అగ్రికల్చర్, మార్కెటింగ్, సివిల్ సప్లై, మార్కెఫెడ్ డిపార్మెంట్ అధికారులు, రైతు సంఘాల నాయకులు, ఎన్జీవోలు, ఈ రంగంలో అనుభవం వున్న అనేకమందితో లోతుగా చర్చించింది. సూత్రప్రాయంగా భవిష్యత్‌లో కార్పొరేట్ వ్యవస్థ చేతుల్లోకి మార్కెటింగ్ వ్యవస్థ పోతుందని రైతు కమిషన్ నిర్ధారణకు వచ్చింది. ఇంకా దీనిపై ఒకటి రెండు సమావేశాలు నిర్వహించి భవిష్యత్ లో నేషనల్ మార్కెటింగ్ పాలసీ అమలైతే.. ఉద్యోగాలు పోవడంతోపాటు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా కోల్పోతుందని కమిషన్ హెచ్చరించింది. ప్రతియేటా మార్కెటింగ్ శాఖకు ఫీజుల రూపంలో 1000 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఇక మార్కెటింగ్ శాఖలో 2500 పైగా ఉద్యోగులు వివిధ స్థాయిలో పనిచేస్తున్నారు. ఇవన్నీ నేషనల్ మార్కెటింగ్ పాలసీ వస్తే కోల్పోయే అవకాశం ఉంది. దీనిపై రైతు కమిషన్ నిర్దిష్టమైన వ్యవసాయ మార్కెటింగ్ విధానం అమలు అయ్యేలా ఒక నివేదికను రూపొందించి త్వరలోనే ప్రభుత్వానికి ఇవ్వనున్నట్లు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతులు ఆనందంగా ఉండేలా పథకాల అమలు
- సీతారామ ప్రాజెక్టుతో 3లక్షల ఎకరాలకు సాగునీరు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**ఖమ్మం,మార్చి13(జనంసాక్షి) :** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. 'ప్రతి రైతు ఆనందంగా ఉండాలి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారులు వెంటనే స్పందించాలి' అని సూచించారు. అలాగే, 'రైతు భరోసా పథకం కింద ఈ నెలాఖరు వరకు రూ.10 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నాం' అని వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించబోతున్నాం అని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా బేతుపల్లి, లంకాసాగర్ ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు చేరనున్నాయి. అలాగే, శ్రీరామ చంద్రుని కృపతో కొద్ది నెలల్లోనే గోదావరి జలాలను సాగు కోసం వినియోగించగలమని తెలిపారు. జిల్లా సత్తుపల్లి మండలం యతాలకుంట గ్రామంలో సీతారామ టన్నెల్ వద్ద వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై విశేషాలు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో సత్తుపల్లికి ప్రత్యేక గుర్తింపు ఉందని, తాను రాజకీయ చైతన్యం వచ్చినప్పటి నుండి అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాల్లో రోడ్డు మార్గాలను విస్తృతంగా అభివృద్ధి చేశామని, ప్రస్తుతం ప్రతి గిరిజన గ్రామానికి రహదారులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్య కోసం పిల్లలు స్కూల్స్‌కు సులభంగా వెళ్లగలిగే పరిస్థితి రావడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజలకు నమ్మకం కలిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటే పెద్దగా ఇబ్బంది ఉండదని మంత్రి అభిప్రాయపడ్డారు. సత్తుపల్లిలో ఎలాంటి సమస్యలు లేవని, స్థానిక ఎమ్మెల్యే రాగమయి ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'పంటలు లాభసాటిగా ఉండేలా హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలి. హార్టికల్చర్ చేయలేని స్థితిలో ఉంటే వరి పండించండి' అని సూచించారు. ఫామాయిల్ ధర గతంలో రూ.1200గా ఉండేదని, ప్రస్తుతం అది రూ.20,800కి పెరిగిందని తెలిపారు. అలాగే, ఉగాది నాటికి ఖమ్మం జిల్లాలోని కల్లూరు గూడెంలో ఫామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. ఖమ్మం నుంచి రాజమండ్రికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం ఆగస్టు 15నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. దీనితో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని, వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. 'నా మొట్ట మొదటి కోరిక సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడమే' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ సహకారంతో ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసి, రైతులకు నీటిని అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సత్తుపల్లి అభివృద్ధిలో తమ ప్రభుత్వం కృషి చేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.

# మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతకరం

- స్పీకర్‌ను అవమాననించారంటూ ఆందోళన
- క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** 'సభ మీ సొంతం కాదు' అంటూ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడడం రచ్చకు దారి తీసింది. ఈ క్రమంలో మంత్రులు సభాపతితో భేటీ అయ్యారు. జగదీష్ రెడ్డి బే షరతుగా క్షమాపణ చెప్పాలని అందరూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై జగదీష్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. స్పీకర్‌పై ఇంత అహంకారంగా మాట్లాడటం తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజాస్వామ్యంలో స్పీకర్ చైర్‌కు కొన్ని అధికారాలు ఉంటాయని, దీనిపై సీరియస్ నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ అన్నారు. జగదీష్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకుని జగదీష్ రెడ్డి స్పీకర్‌ను బెదిరిస్తున్నారని.. ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఏడాదిలో ఏం చేయాలో చేసి తమ సత్తా చూపించామన్నారు. ఏం చేయబోతున్నమో కూడా చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు అసెంబ్లీ లాబీలో చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకపోతే స్పీకర్‌పై అవిశ్వాసం పెడతామన్నారు. నిన్న ముఖ్యమంత్రి అక్షింతలు వేయడం.. ఈరోజు సభలో కాంగ్రెస్ సభ్యులు రెచ్చిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీష్ రెడ్డి స్పీకర్‌ను అవమానించలేదని, 'సభ మీ ఒక్కరిదీ కాదు - సభ అందరదీ అని' జగదీష్ రెడ్డి అన్నారని, మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. మీ ఒక్కరిదీ అనే పదం అన్ పార్లమెంటరీ పదం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో తెలీయదని.. సభను ఎందుకు వాయిదా వేశారో తెలీదని అన్నారు. కాంగ్రెస్ డిపెన్స్‌లో పడిందని, స్పీకర్‌ను కలిశామని, రికార్డు తీయాలని అడిగామన్నారు. దళితుడుని అగౌవరం పరిచే విధంగా జగదీష్ రెడ్డి మాట్లాడలేదన్నారు. 15 నిమిషాల అయినా వీడియో రికార్డు స్పీకర్ తెప్పించలేదని, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాట్లాడకుండా బ్లాక్ చేశారని హరీష్ రావు అన్నారు.

# అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాటల యుద్ధం

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల విమర్శలు, ప్రతివిమర్శలు
- సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మండిపాటు
- సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడిచింది. స్టేచర్ అంశంపై ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదంటూ హస్తం నేతలు హెచ్చరికలు జారీ చేశారు. సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారని కాంగ్రెస్ నేతలు తెలుపగా.. రేవంత్ రెడ్డిని పిచ్చికుక్కలతో పోల్చారు బీఆర్ఎస్ శ్రేణులు. ఇంతకీ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎవరెవరు ఏం మాట్లాడాలో ఇప్పుడు చూద్దాం.

**కేటీఆర్ హుందాగా మాట్లాడాలి : ఆది శ్రీనివాస్**

కేటీఆర్ హుందగా మాట్లాడాలని రాజకీయాల్లో హుందగా నడుచుకుంటేనే బాగుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. స్టేచర్ గురించి ముందు మాట్లాడింది కేటీఆర్ అని.. సీఎం పదవి కంటే స్టేచర్ ఇంకేమైనా ఉంటుందా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. "కేటీఆర్ మీకు నాయకుడు కావొచ్చు కానీ సీఎం రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారన్నారు. తెలంగాణలో సీఎం పదవి కంటే ఇంకేమి స్టేచర్ ఉండదని స్పష్టం చేశారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు.

**సీఎంను అగౌరవపర్చే విధంగా హరీష్‌రావు మాటలు : బీర్ల ఐల్లయ్య**

హరీష్‌రావు ముఖ్యమంత్రి కుర్చీని అగౌరవపరిచే విధంగా మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం అడ్డుకునే ప్రయత్నం చేశారని.. తెలంగాణ ప్రజానీకం గమనిస్తోందని తెలిపారు. ప్రజా ప్రతినిధుల్లా కాకుండా పందికొక్కుల్లా వ్యవహరిస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యం, గవర్నర్, ముఖ్యమంత్రి అంటే బీఆర్ఎస్‌కు విలువలేదన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్టే స్థాయి లేని వారు ముఖ్యమంత్రి గురించి మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. వీళ్ళు పది సంవత్సరాలు చేయని అభివృద్ధిలో 15 నెలల్లో చేస్తే తల ఎక్కడ పెట్టుకోవాలో తెలుస్తలేదన్నారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రతిపక్ష హోదా నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి అంటూ ఐలయ్య డిమాండ్ చేశారు.

**సీఎం పదవి పరువుతీస్తున్న రేవంత్ : పాడి కౌశిక్ రెడ్డి**

ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతూ సీఎం పదవి రేవంత్ రెడ్డి తీస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. ఇలానే మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతోందన్నారు. 4వేల పెన్షన్ వస్తుంది అనుకుంటే ఇప్పుడు 4 ఎకరాల పంట ఎండిపోతుంది అనుకోలేదని చిన్నపిల్లవాడు చెప్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరును ప్రజలు చూస్తున్నారన్నారు. 10 సంవత్సరాల పాలనలో తెలంగాణ అభివృద్ధిని దేశానికి చూపెట్టారు కేసీఆర్ అని అన్నారు. సిగ్గు, శరం లేకుండా కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారని మండిపడ్డారు.

**రేవంత్ అలా మాట్లాడటం సబబు కాదు : గంగుల కమలాకర్**

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి పట్ల సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడటం ఎంత వరకు కరెక్టు అని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. '2009 నుంచి నేను అసెంబ్లీలో ఉన్న. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ లాంటి సీఎంలను చూశాను. రేవంత్ రెడ్డి లాంటి వ్యక్తిని ముఖ్యమంత్రిగా చూస్తున్న. చంద్రబాబు నాయుడు లాంటి నేతలను చూశాం. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి లాగా చూస్తున్నడు. కానీ మేము తెలంగాణ తెచ్చిన గొప్ప వ్యక్తిగా చూస్తున్నాం. కేసీఆర్‌ను చావాలని కోరుకుంటావా? రేవంత్ రెడ్డిని ఒక వ్యక్తిగా చూడలేదు. నిన్ను ఒక సీఎంగా చూస్తున్నాం. తెలంగాణ సీఎం అని రేవంత్ రెడ్డి అనుకుంటే పితృ సమానులైన కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి. ఒక తండ్రిలాగా ఉన్న కేసీఆర్ చావును ఎవరు కోరుకోలేదు. తెలంగాణ సమాజానికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి' అంటూ మాజీ మంత్రి గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు.

# రాష్ట్ర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** హోలీ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలన లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో దినదినాభివృద్ధి సాధిస్తూ, అగ్రగామిగా నిలుస్తున్న తెలంగాణలో అన్నివర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో హోలీ వేడుకలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఇందిరమ్మ ప్రభు త్వంలో ప్రజల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అందరూ సంతోషంగా పండుగ జరుపుకొని హోలీ ప్రాముఖ్యతను చాటాలని పిలుపునిచ్చారు. చిన్నా, పెద్ద, ఆడా, మగ తేడాలేకుండా ఉత్సాహంగా జరుపుకొనే హోలీ పండుగలో సహజమైన రంగులనే వాడాలని, రసాయన రంగులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ప్రజలందరికీ హోలీ కేళి శుభాకాంక్షలు

- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతకు ప్రతీక హోలీ కేళి పండగ అని, వసంత శోభ వెల్లివిరిసే హోలీ పండగ ప్రజల జీవితాల్లో నిత్య వసంతాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. హోలీ పండుగను సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని, ప్రకృతిని రక్షించమని హోలీ పండుగ మానవాళికి సందేశం ఇస్తుందని తెలిపారు.

# మహిళపై అఘాయిత్యం కేసులో అరెస్టు



**చెన్నారావుపేట, మార్చి 13 (జనం సాక్షి):** మండలంలోని ఓ గ్రామానికి చెందిన వితంతు మహిళ పై అదే గ్రామానికి చెందిన ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న ఆకుల అశోక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు చెన్నారావుపేట ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు. బుధవారం రోజున మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి మహిళను బలత్కారం చేశాడన్నారు. దీంతో మనస్థాపానికి గురైన వివాహిత మహిళ ఆత్మహత్యయత్నం చేసుకుందన్నారు. కుటుంబ సభ్యులు మహిళను చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ చేపట్టిన నెక్కొండ సిఐ శ్రీనివాస్ ఆకుల అశోక్ పై రేప్ కేసును నమోదు చేసి గురువారం రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

# సీఎం రేవంత్‌కు మతిభ్రమించింది

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** సీఎం రేవంత్‌రెడ్డికి మతి భ్రమించిందని, ఆయన ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్ట్రెచర్ మీద ఉన్నది కేసీఆర్ కాదు, నువ్వు.. అవును ముమ్మాటికీ 'నువ్వే' అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆర్ఎస్పీ అన్నారు. తన వినూత్న ఆలోచనాయుధాలతో తెలంగాణ సమాజానికి విముక్తి కల్పించి, మరో ప్రపంచం వైపు పరుగులు పెట్టించిన ఆ పోరాట యోధున్ని ఎదుర్కోలేక, కేవలం శాపనార్థాలు అనే స్ట్రెచర్ మీద తెలంగాణ లో తచ్చాడుతున్నది నువ్వు అని రేవంత్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ప్రజలు ఇచ్చిన అరుదైన అవకాశాన్ని వారికోసం వినియోగించే ఇంగింత జ్ఞానం కూడా లేని అజ్ఞానివి నువ్వు. నీ లాంటి వారిని ఉంచాల్సింది సచివాలయం, శాసనసభల్లో కాదు, సైకోలుగా మారిన మనుషులను మార్చే మానసిక చికిత్సాలయాల్లో. కేసీఆర్‌కు మీకు పోలికే లేదు అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ.. నీ లాగా మార్చురీల భాష మాట్లాడే సంస్కృతి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదు. కేసీఆర్ కూడా వాటిని ఎంకరేజ్ చేయరని నాకు మెల్లమెల్లగా అర్థమైతున్నది. నేను స్వయంగా చూసిన ఒక విషయం మీకు చెబుతా వినండి. కేసీఆర్ అధ్యక్షతన జరిగిన చాలా పార్టీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం నాకు వచ్చింది. ఏ రోజు కూడా ఆయన మీ పేరు ఎత్తి, మీ ప్రస్తావన కూడా తేలేదు. వారి ప్రసంగాలన్నీ ఆద్యంతం తెలంగాణ ప్రజల అమాయకత్వం, ఆవేదన, వారి భవిష్యత్తు, ఇంకా అసంపూర్తిగా ఉన్న ఎన్నో కలలు, బీజేపీ-కాంగ్రెస్ విధానాల వల్ల తెలంగాణ ప్రజలకు అన్ని రంగాల్లో జరుగుతున్న నష్టం, బీఆర్ఎస్ పార్టీ పాటించాల్సిన వ్యూహం, ప్రజలకోసం చేయాల్సిన పోరాటం చుట్టే తిరిగేవి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. కొంత మంది పార్టీ సీనియర్ సభ్యులు రాష్ట్రం అసమర్థుల చేతుల్లో పడ్డది అని అన్నపుడు, కేసీఆర్ వారిని వారించి "అలా మాట్లాడటం సరి కాదు, ప్రజాస్వామ్యం లో రేవంత్ రెడ్డితో సహా ఎవరికైనా ముఖ్యమంత్రి అయ్యే హక్కుంది, ప్రజల తీర్పును హుందాగా గౌరవించాలి, నిరంతరం వాళ్లను ఎడ్యుకేట్ చేయడమే మనం చేయాల్సిన పని" అని వారు చెప్పడం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఇప్పటికైనా సమయం మించిపోలేదు. రోజూ మీరు మీ యాంటీరూంలోకి ఒంటరిగా వెళ్లి అద్దం ముందు నిలబడి గట్టిగా మీ ప్రతిబింబంతో మీ సిగ్నేచర్ మార్చురీ భాష మాట్లాడండి. మీ ప్రతిబింబం నిజంగా నిజాయితీగా ఒప్పుకుంటే అదే భాష ముందు మీ కుటుంబంలో వాడండి.. మారండి లేదా ఆసుపత్రిలో చేరండి అని సూచించారు.

# వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్‌కు ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ ఎంపిక

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు
- భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక అధికారి కృష్ణ భాస్కర్





**హైదరాబాద్, మార్చి 3 (జనంసాక్షి) :** వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్‌కు తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ ఎంపికయ్యారు. స్టాటిస్టిక్స్, అనాలిటిక్స్ సంబంధించిన అంశంపై గత సంవత్సరం నుంచి ప్రపంచ బ్యాంకు ఫెలోషిప్ కోర్సు నిర్వహిస్తోంది. Massachusetts Institute of Technology (MIT) కోర్సులో మాస్టర్ ఆఫ్ అప్లైడ్ సైన్స్‌లో చదువుకొని అందులో చేసిన ప్రాజెక్టు వర్క్ ప్రధాన ఆధారంగా ఈ ఫెలోషిప్ కు ఎంపిక చేశారు. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఫెలోషిప్ కోసం 2600 పైచిలుకు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా 33 మంది ప్రభుత్వంలో పని చేసిన అధికారులను ఎంపికగా చేశారు. కాగా భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక అధికారి కృష్ణ భాస్కర్ కావడం గమనార్హం. ఫెలోషిప్ లో భాగంగా వాషింగ్టన్ డీసీలో తొమ్మిది రోజులపాటు నేరుగా ట్రైనింగ్ పొందేందుకు రావాలంటూ వరల్డ్ బ్యాంక్ అధికారులు కృష్ణ భాస్కర్‌కు ఆహ్వానం పంపారు. ఆరు నెలల కోర్సులో భాగంగా ప్రత్యేక శిక్షణ తదుపరి డిజిటల్ అనుబంధంగా ఈ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫెలోషిప్‌కు ఎంపికైన కృష్ణ భాస్కర్ అమెరికా వెళ్లడానికి ప్రభుత్వం అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కోర్సు కు సంబంధించిన వ్యయం మొత్తం వ్యయం మొత్తం వరల్డ్ బ్యాంక్ భరిస్తుంది. స్టాటిస్టిక్స్, అనాలటిక్స్ సంబంధించి అనుబంధాన్ని గుర్తించి ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో ప్రభుత్వ అధికారులను ప్రోత్సహించాలనేది వరల్డ్ బ్యాంక్ ఆలోచన. ఈనెల 18 నుంచి 27 వరకు అమెరికాలో ప్రత్యక్ష కోర్సు జరుగనుంది.

**కృష్ణ భాస్కర్ కు ఉపముఖ్యమంత్రి అభినందనలు**

ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బ్యాంక్ ఫెలోషిప్ కు ఎంపికైన తన స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ ను గురువారం అసెంబ్లీ ఆవరణలో అభినందించారు. భారతదేశ వ్యాప్తంగా ఒకే ఒకరు ఎంపిక కావడం అది మన రాష్ట్రానికి చెందిన ట్రాన్స్కో సీఎండి కావడం పై హర్షం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370